సంపుటి : 72 సంచిక : 46 పుటలు : 52

# జాగృతి

కలి 5121 - శ్రీ శార్వరి భాద్రపద శుద్ధ త్రయోదశి

వెల : ₹15/-

31ఆగస్టు -06 సెప్టెంబర్ 2020




# మేధో ఉగ్రవాదం

గాంధీలు సత్యం... గాంధీలే నిత్యం...

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/14814 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

72 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# నవయుగభారతి ప్రచురణలు

3-4-228/4/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ 500027, ఫోన్ : 040-27563236

**చారిత్రక, సాంస్కృతిక, సామాజిక అవగాహన కలిగించే శాశ్వత విలువలు గల గ్రంథములు**

జై భవానీ జై శివాజీ- పులివెర్ల సుబ్బారావు - 200.00
రాణాప్రతాప్ (చారిత్రక నవల) -డా॥ పులివెర్ల సాంబశివరావు - 120.00
పరమపూజనీయ డా॥ హెడగేవార్ - జీవితము-సందేశము - 90.00
భవిష్య భారతం- రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ దృష్టికోణం
డా॥ మోహన్ భాగవత్ గారి ఉపన్యాస మాలిక - 50.000
హిందూదేశంపై ముస్లింల దండయాత్రలకు అవిస్మరణీయ ప్రతిఘటనా పరంపర
- డా॥ శరద్ హెబాల్కర్, అను : బెల్లంకొండ మల్లారెడ్డి - 250.00
ఛత్రపతి శివాజీ మహారాజ్ - శ్రీ రామ్ సాఠే - 90.00
సమరసత వివాదం కాదు, నిబద్ధత - డా॥ వడ్డి విజయసారధి - 30.00
సామాజిక సమరసతా సాధన
- డా॥ మోహన్ భాగవత్, పూజనీయ బాలాసాహెబ్ దేవరస్ - 25.00
శ్రీ జోగేంద్రనాథ్ మండల్ రాజీనామా లేఖ - అను :బి. సారంగపాణి- 15.00
రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ కార్యకర్త - దత్తోపంత్ ఠెంగ్డీ - 180.00
నేను-మనువు-సంఘము - రమేష్ పతంగే - 120.00
మనము-భూమి-పర్యావరణము -కు.సీ.సుదర్శన్ తదితరులు - 80.00
రాష్ట్ర సేవిక సోదరి నివేదిత - కవి శేషాచలం - 30.00
ఇజ్రాయెల్ విముక్తిలో భారతసైనికుల వీరోచిత సమరం - 40.00
విద్యారణ్య విజయం (చారిత్రక నవల)- వి.వి.సుబ్రహ్మణ్యం - 200.00
ఆంధ్రమహాభారతమందించే మరువరాని మంచిమాటలు - 120.00
ఇదేమి చరిత్ర - సీతారాం గోయల్, ఆర్సి మజుందార్ - 130.00
చరిత్రపాఠాలను విస్మరిస్తే, భవిష్యత్తు ఎలా ఉంటుంది?-సావర్కర్- 60.00
ఆలోచనలు ఆలోకనలు - పాలంకి సత్య - 150.00
నవదివాకరుడు బాబాసాహెబ్ అంబేడ్కర్ -రమేశ్ పతంగే - 75.00
నిత్యస్మరణీయులు - డా॥ అన్నదానం వెం.సుబ్రహ్మణ్యం - 150.00
సద్గుణసంపద - దోనెపూడి వెంకయ్య - 150.00
సంఘమె తానై... బాళాసాహెబ్ దేవరస్ జీవితం - 200.00
హైందవ స్వరాజ్య అప్రతిహత పురోగమనం-యశ్వంత్ భావే - 60.00
డా॥హెడగేవార్ విస్తృత జీవిత ఘట్టాలు - 40.00
వందేమాతరం (చారిత్రక నవల)అను: డా॥ప్రసాదరాయ కులపతి-120.00
భీష్మయుధిష్ఠిర సంవాదం - దోనెపూడి వెంకయ్య - 40.00
దేశవిభజన విషాద గాథ - హెచ్.వి.శేషాద్రి - 200.00
ఏకాత్మమానవదర్శనం ఒక అధ్యయనం -వి.వి.నేనే, శ్రీవల్లీరాధిక- 75.00
దాచినా దాగని నిజాలు - 'స్వాతి' - 60.00
కర్మయోగి దీనదయాళ్ ఉపాధ్యాయ -పులుసు గోపిరెడ్డి - 60.00
ఆర్.ఎస్.ఎస్.ఏమిటి? ఎందుకు? - సురేశ్ చంద్రవాజపేయి - 30.00
దేశహితమేప్రధానం (దీనదయాళ్ఉపాధ్యాయ రాజకీయజీవితం)- 120.00
హైదరాబాద్ అజ్ఞాత చరిత్ర పుటలు - 120.00
సంస్కృతి ఎందుకు? - ఇందుపల్లి సత్యదేవ ప్రసాద్ - 30.00

వందేమాతరమన్న గొంతుమనదిరా - సౌదామిని - 50.00
కాంతిరేఖలు - శ్రీమన్నవ గిరిధరరావు - 140.00
వనికొచ్చే కథలు - " - 120.00
నూరు చిన్న కథలు - ఆచార్య కసిరెడ్డి - 80.00
జగద్గురు శంకరాచార్య - దీనదయాళ్ ఉపాధ్యాయ - 50.00
నేతాజీ సుభాష్చంద్రబోస్ - పులుసు గోపిరెడ్డి - 150.00
మన నూతన ప్రధాని నమో ఒక డైనమో - 90.00
మనజాతి చరితమిదిరా - చిట్టా దామోదరశాస్త్రి - 40.00
ఛత్రపతి శివాజీ - భండారు సదాశివరావు - 35.00
డా॥ బాబాసాహెబ్ అంబేడ్కర్ - డా॥ వడ్డి విజయసారధి - 50.00
భక్తి మార్గ ప్రచారకుడు సంత్ రవిదాస్ " " - 15.00
డా॥భీమరావ్ అంబేడ్కర్ జీవితంపై 108 ప్రశ్నలు " " - 10.00
ఆదర్శజీవితాలు - దీనానాథ్ బత్రా అను: దోనెపూడి వెంకయ్య - 40.00
మానవ సేవ మాధవ సేవ " " - 40.00
భారతమాత సేవలో " " - 40.00
దేశంకోసమే ఈ దేహం " " - 40.00
సాహసమే జీవితం " " - 40.00
మహనీయుల మార్గంలో " " - 40.00
అమరవీరుల అడుగుజాడలలో " " - 40.00
అందరిలో దేవుడు " " - 40.00
సమతా మూర్తి భగవద్రామానుజులు - బి.సారంగపాణి - 25.00
భారతీయప్రజ్ఞ తేజో కిరణాలు-రవికుమార్,అను:రాంపల్లి మల్లికార్జున్-40.00
1947 మాతృభూమి ముక్కలైంది - రాంమాధవ్ - 50.00
శ్రీ గురూజీ జీవనయజ్ఞం - ప్ర.గ.సహస్రబుద్ధే - 40.00
గోరక్షణ ఎందుకు? ఎలా? - 30.00
ఆవు-ఆరోగ్యము (పంచగవ్య చికిత్స)-డా॥గంగాసత్యం - 25.00
ఆవు మనందరికీ తల్లి " - 25.00
నిత్యజీవితంలో పంచగవ్యముల ఉపయోగములు " - 30.00
సృష్టి సంరక్షణలో భారతీయ ఆవు- శ్రీ శంకర్‌లాల్ - 50.00
ప్రార్థన - 40.00
ఇది మన భారతం - కె. జయదేవ్ - 50.00
చిరు దీపాలు - హైందవి - 120.00
అర్చన - 50.00
డా॥ అంబేడ్కర్ అంతరంగం - దత్తోపంత్ ఠేంగ్డీ - 30.00
మతంమార్పిడులు-మనం నేర్చుకోవల్సినపాఠాలు -రంగాహరి - 40.00
రాష్ట్రీయ స్వయంసేవక సంఘ లక్ష్యము-కార్యము - 40.00
రామాయణ మహాభారతాలు కల్పితగాథలా? చరిత్రా? - 50.00
స్వాతంత్ర్య వీర సావర్కర్ - అక్కిరాజు రమాపతిరావు - 40.00

**నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి:**

| | | | |
|---|---|---|---|
| సాహిత్యనికేతన్, కేశవనిలయం, 3-4-852, బర్కత్‌పురా, హైదరాబాద్-27, ఫోన్: 040 - 27563236 | సాహిత్యనికేతన్, ఏలూరు రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 520002 సెల్ : 9440643348 | సాహిత్యనికేతన్, విశాఖపట్నం సెల్ : 900066776 | భారతమాత బుక్‌హౌస్ తిరుపతి సెల్ : 9299901355 |

## జాగృతి చందా రెన్యూవల్ చేసుకునేవారికి

# ప్రత్యేక తగ్గింపు

కరోనా కారణంగా చందా రెన్యూవల్ చేసుకొనేవారికి ప్రత్యేక సౌకర్యం

1 సం॥ చందా రెన్యూవల్ చేసుకునే వారికి రూ.100/- (రూ. 650/-లకు బదులుగా రూ. 550/-లు),
5 సం॥ చందా రెన్యూవల్ చేసుకునేవారికి రూ.200/- (రూ.3000/-లకు బదులు రూ.2800/-లు) తగ్గింపు కలదు.
రెన్యూవల్ చేయునప్పుడు పాత మొబైల్ నెంబర్‌తో పాటు చందా కోడ్‌ను కూడా తప్పక రాయాలి,

1 సం॥ చందా రెన్యూవల్ రూ.550 /-
కోసం పక్కనున్న క్యు.ఆర్ కోడ్ లేదా
http://payit.cc/S8242 లింక్‌ని ఉపయోగించండి

5 సం॥ చందా రెన్యూవల్ రూ.2800 /-
కోసం పక్కనున్న క్యు.ఆర్ కోడ్ లేదా
http://payit.cc/S8309 లింక్‌ని ఉపయోగించండి

**ఈ అవకాశం 2021 మార్చి ఆఖరి వరకు మాత్రమే.**

కొత్తగా 1 సం. చందా కట్టేవారికి రూ. 650/-,
5 సం.ల చందా కట్టేవారికి రూ. 3000/- లు మాత్రమే.
మీ చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్ కోడ్
లేదా వాటి క్రింది లింక్‌లను ఉపయోగించండి.

1 సం. చందా రూ. 650/-
http://payit.cc/S14814

5 సం.ల చందా రూ. 3000/-
http://payit.cc/S14813

**వివరాలకు : 040-27561453, 9959997013**


పూర్తి వివరాలు 4వ పేజీలో..



దీపావళి సందర్భంగా

## వాకాటి పాండురంగారావు స్మారక కథల పోటీ

జాగృతి వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచిక కోసం
సుప్రసిద్ధ కథా రచయిత స్వర్గీయ వాకాటి పాండురంగారావు స్మారకార్థం
'కథల పోటీ-2020' ని ప్రకటిస్తూ కథా రచయితలకు ఆహ్వానం పలుకుతున్నది.

1. కథకులు సమకాలీనం, చారిత్రకం, సైన్స్ ఫిక్షన్ ఇతివృత్తంతో కూడిన కథలను పంపవచ్చు. ఇందులో భారతీయ సామాజిక జీవనమే నేపథ్యంగా ఉండాలి.
2. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు, ఎనిమిది కథలకు రూ. 1000 చొప్పున ప్రోత్సాహక బహుమతి, సాధారణ కథకు స్వీకరించిన ప్రతి కథకు పారితోషికం ఉంటాయి.
3. కథ నిడివి 1500 పదాలకు మించరాదు. ఒక రచయిత మూడు కథలకు మించి పంపరాదు.
4. కథ తన సొంతమేనని, అనువాదం, అనుసరణ కాదని, బ్లాగుల్లోనూ, వెబ్ పత్రికల్లోనూ మరెక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదనీ, పరిశీలనలో లేదనీ విడిగా హామీపత్రం జతచేయాలి. హామీపత్రంలో రచయిత పేరు, చిరునామా, ఇ-మెయిల్ ఐడి, ఫోన్ నంబర్ తప్పక రాయాలి. కథ రాసిన పుటలలో ఎక్కడా రచయిత పేరు గానీ, ఇతర వివరాలేవీ ఉండరాదు.
5. బహుమతి పొందిన కథలను జాగృతి దీపావళి సంచికలో ప్రచురిస్తాం. కొన్నిటిని సాధారణ ప్రచురణకు స్వీకరించి, వీలును బట్టి ఆ తర్వాత రాబోయే సంచికలలో ప్రచురిస్తాం.
6. కథలను తెలుగులో అను ఫాంట్ లేదా యునికోడ్ ఫాంట్‌లో డిటిపి చేసి jagriticompetition@gmail.comకు మెయిల్ చేయాలి. చేతి రాత అందంగా, న్యాయనిర్ణేతలకు అర్థమయ్యేలా ఉంటే స్కాన్ చేసి పంపినా పరవాలేదు. భాష అర్థంకాని, సరిగా స్కాన్ చేయని కథలు పోటీకి తీసుకోలేం.
7. కథను పోస్ట్ లేదా కొరియర్ ద్వారా పంపాలనుకుంటే 'జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, జాగృతి భవన్, కాచిగూడ, హైదరాబాద్-500027'కు పంపొచ్చు. అయితే జాగృతికి కథల్ని చేర్చే బాధ్యత రచయితలదే. (కరోనా ప్రభావం దృష్ట్యా తప్పనిసరి అయితేనే ఈ విధానం వాడుకోగలరు.)
8. కథల ఎంపికలో రచయితల ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావులేదు. సంపాదకునిదే అంతిమ నిర్ణయం.

ప్రథమ
ద్వితీయ
తృతీయ
బహుమతులు
వరుసగా
రూ.12,000
రూ.7,000
రూ. 5,000

**రచనలు జాగృతికి చేరడానికి చివరి తేది : 07 సెప్టెంబర్, 2020**

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, 1-1-60/5, Musheerabad, RTC 'X' Road, Hyderabad-500 020. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad -500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ | 9959310103 |
| కె. హరీష్ | సబ్ ఎడిటర్ | 9959991304 |
| డీఆర్ఎస్ నరేంద్ర | సబ్ ఎడిటర్ | 9441433188 |

డిజైనర్లు : సిహెచ్. కుమార్, జి. తుకారాం

## జాగృతి చందా – సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాము. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- బ్యాంకు ఖాతాలో నగదు వేసేవారు చార్జీలకింద మరో రూ.50 పంపాలి. ఆన్‌లైన్/చెక్ ద్వారా చెల్లిస్తే చార్జీలు ఉండవు. డబ్బు పంపాక 040-27561453 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- **A/c Name & No. Jagriti Prakashan Trust, 62170399960, SBI, Isamia Bazar Branch, IFSC : SBIN0005895, PAN : AAATJ3829L**
- చెక్కు, డిడిపై **Jagriti Prakashan Trust** అని ఆంగ్లంలో రాయాలి.

**మార్కెటింగ్, సర్క్యులేషన్, వ్యాపార ప్రకటనల వివరాల కోసం**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

బి. నాగరాజు సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

రాజకీయాలు సమాజ సేవకు ఉపకరణాలని కొందరి భావన. అధికార ప్రాప్తికి రాజకీయాలే శరణ్యమని కొందరి నమ్మకం. కొందరికి మాత్రం లాభదాయకమైన వృత్తుల్లో రాజకీయం కూడా ఒకటి. వ్యక్తులు తమ ఆలోచనలకు తగిన రాజకీయ పార్టీలను ఎంచుకోవడం కద్దు. సంఖ్యాధిక్యతే చెల్లుబాటయ్యే ప్రజాస్వామిక వ్యవస్థలో స్వార్థపరుల సంఖ్య పెరిగిన పార్టీల్లో రాజకీయ పునాదులే కదలడం చూస్తాం. అలాంటిది నాయకత్వంలోనే సిద్ధాంత నిబద్ధత లోపిస్తే సంభవించే విపరిణామాలు తెదేపా చరిత్రకు సాక్షులైన తెలుగు ప్రజలకు ప్రత్యేకించి చెప్పేపని లేదు.

దేశ రాజకీయాల్లో పోటాపోటీగా ఓ వెలుగు వెలిగిన కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల చరిత్రను పరిశీలిస్తే అధికార దాహం, వ్యక్తుల స్వార్థం ఎంతటి గొప్ప పార్టీలనైనా పతనపు అంచులకు చేర్చగలవని బోధపడుతుంది. జాతుల స్వయం నిర్ణయాధికార సిద్ధాంత పునాదులపై బ్రిటిష్ వ్యతిరేక పోరాటంలో భారత కమ్యూనిస్టులు పెద్దఎత్తున ప్రజాభిమానం చూరగొన్నారు. అంతర్జాతీయ రాజకీయాల మీద మోజుతో జాతీయ సిద్ధాంత నిష్ఠకు నీళ్లొదిలారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను హిట్లరు బూట్లు నాకే కుక్కగా చిత్రించి జాతి ద్రోహానికి పాల్పడ్డారు. నాటి నుండే భారత రాజకీయాల్లో కమ్యూనిస్టుల పతనం ప్రారంభమైంది. 1947 ఆగస్టు 15న బ్రిటిష్ పాలన అంతమై దేశం స్వతంత్రమైంది. నెహ్రూ ప్రధానిగా కేంద్రంలో తొలి జాతీయ ప్రభుత్వం ఏర్పడ్డది. హైదరాబాద్ సంస్థానానికి తరతరాల బూజులా పట్టిన నిజాం రాజు పాలన వదిలించడానికి కమ్యూనిస్టులు పోరాటం ప్రారంభించారు. నాటి హోం మంత్రి పటేల్ చేపట్టిన పోలీసు చర్య ఫలితంగా నిజాం లొంగిపోయాడు. తాము ఆశించిన రాజకీయ లబ్ధి చేకూరలేదని భావించిన కమ్యూనిస్టులు ఆ తరువాత కూడా పోరాటాన్ని కొనసాగించడం, సోవియట్ రష్యా అధినేత స్టాలిన్ చివాట్లు పెట్టడంతో విరమించడం చరిత్ర. 1962లో భారత సరిహద్దుల్లో చైనా దురాక్రమణకు తెగించిన తరుణంలోను, జమ్ము కశ్మీర్ విషయంలో షేక్ అబ్దుల్లా విభజన వాదాన్ని సమర్థించడంలోను కమ్యూనిస్టుల్లో జాతీయ

**లోపలి పేజీలలో...**

ముఖపత్ర కథనం
**మేధో ఉగ్రవాదం**
6లో






ధారావాహిక నవల
**అంబారి - 13**
– ఆకెళ్ల శివప్రసాద్
20లో

ధారావాహిక నవల
**రాజగురువు -23**
– పుట్టగంటి గోపీకృష్ణ


26లో

# జాగృతి

## సంపాదకీయం

శాలివాహన 1941 శ్రీ శార్వరి భాద్రపద శుద్ధ త్రయోదశి

**31 ఆగస్టు 2020, సోమవారం**

# వైకల్యం వ్యాధి, వైఫల్యమే మరణం!

నిష్ఠ కొరవడినట్లు చరిత్ర సాక్ష్యమిస్తోంది. కాంగ్రెస్ తరువాత భారత రాజకీయాల్లో అధికారం చేపట్టగల పార్టీగా ప్రశంశలు అందుకొన్న కమ్యూనిస్టులు జాతీయత, రాజకీయ నీతి కొరవడిన కారణంగా ఉప ప్రాంతీయ పార్టీల స్థితికి దిగజారిపోయారు.

అధికార దాహం, కుటుంబం చుట్టూ తిరిగే స్వార్థం, భజన పరుల స్తోత్రాలకు అలవాటు పడిన కారణంగా కాంగ్రెస్ పార్టీ అడుగులు వినాశనం దిశగా పడినట్లు తెలుస్తోంది. జాతీయ, ప్రాంతీయ స్థాయిల్లో సైతం సమర్థులను సాగనంపడం, వంది మాగధులను చేరదీయడం కాంగ్రెస్ నేతలకు తొలి నుండీ అలవాటు. స్వతంత్ర భారతావనిలో నెహ్రూ నాయకత్వంలోని తొలి జాతీయ ప్రభుత్వం నుండి డా.శ్యామాప్రసాద్ ముఖర్జీ వైదొలగడమే కాంగ్రెస్ ధోరణికి ప్రబల నిదర్శనం. డా.ముఖర్జీ ఆనాడు స్థాపించిన భారతీయ జనసంఘమే కాలాంతరంలో భారతీయ జనతా పార్టీగా రూపాంతరం చెంది నేడు కాంగ్రెస్‌కు చుక్కలు చూపిస్తోంది. కాంగ్రెస్‌కు దూరమైన వారు స్థాపించిన పార్టీలు కాంగ్రెస్‌ను సవాలు చేసే స్థాయికి ఎదిగినా కాంగ్రెస్ నేతలకు కనువిప్పు కలగలేదు. జనతా పార్టీ స్థాపనకు కారకులైన మొరార్జీ దేశాయి, నీలం సంజీవరెడ్డి, చంద్రశేఖర్ వంటి నేతలంతా కాంగ్రెస్‌కు దూరమయ్యాక శక్తిశాలురుగా ఎదిగి సత్తా చాటిన వారే. సోనియా హయాంలో పార్టీకి దూరమైన మమతా బెనర్జీ, శరద్‌పవార్, పి.ఎ. సంగ్మా వంటి వారు కాలాంతరంలో శక్తివంతులు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో అలా దూరమైన జగన్ దెబ్బకు కాంగ్రెస్‌కు నిలువ నీడ లేకుండా పోవడం తాజా చరిత్ర.

గొప్ప రాజకీయ పార్టీల ఉత్థాన పతనాలను శాస్త్రీయ దృష్టితో పరిశీలించి విశ్లేషించుకోవడం రాజకీయ రంగంలోని వారికి, ప్రజాస్వామ్య ప్రియులకు ప్రయోజనకారి కాగలదు. ఆరోగ్యవంతమైన మానవ దేహంలో సైతం నిత్యం అనేక కణాలు జీవశక్తి ఉడిగి నిర్జీవ స్థితికి చేరుకుంటుంటాయి. అలాగే చాలా కొత్త కణాలు పుట్టుకొస్తుంటాయి. శక్తి ఉడిగిన కణాలను తొలగించి, నూతన కణాలతో ఆ లోటును పూరించే జీవక్రియ కొనసాగుతున్న దేహం నిరంతరం జీవకళతో ఉంటుంది. ప్రకృతి సహజమైన ఈ జీవక్రియ నిరంతరం కొనసాగేలా శరీరంలోని ప్రాణశక్తి చూస్తుంటుంది. ఈ కర్తవ్య నిర్వహణలో ప్రాణశక్తి వైకల్య ఫలితం వ్యాధి కాగా సంపూర్ణ వైఫల్యం మరణం అవుతుంది. మానవ దేహంలో మాదిరే ఈ జీవక్రియ సంస్థలలో జరిగినప్పుడు ఉత్థాన, పతనాలు సంభవిస్తుంటాయి. మానవ దేహంలో ప్రాణశక్తి పోషించే పాత్రను రాజకీయ పార్టీల్లో అధినాయకత్వం నిర్వహించాలి. కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వంలోని వైకల్యమే దీర్ఘ వ్యాధి రూపంలో పార్టీని పీడిస్తున్నది. అదే జాతీయ పార్టీని ప్రాంతీయ పార్టీ కన్నా హీన స్థితికి దిగజార్చింది. వైకల్యం వైఫల్యంగా పరిణమించి పార్టీ మరణానికి దారితీయకముందే జాగ్రత్తపడాలి. ఆరోగ్యప్రదమైన రాజకీయాలకు బాధ్యతాయుతమైన ప్రతిపక్షం బ్రతికి ఉండాలనే ఆశతో కాంగ్రెస్‌పార్టీ దీర్ఘ వ్యాధి నుండి బయటపడి, కోలుకోవాలని ఆశిద్దాం! ★

**అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ**

– బృహదారణ్యకోపనిషత్


గాంధీలు సత్యం... గాంధీలే నిత్యం... (జాతీయం) – 10
పాక్‌ను చుట్టుముట్టిన ఆర్థిక కష్టాలు (అంతర్జాతీయం) – 12
'ప్రకృతిని జయించాలనుకోవద్దు!' (వేదిక) – 15
కాంగ్రెస్ బాటలో తెలుగుదేశం (ఆంధ్రప్రదేశ్) – 16
ఆధ్యాత్మికం – 18
అమీర్ ఖాన్‌ను అర్థం చేసుకోండి (జాతీయం-1) – 24
మధునాపంతులవారి మహేతిహాసం 'ఆంధ్రపురాణం' – 30
అవీ ఇవీ – 35
బ్రష్ కింద బ్రహ్మాండం – 36
వార్తా విశేషాలు – 38
తెలుసుకోండి (కథ) – 40
మోదీ వైపే అభిమానుల చూపు (క్రీడ) – 43
సర్వతో జయమంగళం (కథ) – 44
బాలజాగృతి – 46
వార్తా విశేషాలు – 48
వారఫలాలు – 49
సుశాంత్ మరణంతో డొంక కదిలిందా! (సినిమా) – 50


**గమనిక:** ఘనశ్యామల ప్రసాదరావు–జాగృతి పాటల పోటీలో ప్రథమ బహుమతి పొందిన గేయం 'ఇది సంఘ శాఖయే' రచయిత పేరు పీఎం కృష్ణమూర్తి అని వెలువడింది. ఆ గేయకర్త పేరు గున్నా కృష్ణమూర్తి. పొరపాటుకు చింతిస్తున్నాం.



22లో

ప్రత్యేక వ్యాసం

**'ఓనమాలు' దేవుడికి వందనాలు**

కథ

**తీసివేత**

– కొత్తపల్లి ఉదయబాబు



32లో

**ఏదైనా సరే, ఎవరిదైనా సరే- ఒక పుస్తకంలో ఏ విషయం ఉండాలి? అదెలా రాయాలి? రచయితలు/రచయిత్రులు ఎవరివైపు మొగ్గాలి? ఎవరిని చీల్చిచెండాడాలి? ఎవరు అచ్చువేయాలి? ఎవరు ఆవిష్కరించాలి? ఇవన్నీ మేమే శాసిస్తాం అంటున్నారు ఈ దేశంలో ఉదారవాదులు, వామపక్ష మేధావులు. ఏ రచన అయినా వాస్తవాలను కాదు, మా వాదనలనే సమర్థించాలంటున్నారు. అంతేనా, రచయితలూ, ప్రచురణ సంస్థలూ మేం నిలబడమంటే నిలబడాలి. కూర్చోమంటే కూర్చోవాలి అంటున్నారు. అచ్చయిన పుస్తకమైనా ఉపసంహరించుకోమని ఫత్వా ఇస్తే తలొగ్గవలసిందేనంటున్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛా పరిరక్షణ మీద పేటెంట్ మాదే అంటూ విర్రవీగే ఉదారవాదులు, వామపక్ష మేధావుల తీరు అక్షరాలా ఇదే. ఢిల్లీ రయిట్స్ 2020: ది అన్‌టోల్డ్ స్టోరీ' అనే పుస్తకం విషయంలో ఇప్పుడు ఈ దేశంలో సరిగ్గా జరిగింది కూడా ఇదే. అందుకే ఈ దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ మాఫియాల చేతుల్లోకి పోయిందా అన్న ప్రశ్న పదునెక్కుతున్నది.**

# మేధో ఉగ్రవాదం

పుస్తకాల గురించి, వాటిలోని అంశం గురించి వివాదాలు లేవడం, లేవనెత్తడం కొత్త కాదు. చర్చకు దారితీయడం కూడా సర్వసాధారణం. కానీ ఆగస్టు 22, 2020న ప్రఖ్యాత ప్రచురణ సంస్థ బ్లూమ్స్‌బరీ 'ఢిల్లీ రయిట్స్ 2020: ది అన్‌టోల్డ్ స్టోరీ' పుస్తకాన్ని హఠాత్తుగా ఉపసంహరించుకోవడం ఇలాంటి చర్చలకు కొత్త మలుపు. ఈ ఫిబ్రవరిలో ఈశాన్య ఢిల్లీలో జరిగిన అల్లర్ల గురించి చెప్పిన పుస్తకమిది. మోనికా ఆరోరా, సోనాలీ చితాల్కర్, ప్రేరణా మల్హోత్రా రాశారు. సరిగ్గా ఆవిష్కరణ రోజే (ఆగస్టు 22), కార్యక్రమానికి కొంచెం ముందే ఈ పుస్తకాన్ని మార్కెట్ నుంచి ఉపసంహరించుకున్నట్టు ప్రకటించి బ్లూమ్స్‌బరీ పెద్ద వివాదమే రేపింది. బ్లూమ్స్‌బరీ చర్య భావ ప్రకటనా స్వేచ్ఛకు పూర్తిగా విరుద్ధమన్నదే ఇప్పుడు గట్టిగా వినిపిస్తున్న వాదన. ఆ ప్రచురణ సంస్థ మీద ఒత్తిడి తెచ్చి కొందరు ఉదారవాదులు, వామపక్ష మేధావులు ఆ పుస్తకాన్ని ఉపసంహ రించునేటట్టు చేశారని విమర్శలు వెల్లువెత్తాయి. అయినా పుస్తకావిష్కరణ జరిగింది. దాదాపు రెండుగంటల పాటు జరిగిన ఈ కార్యక్రమం పూర్తిగా భావ ప్రకటనా స్వేచ్ఛ, దాని పరిధి మీదే సాగింది. గరుడ ప్రకాశన్ అనే సంస్థ ఈ పుస్తకం వెలువరించడానికి అంగీకరించింది. ఇటీవలి కాలంలో ఎప్పుడూ చూడని రీతిలో పెచ్చరిల్లిన ఢిల్లీ అల్లర్లకు 53 మంది బలయ్యారు. మరో నాలుగు వందల మంది గాయాల పాలయ్యారు. కోట్ల రూపాయల ఆస్తి నష్టం జరిగింది.

జరుగుతున్న దానిని బట్టి ఉదారవాదులు, వామపక్ష మేధావుల ఉద్దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ ఎలాంటి రచనలకు వర్తిస్తుంది? అవి రాజ్యాంగ విరుద్ధంగా ఉండాలి. దేశ సమైక్యతకు భంగకరమైనవీ, ఐక్యతకు చేటు చేసేవీ కావాలి. మైనారిటీలను రెచ్చగొట్టేవీ, మెజారిటీ మతస్థుల మనోభావాలను గాయపరిచేవీ అయి ఉండాలి. జియాయుస్ సలామ్, ఉజ్మా అసఫ్ రాసిన, బ్లూమ్స్‌బరీయే ప్రచురించిన 'షాహిన్‌బాగ్: ఫ్రం ఎ ప్రొటెస్ట్ టు ఏ మూవ్‌మెంట్' పుస్తకం దీనికి గొప్ప ఉదాహరణ. షాహిన్‌బాగ్ ఉదంతం గాంధీ అహింసోద్యమానికి ఆధునిక నమూనాగా కీర్తిస్తున్నారు. కానీ వాస్తవాలతోనే అయినా మైనారిటీల ప్రమేయం అధికంగా ఉన్న ఢిల్లీ మత కల్లోలాల గురించి రుజువైన వాదనలు ఉన్నా ఆ పుస్తకం వెలుగు చూడకుండా తమదైన శైలిలో కుయుక్తులు, కుట్రలు పన్నుతున్నారు. రంధ్రాన్వేషణే ధ్యేయంగా కువిమర్శలతో రెచ్చిపోతున్నారు. కాబట్టి భావ ప్రకటనా స్వేచ్ఛ అంటూ ఉదారవాదులు, వామపక్షవాదులు చెప్పేదంతా ఒట్టి బూటకమేనని బాహాటంగానే విమర్శలు వస్తున్నాయి.

ఈ పుస్తక ఆవిష్కరణోత్సవానికి బీజేపీ నాయకుడు కపిల్ మిశ్రా ముఖ్య అతిథి. మిశ్రా ఈశాన్య ఢిల్లీ దాడుల సందర్భంగా రెచ్చగొట్టే ఉపన్యాసాలు చేశాడని ఆరోపణ. అది నిజం కాదని తరువాత పోలీసులు తేల్చి చెప్పారు. సీఏఏ వ్యతిరేక ప్రదర్శనలు జరుగుతున్న ప్రాంతాలను మినీ పాకిస్తానంటూ మిశ్రా ఈసడించారంటూ ఒక వీడియో వైరల్ అయింది. మరొక వీడియో ప్రకారం ఆయన పోలీసుల



ఆదేశాలను తోసిరాజని రాజ్యాంగ బాధ్యతను అగౌరవపరిచారు. ఆయనే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను భారత్‌-పాక్‌ మధ్య ఎన్నికలుగా పేర్కొన్నారనీ, ఇది అన్యాయమనీ కొందరు ఆరోపిస్తున్నారు. కార్యక్రమానికి అధ్యక్షునిగా భూపేంద్ర యాదవ్‌ వ్యవహరించారు. ఆయన బీజేపీ ఎంపీ. 'ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు ఉండడం ఆమోదయోగ్యమే. అయితే ఒక అంశాన్ని చూసేటప్పుడు ఒకరు రాజ్యాంగం పరిధిలో చూడడం, వేరొకరు అందుకు భిన్నంగా చూడడం సాధ్యం కాదు' అన్నారు భూపేంద్ర. 'రాజ్యాంగబద్ధ సంస్థల పట్ల, రాజ్యాంగం మేరకు జరిగిన ఎన్నికల పట్ల గౌరవంగా వ్యవహరించడానికి మనం సిద్ధపడాలి. అయితే అర్బన్‌ నక్సల్స్‌గా పేరు పడిన వారూ, జీహాదిస్టులూ ఈ సూత్రంలోని భారతీయతను బలహీనపరుస్తున్నారు. ఈ అంశాన్నే ఈ పుస్తకంలో గాఢంగా పొందుపరిచారు' అని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఇదంతా ఆన్‌లైన్‌ కార్యక్రమమే. ఆప్‌ఇండియా ఎడిటర్‌ నూపుర్‌శర్మ ఆవిష్కరణోత్సవంలో ఆహ్వానితులుగా ఉండడం కూడా ఉదారవాదులకు నచ్చలేదు. నూపుర్‌ ఢిల్లీ అల్లర్ల మీద ఆధారాలు లేని వార్తలు ఇచ్చారని ఆరోపణ. ఇవన్నీ ఉదారవాద ముద్రాంకితులు, వామపక్ష ప్రముఖులు, స్వయం ప్రకటిత మేధావులు చేస్తున్న, రాస్తున్న ఆరోపణలు.

మరొక అంశం కూడా ఉదారవాదులకు, వామపక్ష మేధావులకు మింగుడుపడనిదేనని ఒక అభిప్రాయం ఉంది. అది, ఆ ముగ్గురు రచయిత్రుల నేపథ్యం, ఆలోచనా ధోరణి. రచయిత్రులలో ఒకరు, ఆవిష్కరణ తరువాత జరిగిన చర్చలో వక్త ప్రేరణ మల్హోత్రా వ్యక్తం చేసిన అభిప్రాయం గమనించాల్సిందే. 'వామపక్ష ముఠా, ఇస్లామిక్‌ ఛాందసవాదులు పథకం ప్రకారం అమలు చేసిన కుట్ర ఫలితమే, ఢిల్లీ దాడులు' అన్నారామె. అవి కేవలం దాడులు కావు, భారత్‌లో మావోయిస్టు తరహా తంత్రంతో తొలిసారి నగర ప్రాంతంలో జరిగిన యుద్ధమని ఆమె వాదించారు. మరొక రచయిత్రి సోనాలి చితాల్కర్‌, 'ఔను, ఈ పుస్తకానికి ఒక వైఖరి ఉంది. అది ముస్లిం ఛాందసశక్తులకు, అర్బన్‌ నక్సల్స్‌కు వ్యతిరేకమైనదని చెప్పడానికి గర్వపడుతున్నాను' అన్నారు. అలాగే ఈ పదాన్ని (అర్బన్‌ నక్సల్స్‌) ప్రపంచానికి పరిచయం చేసినందుకు వివేక్‌ అగ్నిహోత్రికి ధన్యవాదాలు చెబుతున్నానని అన్నారు. ఆయన కూడా ఈ కార్యక్రమానికి ఆహ్వానితుడే. మరొక అతిథి నూపుర్‌శర్మ ఆ దాడులు ఏ విధంగా హిందూ వ్యతిరేకమైనవో రుజువు చేయడానికి తన వంతు ప్రయత్నం చేశారు. రచనలో కీలక పాత్ర వహించిన మోనికా అరోరా, ఆనాటి కపిల్‌ మిశ్రా ప్రసంగాన్ని (షాహిన్‌బాగ్‌కు వ్యతిరేకంగా) సమర్థించారు. రోడ్లను కబ్జా చేసిన వారి పట్ల ఎవరైనా అదే విధంగా మాట్లాక తప్పదని అన్నారు. ఈమె బీజేపీ మద్దతుదారు అని, రాష్ట్ర స్వయం సేవికా సమితి, ఏబీవీపీ నేపథ్యం ఉందని, 2003లో ఢిల్లీ ఎన్నికలలో బీజేపీ టికెట్‌ మీద పోటీ చేసిన సంగతి వెంటనే తెలుసుకున్నారు ఉదారవాదులు. ఇంకొక వాదన కూడా చేస్తున్నారు. 2014లో వెండీ డొనీగర్‌ రాసిన హిందూయిజం పుస్తకాన్ని నిషేధించాలంటూ దాఖలైన వ్యాజ్యంలో అరోరా వాదించారట (ఈమె న్యాయవాది). వెండీ హిందూయిజం మీద అవాకులు చవాకులు రాశాడన్నది తెలిసినదే. అది భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో ఒక రచయిత హిందూ పురాణాలను, ఆచారాలను అవహేళన చేసినందుకు జరిపిన న్యాయ పోరాటం. కొత్త పుస్తకం కొన్ని మాసాల క్రితం జరిగిన మత ఘర్షణకు సంబంధించినది. అందులో ఎవరి పాత్ర ఏమిటో చెప్పే ప్రయత్నం చేసింది. ఓ 'అన్‌టోల్డ్‌ స్టోరీ'. మరుగున పడిన కొన్ని విషయాలను వెలుగులోకి తేవడం. ఈ పుస్తకోదంతం మొత్తానికి కొసమెరుపు వంటి అంశం ఇంకొకటి ఉంది.

జియాయుస్‌ సలామ్‌, ఉజ్మా అసఫ్‌ అనేవారు రాసిన పుస్తకాన్ని కూడా బ్లూమ్స్‌బరీయే ప్రచురించింది. దాని పేరు, 'షాహీన్‌బాగ్‌: ఫ్రం ఎ ప్రొటెస్ట్‌ టు ఏ మూవ్‌మెంట్‌'. షాహిన్‌బాగ్‌లో వినిపించిన నినాదాలు, దాని అభిప్రాయాలు ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుంటే ఈ మేధావుల అసలు రూపం, ఎజెండా అర్థమవుతాయి. షాహిన్‌బాగ్‌ శిబిరం నిర్వహణ వెనుక మరో ప్రత్యేక దేశం ఏర్పాటు బీజాలు ఉన్నవనే ఎక్కువ మంది భారతీయుల అభిప్రాయం. కానీ 'ఢిల్లీ నుంచి చెన్నయ్‌ వరకు ఎన్నో షాహిన్‌బాగ్‌లు. ఆ శిబిరాలలోని వారందరికి ఒక చేతిలో భారత రాజ్యాంగం, మరొక చేతిలో త్రివర్ణ పతాకం. షాహిన్‌బాగ్‌ ప్రగాఢ ప్రజాస్వామ్య భావనకి, సెక్యులర్‌ యాత్రకి ప్రతీకగా మారింది' అంటూ ఆ పుస్తకం వెనుక ఇచ్చిన బ్లర్బ్‌లో కీర్తించారు. మనసును ద్రవింపచేసే సాహసోపేత మహిళల గాథ అంటూ కూడా వ్యాఖ్యానించడం కనిపిస్తుంది. ఇది ఆధునిక కాల గాంధేయవాద ఉద్యమమని ఆకాశానికి

**'పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) వ్యతిరేకిస్తూ చెలరేగిన ఆందోళనలు వామపక్ష, ముస్లిం ఛాందసవాదుల ప్రోద్బలంతో జరిగాయని, సీఏఏ వ్యతిరేక అల్లర్లన్నింటి వెనుక ఉన్నది ఖిలాఫత్‌ నాయకులేనని ఆ ముగ్గురు రచయిత్రులు ఆధారం లేకుండా రాశారని కూడా మేధావులు తీర్పు ఇచ్చేశారు. ఒక మూక ఉన్మాదమే సీఏఏ వ్యతిరేకత చుట్టూ ఉందని రాయడం వారికి నచ్చలేదట.'**




**'జాగృతి-2020' పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కార్టూన్**



ఎత్తేశారు. సీఏఏ పేరుతో ముస్లింల పట్ల అనుసరిస్తున్న వివక్షకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంగా దీనిని అంచనా వేశారు. ఇది సత్యమని ఈ దేశంలో ఎంతమంది చెప్పారు? ఇది చాలు, ఇక్కడి మేధావులు ప్రచురణ సంస్థలను ఏ విధంగా శాసిస్తున్నారో చెప్పడానికి. బ్లూమ్స్‌బరీ చర్య భావ ప్రకటనా స్వేచ్ఛను దారుణంగా భంగపరిచేదనని రాజ్యసభలో బీజేపీ సభ్యుడు డాక్టర్ సుబ్రహ్మణ్యస్వామి వ్యాఖ్యానించారు. అసలు భారతీయ ప్రచురణ రంగాన్నే లెఫ్ట్ మాఫియా శాసిస్తున్నదని ఆయన ఆరోపిస్తున్నారు. ఈ దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛా దూతలుగా చెలామణి అవుతున్నవారు ప్రచురణకర్తలను భయపెట్టి ఇలాంటి చర్యకు పాల్పడేటట్టు చేశారని ప్రముఖ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ చక్కగానే చెప్పారు. ఈ పుస్తకాన్ని ఉపసంహరించుకునేటట్టు ఒత్తిడి తేవడంలో విలియం డాల్రింపుల్, ఖాలేదా హోసిని, కామిలా షామీస్, ఆతిష్ తాసిర్ (తవ్లీన్ సింగ్ కుమారుడు)




**'ఢిల్లీ నుంచి చెన్నయ్ వరకు ఎన్నో షాహిన్‌బాగ్‌లు. వారందరికి ఒక చేతిలో భారత రాజ్యాంగం, మరొక చేతిలో త్రివర్ణ పతాకం. షాహిన్‌బాగ్ ప్రగాఢ ప్రజాస్వామ్య భావనకి, సెక్యులర్ యాత్రకి ప్రతీకగా మారింది. ఇది మనసును ద్రవింపచేసే సాహసోపేత మహిళల గాథ, ఆధునిక గాంధేయవాద ఉద్యమం. సీఏఏ పేరుతో ముస్లింల పట్ల అనుసరిస్తున్న వివక్షకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం.'**

ఉన్నారని 'అర్బన్ నక్సల్స్' రచయిత, బాలీవుడ్ ప్రముఖుడు వివేక్ అగ్నిహోత్రి ఒక వీడియో ద్వారా ఆరోపించారు. అయితే వీరిలో ఖాలేదా (ఆఫ్ఘనిస్తాన్) తన ప్రమేయం ఏమీ లేదని తరువాత ఖండించారు. కాంగ్రెస్ తన వైఖరిని స్పష్టం చేస్తూ, బ్లూమ్స్‌బరీ చర్యనే సమర్థించింది. కపిల్ మిశ్రా హాజరవు తున్నప్పటికి ఎంతో ధైర్య సాహసాలతో బ్లూమ్స్‌బరీ పుస్తకాన్ని మార్కెట్ నుంచి ఉపసంహరించుకుందని ఆ పార్టీ ప్రతినిధి అభిషేక్ మనుసింఘ్వి ప్రశంసలు కురిపించారు. అయితే సామాజిక మాధ్యమాలలో విమర్శలు వెల్లువెత్తిన తరువాత బ్లూమ్స్‌బరీ ఎవరినీ సంతృప్తి పరచలేని ఒక వివరణ ఇచ్చింది. 'వాస్తవ నివేదికతో, రచయిత్రులు జరిపిన ముఖాముఖీలు ఇచ్చిన ఆధారాలతో రాసిన 'ఢిల్లీ రయిట్స్ 2020: ది అన్‌టోల్డ్ స్టోరీ' పుస్తకాన్ని సెప్టెంబర్‌లో ఆవిష్కరించాలని బ్లూమ్స్‌బరీ భావించింది. బ్లూమ్స్‌బరీ భావ ప్రకటనా స్వేచ్ఛకు అత్యున్నత గౌరవం ఇస్తుంది. అలాగే సమాజం పట్ల ఉన్న బాధ్యతను గుర్తెరిగి ఉంటుంది' అని ప్రకటించింది. అలాగే ఆగస్టు 22 నాటి ఆవిష్కరణ కార్యక్రమంలో అతిథుల జాబితాకు తాము ఆమోద ముద్ర వేయలేదనే ఆ సంస్థ ముక్తాయించింది.

విమర్శకులు- అంటే ఉదారవాదులు, వామపక్ష వాదులు ఈ పుస్తకం నిండా అవాస్తవాలు ఉన్నాయని ప్రచారం మొదలు పెట్టారు. నిజానికి ఆవిష్కరణోత్సవ ఆహ్వానపత్రంలో బీజేపీ ప్రముఖులు, వామపక్ష వ్యతిరేకుల పేర్లు ఉన్నందునే పుస్తకాన్ని మార్కెట్ నుంచి ఉపసంహరించుకోవాలని అలా ఆగమేఘాల మీద బ్లూమ్స్‌బరీ నిర్ణయం తీసుకుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఈ పుస్తకంలో ఏముంది? పరిచయం, అర్బన్ నక్సలిజమ్ – జిహాదీజమ్, పౌరసత్వ సవరణ చట్టం, జామియా విశ్వవిద్యాలయంలో హింస, షాహిన్‌బాగ్ నమూనా, ఈశాన్య ఢిల్లీ దాడులు, క్షేత్రస్థాయిలో బాధితుల అనుభవాలు, ముగింపు అనే ఎనిమిది అధ్యాయాలు ఇందులో ఉన్నాయి. చివరిగా అనుబంధం ఒకటి చేర్చారు. ఢిల్లీ అల్లర్లు ముందస్తు ప్రణాళిక మేరకే జరిగాయని, అర్బన్ నక్సల్స్–జిహాదీ పథకం నమూనాలో ఇదంతా జరిగిందని ఆ పుస్తకం పేర్కొనడం వామపక్ష, ఉదారవాద మేధావులకు మింగుడు పడడం లేదు. ఈ పుస్తకం మీద తలెత్తిన వివాదం మొత్తానికి కేంద్ర బిందువు ఇదే. ఇలాంటి ఆరోపణ చేస్తే అందుకు సంబంధించి పుస్తకం తొలి అక్షరం నుంచి ఆధారాలు కనిపించాలన్న నిబంధనేదో ఉన్నట్టు చెబుతున్నారు వారు. ఒక నిజ నిర్ధారణ సంఘం ఇచ్చిన నివేదిక ఆధారంగానే పుస్తకం రాశారనీ, ఆ నివేదికనే పుస్తకమంతా నింపారనీ, వాస్తవాలకు సంబంధించిన తప్పులతో పాటు, కుట్ర సిద్ధాంతల ఆధారంగా ఆ ముగ్గురు రచయిత్రులు పుస్తకం వెలువరించారని ఆరోపణ. సీఏఏ వ్యతిరేక ఆందోళనల వివరిస్తూ, కుట్ర సిద్ధాంతాలకి ఒక అధ్యాయమే ఎందుకు కేటాయించారన్నదే ఆ మేధోవర్గం ప్రశ్న. మావోయిస్టు సాహిత్యం, ఖిలాఫత్ ఉద్యమం, సిరియా–ఇరాక్‌ల ఐఎస్ఐఎస్ కుమ్మక్కయ్యాయని రచయిత్రులు ఆరోపించినా, ఆ కలయికకీ, ఢిల్లీ అల్లర్లకీ మధ్య సంబంధం ఏమిటో చెప్పలేదన్నారు. నక్సల్, అర్బన్ నక్సల్ అన్న పదాలు ఒక్కటే అన్నట్టుగా రచయిత్రులు ప్రయోగించారనీ, అసలు అర్బన్ నక్సల్స్ అన్న పదం తమ దృష్టిలోనే లేదని కేంద్ర హోంశాఖ ఆర్టీఐ ద్వారా అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చిందనీ, అర్బన్ నక్సల్స్ కార్యకలాపాలు ఎలా నిర్వహిస్తారనీ చాలా అమాయకంగా ప్రశ్నిస్తున్నారు మేధావులు. ఇస్లామిక్ రాడికల్స్, రాడికల్ ముస్లిమ్స్, జీహాదీ ఎలిమెంట్స్, అల్ట్రా లెఫ్ట్ జీహాదీ కేడర్ అంటూ నిరసనకారుల గురించి చెబుతూ పరస్పరం సంబంధం లేని శక్తులను కలిపి కలగాపులగం చేశారంటూ కోడిగుడ్డు మీద ఈకలు లాగేందుకు యత్నించారు. అసలు ఈ పుస్తకాన్ని అచ్చుకు పంపే ముందు ఈ మేధావులకి చూపించి, వారి సర్టిఫికెట్ తీసుకుంటే సరిపోయేదేమో!

ఈ పుస్తకానికి ఐపీఎస్ మాజీ అధికారి పీసీ డోగ్రా ముందుమాట రాశారు. అందులో జవహర్ లాల్ నెహ్రూ చెప్పినట్టుగా ఒక ఉల్లేఖను ఇచ్చారు. 'నేను సంస్కృతి చేత ముస్లింను. పుట్టుక చేత యాదృచ్ఛికంగా హిందువును' అన్నదే ఆ ఉల్లేఖన. ఇది నెహ్రూది కాదనీ, నెహ్రూను ఉద్దేశించి హిందూ మహాసభ నాయకుడు ఒకరు చేసిన వ్యాఖ్య అనీ పుస్తకం వ్యతిరేకుల ఆరోపణ. షాహిన్‌బాగ్‌లో పాకిస్తాన్ జిందాబాద్ అన్న నినాదాలు, 2016లో జేఎన్‌యూలో భారత వ్యతిరేక నినాదాలు చేశారని ఈ పుస్తకంలో ఉంది. కానీ, షాహిన్‌బాగ్ నిరసన శిబిరంలో అలాంటి నినాదాలు ఇచ్చినట్టు ఆధారాలు లేవంటున్నారు మేధావులు. అలాగే జేఎన్‌యూ గొడవ ప్రస్తుతం విచారణలో ఉందంటున్నారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) వ్యతిరేకిస్తూ చెలరేగిన ఆందోళనలు వామపక్ష, ముస్లిం ఛాందసవాదుల ప్రోద్బలంతో జరిగాయని, సీఏఏ వ్యతిరేక అల్లర్లన్నింటి వెనుక ఉన్నది ఖిలాఫత్ నాయకులేనని ఆ ముగ్గురు రచయిత్రులు ఆధారం లేకుండా రాశారని కూడా మేధావులు తీర్పు ఇచ్చేశారు. ఒక మూక ఉన్మాదమే సీఏఏ వ్యతిరేకత చుట్టూ ఉందని రాయడం వారికి నచ్చలేదట. ఆమ్‌ఆద్మీ పార్టీ శాసనసభ్యుడు అమానుతుల్లాఖాన్, అదే పార్టీకి చెందిన కౌన్సిలర్ తాహిర్ హుసేన్‌లు ఇచ్చిన ఉపన్యాసాల గురించి విరివిగా ఇచ్చి, బీజేపీ నాయకులు అనురాగ్ ఠాకూర్ (కేంద్ర మంత్రి), పర్వేష్ వర్మ ఉపన్యాసాలను అసలు ప్రస్తావించలేదనీ, కపిల్ మిశ్రా మాటలను ఎక్కడో ఆరో అధ్యాయంలో కొద్దిగా ఉదాహరించారనీ కూడా ఉదారవాదులు ఆరోపిస్తున్నారు. కపిల్ మిశ్రా శాంతిని నెలకొల్పడానికి వెళ్లారని ఈ పుస్తకం పేర్కొన్నది.

కానీ 'ది క్వింట్' అనే వెబ్‌సైట్ ఇందుకు భిన్నమైన కథనం ఇచ్చిందట. ఆ కథనం వారికి వేదమైనంత మాత్రాన అందరికీ కావాలా? అలాగే ఈ సంవత్సరం జనవరి నాటి జేఎన్‌యూ అల్లర్ల గురించి చెప్పినప్పుడు ఏబీవీపీ అరాచకాల గురించి ప్రస్తావించనే లేదన్నది కూడా వ్యతిరేకుల ఆరోపణ.

షర్జిల్ ఇమామ్ అనే జేఎన్‌యూ పరిశోధక విద్యార్థి అస్సాంను ఇండియా నుండి వేరు చేయాలని అనడం దేనికి నిదర్శనం? ఆ మాట అతడు ఎక్కడ అన్నాడు? రివాల్వర్లతో కొందరు ముస్లిం యువకులు కాల్పులు జరపడం, అవి అన్ని రకాల మీడియాలోను పెద్దగా వెల్లడికావడం, తాహిర్ హుస్సేన్ అనేవాడి ఇంట భారీగా మందుగుండు దొరకడం ఇవన్నీ ఈ ఉదారవాదుల దృష్టిలో కేవలం అభూత కల్పనలేనా? చిన్న చిన్న నేరాలేనా? 'ఒక చేత రాజ్యాంగం, మరొక చేత త్రివర్ణ పతాకం పట్టిన వారితో నిండిపోయిన' షాహీన్‌బాగ్ శిబిరంలోనే మోదీనీ, అమిత్ షాని కాల్చి పారేస్తానంటూ ఒక చిన్నారి చేత పలికించిన సంగతి ఇండియాటుడే వంటి చానల్ కూడా ప్రసారం చేసింది. వాటిని ఏమనాలి? వామపక్షవాదుల పరిభాషలోనే, 'ఎలా చూడాలి?'

భారతీయ ఉదారవాదులంటే– అటు భారతీయులు కాదు, ఇటు ఉదారవాదులు కూడా కాదని ప్రముఖ కాలమిస్ట్, పురాణాల వ్యాఖ్యాత ఆనంద్ నీలకంఠన్ ఔట్‌లుక్ వెబ్‌సైట్‌కు రాసిన వ్యాసంలో విమర్శించడం గమనార్హం. బ్లూమ్స్‌బరీ ఆ పుస్తకాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు నిర్ణయం ప్రకటించిన తరువాత, అందుకు వామపక్ష

హిందువుల మనోభావాలను నిరంతరం అవమాన పరచడమే మేధావి బిరుదానికి తొలి అర్హత అన్నట్టు ఉన్నారు ఈ దేశ మేధావులు. ఇంటి నిండా పెట్రోలు బాంబులు, మందుగుండు, విసరడానికి రాళ్లు పెట్టుకుని విధ్వంసం సృష్టించిన, ఐబీ అధికారి అంకిత్ శర్మను దారుణంగా చంపిన తాహిర్ హుసేన్ చర్య కంటే కపిల్ మిశ్రా ఉపన్యాసమే బీభత్సం, భయానకం, ప్రమాదం అని నిస్సిగ్గుగా వాదించడం అజ్ఞానం, గుడ్డితనం, పక్షపాతం తప్ప మరొకటి అవుతుందా? ఇలాంటి మేధావులు సంఘ్ పరివార్‌కు ఎప్పటికీ అక్కరలేదు.

మేధావులను, ఉదారవాదులను బాధ్యులను చేస్తూ విమర్శించిన అనేక మందిలో నీలకంఠన్ ఒకరు. అలా అని ఈ పుస్తకంలోని ప్రతి అంశానికి నీలకంఠన్ ఆమోదముద్ర వేయలేదు. అందరికీ అభిప్రాయాలు చెప్పే హక్కు ఉందన్నదే ఆయన వాదన. ఇంకొకటి– పాశ్చాత్య దేశాల ఉదారవాదం వలె కాక, మనదేశంలో ఉదారవాద మేధావులకు మార్క్సిజంతో లంకె ఉంది. మార్క్సిజం కూడా ఒక మతంలా ఎదిగినదే. తన సోదర మతాల మాదిరిగానే ప్రతిదానిలోను రెండు పరస్పరం ప్రతిఘటించుకునే శక్తులనే వెతుకుతూ ఉంటుంది. తమ మూక తప్ప అన్యులంతా రాక్షసశక్తులుగానే చూస్తూ ఉంటుంది. మైనారిటీలకు రక్షకులుగా వీరు తమకి తామే నియమించుకున్నారు. అయితే మైనారిటీలకు ఇలాంటి ఉదారవాదులు చేసిన అన్యాయం మరొకరెవరూ చేయలేదు. హిందువులలో మిలిటెన్సీ (ఏమైనా ఉంటే) ఈ ఉదారవాదుల పుణ్యమే అన్నది నీలకంఠన్ మాటల సారాంశం. దీనికి ఈయన మీద కూడా కొందరు మేధావులు విమర్శలు గుప్పించారు. ఉదారవాదికి సహనం, ఎదుటివారు చెప్పేది వినే ఓపిక ఉండాలని చెబితే, వెంటనే ఒక మతోన్మాది తరహాలోనే, అయితే మీరు హిట్లర్‌ని సమర్థిస్తారా, యూదుల మీద అన్ని ఘోరాలు చేసిన హిట్లర్‌ని సమర్థిస్తారా అంటూ దాడి జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. తాను ఎప్పటికీ హిట్లర్‌ను సమర్థించబోననీ, అయితే హిట్లర్ సైతం అతడు కోరుకున్నది చెప్పుకునే హక్కును కలిగి ఉన్నాడని చెబుతానని అంటున్నారు. తను అనుకున్నది చెప్పడానికి హిట్లర్‌కు ఉన్న హక్కును, సమర్థించడానికీ, హిట్లర్‌ను సమర్థించడానికి ఎంతో తేడా ఉందని అన్నారు. ఇదే ఉదారవాదులలో చాలా మందికి అర్థం కావడం లేదని నీలకంఠన్ విశ్లేషిస్తున్నారు. ఇంకొందరు ఉదారవాదులు ఈ పుస్తక రచనే ముస్లిం వ్యతిరేకమని కొట్టి పారేసే ప్రయత్నం చేయడం కనిపిస్తున్నది. ఉదారవాదుల, వామపక్షవాదుల గుండె చప్పుడు సరిగ్గా ఇదే.

సంఘ్ పరివార్ వైపు గొప్ప మేధావులు ఎవరూ లేకపోవడం వల్లనే బ్లూమ్స్‌బరీ ఇలాంటి నిర్ణయం తీసుకుందన్న విచిత్రాతి విచిత్రమైన మరొక వాదం నేడు బయటకు వస్తున్నది. ఇప్పుడు మేధావులుగా చెలామణి అవుతున్నవారికి ఆ కిరీటం తగిలించిన వారు అసలు ఎవరు? వాళ్ల కుతర్కం మీద అంత ప్రేమ ఎవరికి? మైనారిటీ మతోన్మాదం కంటే, మెజారిటీ మతోన్మాదం ఘోరం ఘోరం అన్న నికృష్ట వాదన జనం ఇంకా నమ్మాలా? హిందువుల మనోభావాలను నిరంతరం అవమాన పరచడమే మేధావి బిరుదానికి తొలి అర్హత అన్నట్టు ఉన్నారు ఈ దేశ మేధావులు. ఇంటి నిండా పెట్రోలు బాంబులు, మందుగుండు, విసరడానికి రాళ్లు పెట్టుకుని విధ్వంసం సృష్టించిన, ఐబీ అధికారి అంకిత్ శర్మను దారుణంగా చంపిన తాహిర్ హుసేన్ చర్య కంటే కపిల్ మిశ్రా ఉపన్యాసమే బీభత్సం, భయానకం, ప్రమాదం అని నిస్సిగ్గుగా వాదించడం అజ్ఞానం, గుడ్డితనం, పక్షపాతం తప్ప మరొకటి అవుతుందా? ఇలాంటి మేధావులు సంఘ్ పరివార్‌కు ఎప్పటికీ అక్కరలేదు. దేశభక్తిని, రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛ అనే ఆయుధంతో ఆ రాజ్యాంగాన్నే వెన్నుపోటు పొడిచే, జాతీయ జెండాను నిరాకరించే ఇలాంటి మేధావులను పరివార్ పట్టించుకోదు. పరివార్ దృష్టిలో వీరి మేధో విన్యాసం కేవలం తృణప్రాయం. వీళ్ల వాదాలు ఊకదంపుడు. అసలు అలాంటి అమ్ముడుపోయిన స్వయం ప్రకటిత మేధావులు ఈ దేశానికి అవసరం కూడా కాదు. ఇది ఒక్క ఉదాహరణ మాత్రమే. కశ్మీరీ పండిత్‌లపై ఘోరాల మొదలు నిన్నమొన్నటి మహారాష్ట్ర సాధువుల హత్య వరకు కొన్ని వందల ఉదంతాలు కనిపిస్తాయి – మేధావుల పక్షపాత వైఖరిని చెప్పడానికి. భారత దేశాన్ని, భారతీయ జనతాపార్టీని విమర్శించడంలో ఉండవలసిన కనీస విజ్ఞత, సంయమనం లేని ఇలాంటి మేధావులు ఈ దేశానికే, ఈ సమాజానికే కేన్సర్. కసబ్‌నీ, పార్లమెంట్ మీద దాడి నిందుతులనీ, పాకిస్తాన్‌నీ, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులనీ, మతోన్మాద ముస్లింలనీ, మావోయిస్టులనీ, దేశాన్ని ముక్కలు చేయాలని నినాదాలు చేసే ఉన్మాదులనీ సమర్థించడం తప్ప మరొక ఎజెండా లేని ఈ మేధావులు, ఉదారవాదులు ఎన్ని కుతంత్రాలు పన్నినా వాస్తవాలు బయటకు వస్తూనే ఉంటాయి. అరిచేతిని అడ్డం పెట్టి సూర్యోదయాన్ని ఆపలేరని డాంబికంగా చెబుతూ ఉంటారు వారు. ఆ విషయం వారికి కూడా వర్తిస్తుంది.

– జాగృతి డెస్క్

జాగృతి-2020' పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కార్టూన్





# గాంధీలు సత్యం... గాంధీలే నిత్యం...

**గాంధీలు సత్యం, గాంధీలే నిత్యం.. మిగిలిన దంతా మిధ్యే అంటూ, సోనియా గాంధీయే ఇంకొంత కాలం నేత అంటూ ఆగస్టు 24 నాటి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానించి సమావేశానికి మంగళం పాడింది. ఓ 23 మంది కాంగ్రెస్ నేతలు కొన్ని సదాశయాల కోసం ఒక లేఖ రాశారు. పార్టీని సమూలంగా క్షాళన చేయాలన్నదే వారి ఆకాంక్ష. క్షాళన చేయవలసిన స్థితిలోనే పార్టీ అఘోరించింది దని ఆ ఇరవై ముగ్గురు గుర్తించా రేమో కానీ, ఆ వాస్తవం అధినేతల దయకి ఇంకా నోచుకోలేదు. అధ్యక్ష స్థానంలో ఉంటూ సదా అందుబాటులో ఉండే వ్యక్తి, క్షేత్రస్థాయిలో తిరిగే పనిమంతుడూ ఉండాలని ఆ లేఖ సారాంశం. మన పార్టీ బతికే ఉంది, నమ్మండి అంటూ కార్యకర్తలలో ఉత్సాహం నింపే అధ్యక్షుడు అవసరమని వారు కోరుతున్నారు. ముప్పయ్ ఏళ్లయింది, ఇకనైనా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి ఎన్నికలు జరపరాదా అన్న విన్నపమూ ఉంది. ఇవేమీ పరిగణనలోనికి రానివే అన్నట్టు సీడబ్ల్యుసీ సమావేశం ముగిసింది. గాంధీ-నెహ్రూ కుటుంబమే పైచేయి సాధించింది- ప్రజాస్వామ్యం మీద, పార్టీ మనుగడ మీద కూడా. గాంధీ కుటుంబేతర నేత అన్న నినాదం ఎంత బూటకమో ఇంకాస్త స్పష్టమయింది.**

ఆశకి అంతుండాలంటారు. ఆ లేఖ కింద చేవ్రాలు చేసిన నేతలంతా భారీ స్థాయిలో అత్యాశకు పోయారని జరిగిన పరిణామాలు రూఢి చేశాయి. గాంధీ–నెహ్రూ కుటుంబానికి చెందనివారు కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేపట్టాలి అంటూ యువరాజు రాహుల్ గాంధీ అన్న మాటను ఇంత కాకలు తీరిన కాంగ్రెస్ యోధులు సైతం నిజమని ఎలా నమ్మారో అర్థం కాదు. నిజానికి యువరాజు మాటలో గాంధీ–నెహ్రూ కుటుంబానికి చెందని వారు ఎవరైనా సరే, దమ్మూ ధైర్యం ఉంటే ఆ పదవిలో కూర్చోండి చూద్దాం అన్న సవాలే ధ్వనిస్తుంది. సోనియా శరణు శరణు అంటూ భక్తబృందం యావత్తు మళ్లీ ఆమె తాత్కాలిక అధ్యక్ష గిరీనే నిరవధికంగా పొడిగించారు. అదే సమయంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు పునరంకితమయ్యారు. ఈసారి ఆమె తాత్కాలిక పదవిలో నిరవధికంగా తిష్ట వేసే అవకాశం కనిపిస్తున్నది. ఎందుకంటే, దేశంలో పరిస్థితులు చక్కబడాలట. అంటే కొవిడ్ 19 శాంతించాలి. నిజమే తలలు తీవ్రంగా పండిన వారే పార్టీలో ఎక్కువ. బయటకి అడుగు పెడితే కరోనా ఖాయం. ఆ ప్రమాదం ఏదీ లేదన్న భరోసా ఏర్పడినప్పుడు ఏఐసీసీ సమావేశం ఏర్పాటు చేసి అప్పుడు అధ్యక్ష ఎన్నిక జరుపుతారట. ఇదెప్పటికి సాధ్యం? కాబట్టి కాంగ్రెస్‌కు మా కుటుంబం తప్ప మరొక దిక్కు లేదని రాహుల్ సవాలు విసరడమే నిజం.

23 మంది లేఖ దరిమిలా ఆగస్టు 24న సోనియా గాంధీ ఏర్పాటు చేసిన సీడబ్ల్యుసీ సమావేశం ప్రహసన ప్రక్రియకు కొత్త సొబగులు అద్దింది. నిరుడు ఆగస్టులో రాహుల్ ఏఐసీసీ అధ్యక్ష స్థానానికి రాజీనామా చేయడం, గాంధీ కుటుంబేతరులు అధ్యక్షులు కావాలని ప్రకటించడం గుర్తుండే ఉంటుంది. అప్పుడే మయింది? సోనియా తాత్కాలిక అధ్యక్షురాలయింది. తాత్కాలిక నియామకం కూడా ఏడాది పూర్తి చేసుకుంది. పార్టీలో సమూల మార్పులు అవసరం, పని చేసే అధ్యక్షులు కావాలని లేఖ వచ్చింది. నిజానికి ఇలాంటి ఒక లేఖ అంతకు ముందు కూడా వచ్చింది. కానీ అలాంటి లేఖ ఏదీ లేదని కాంగ్రెస్ అధికార ప్రతినిధులు అడ్డంగా బొంకారు. అందుకేనేమో, 23 చేవ్రాళ్లతో మరొక లేఖ వచ్చి పడింది. పైగా ఈ లేఖ కూడా రాలేదని అధికార ప్రతినిధులు మళ్లీ బొంకే ప్రమాదం లేకుండా లీక్ కూడా చేశారు 'ఉత్తర'కుమారులు. దీనికి సమాధానం అన్నట్టే సోనియా తాజాగా సీడబ్ల్యుసీ సమావేశానికి పిలుపునిచ్చారట. పైగా అధ్యక్ష ఎంపిక ప్రక్రియకు శ్రీకారం చుట్టండి, నేను తాత్కాలిక అధ్యక్ష పదవికి రాజీనామా సిద్ధం చేస్తున్నానని ప్రకటించారట. ఇప్పుడు కూడా జరిగిందేమిటి? ఒళ్లు బాగోక అమ్మ ఆస్పత్రిలో ఉన్నప్పుడు లేఖ రాస్తారా అంటూ, రాజస్తాన్‌లో కూడా పార్టీ ప్రభుత్వం బొక్కబోర్లా పడుతుందని అంతా బీపీలు పెంచుకుంటున్న తరుణంలో ఆ లేఖ ఏమిటి అంటూ రాహుల్ మండిపడ్డారని వార్తలు వెలువడ్డాయి. ఆయన అక్కడితో ఆగలేదు. తన సహజ మూర్ఖపు వైఖరితో మీరంతా బీజేపీతో కుమ్మక్కయి పోయారని ఖరీదైన అభాండం పడేశారు. ఈ లేఖ ఆనంద్‌శర్మ రాశారని అస్మదీయుల శిబిరంలో అగ్రగణ్యుడు అహ్మద్ పటేల్ తేల్చారు. ఈ కుట్ర యావత్తు శశిథరూర్ రచించాడని మరొక నేత ఎవరో అన్నట్టు వార్త. నేను బీజేపీతో కుమ్మక్కయ్యానని రుజువు చేస్తే పదవికి రాజీనామా చేస్తానంటూ గులాం నబీ ఆజాద్ భీషణ ప్రతిజ్ఞ చేశారని కూడా వార్త వచ్చింది. గడచిన ముప్పయ్ ఏళ్లలో నేను ఏనాడూ బీజేపీని సమర్థించింది లేదు, నన్ను కూడా బీజేపీని అంటకాగే వాళ్ల జాబితాలో చేరుస్తారా, తమకిది ధర్మమా, బీజేపీ ప్రభుత్వాలకి వ్యతిరేకంగా నేను ఎన్నిసార్లు కోర్టుల్లో వాదించానో మరచిపోవడం భావ్యమా అన్న తీరులో కపిల్ సిబల్ ఏకంగా ట్వీట్ చేశారు. ఈయన కూడా లేఖ మీద చేవ్రాలు చేశారు. అయితే తన వ్యాఖ్య ఉద్దేశం అది కాదంటూ రాహుల్ స్వయంగా బుజ్జగించడం వల్ల క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా సిబల్ ఆ ట్వీట్ వెనక్కి తీసుకున్నారు. ఇంతకీ ఈ లేఖ గురించి సీనియర్లని పట్టుకుని అంతలేసి మాటలనడానికి రాహుల్‌కి ఏమిటి అధికారం? ఆయన అధ్యక్ష పదవిలో లేరు. కానీ పార్టీని ఒంటి చేత్తో గిరగిరా తిప్పుతున్నది ఆయనే. పుల్వామా దాడి విషయంలో సైనికుల మనోభావాలకు వ్యతిరేకంగా,

కశ్మీర్ వ్యవహారాలలో తలా తోకా లేకుండా, రఫేల్ విమానాల విషయంలో అడ్డదిడ్డ వాచాలత, కోర్టుల మొట్టికాయలు, ఒక్క ఎన్నికలోను సంపూర్ణ విజయం సాధించలేకపోవడం.... ఇలాంటి ఎన్నో కారణాలు సీనియర్లకు కడుపు మండేటట్టు చేస్తున్నాయి. కొన్ని కీలక సందర్భాలలో రాహుల్ అభిప్రాయంతో విభేదించినవారు కూడా ఆ పార్టీలో కనిపించారు. తమ విభేదాన్ని కరణ్ సింగ్ వంటివారు దాచుకోలేదు. కానీ రాహుల్ అనే యువరాజు గాంధీ కుటుంబ వారసుడు. ఆయన ఏం చేసినా చెల్లుతుంది. కచ్చితంగా చెప్పాలంటే కాంగ్రెస్‌కు గాంధీయేతర కుటుంబీకుడు నేత అంటే 'దెబ్బలబ్బాయి' పాత్రన్నమాట. యువరాజు రాహుల్ మాట్లాడతారు. తిట్లూ, విమర్శలూ ఉత్సవ విగ్రహం స్థానంలో ఉన్న ఆ దెబ్బలబ్బాయి భరించాలి.

నిజం చెప్పాలంటే రాహుల్ రాజకీయ గురువు దిగ్విజయ్ కొట్టి పారేసినట్టు ఇదంతా టీకప్పులో తుపాను కాదు. లేఖలో కనిపించినవి 23 సంతకాలే కావచ్చు. పార్లమెంటు సభ్యులే దాదాపు పాతిక మంది సంతకాలు చేయడానికి ముందుకు వచ్చారని వార్తలు వచ్చాయి. వివిధ హోదాలలో దేశం నలుమూలలా ఉన్న మరో వందమంది పార్టీ పెద్దలు కూడా సంతకాలు చేయడానికి ఉత్సాహం చూపించారట. అయితే రాబోయే ఎన్నికలలో సీటు భయం వెనక్కి లాగిందట. కానీ ఇలాంటి లేఖ, అందులో విషయాలు సత్యదూరం కావని వారంతా ముక్త కంఠంతో పలికారట. పేరు వెల్లడించడానికి మొహమాట పడిన ఒక ప్రముఖ నేత అయితే, 'ఆ లేఖలో గాంధీ, నెహ్రూ(అంటే ఎంకె గాంధీ, జవాహర్‌లాల్)లు పార్టీకి చేసిన సేవలని గుర్తు చేశాం. పైగా సోనియా సేవలకి కూడా అదేస్థాయిలో పొగడ్తలు కేటాయించాం. అయినా లేఖలో ఏముందో తెలియకుండానే మమ్మల్ని తిరుగుబాటుదారులనడం దారుణం కదా!' అని వాపోయాడని వార్త. ఇవన్నీ ఎలా ఉన్నా, దేశంలో గాంధీ కుటుంబం పట్ల విధేయత, ఉన్న మేరకే అయినా చాలా గట్టిగానే ఉంది. అసమ్మతి, ప్రజాస్వామ్యం, ఎన్నికలు వంటి బంధాలలో ఆ కుటుంబాన్ని ఇరికించి వారి గత త్యాగాలను అవమానపరుస్తారా అంటూ దేశం నలుమూలల నుంచి లేఖ మీద సంతకం చేసిన నాయకులను శాపనార్థాలు పెడుతున్నారు కార్యకర్తలు. అమ్మ ఆస్పత్రిలో ఉన్నప్పుడు లేఖ రాస్తారా అంటూ కొడుకు వెలిబుచ్చిన ఆవేదన కార్యకర్తలను కలచి వేసి ఉండాలి. అయినా అంత అనారోగ్యంగా ఉండి పదవి ఎందుకు? తాత్కాలికమే కాబట్టి ఎవరికైనా అప్పగించవచ్చు కదా అన్న ప్రశ్న వారికి రాలేదు. తర్ఫీదు అలాంటిది. అహ్మద్ పటేల్ కూడా పరోక్షంగా అసమ్మతి మీద తనవంతుగా నీళ్లు చిలకరించే ప్రయత్నం చేశారు. ఈ విషయం నాయకులకీ, అధ్యక్షుల వారికీ సంబంధించినది. మాది



ఆనంద శర్మ, శశిథరూర్, గులాం నబీ ఆజాద్, కపిల్ సిబల్

ప్రజాస్వామిక సంస్థ. అధ్యక్షుల అభిప్రాయంతో విభేదించే హక్కు నాయకులకి ఉంటుంది. అయితే అది తగిన వేదిక మీద జరగాలి' అన్నారు. కాబట్టి లేఖ రాయడం ఒక తప్పయితే, అది బహిర్గతం కావడం మరొక తప్పని ఆయన స్పష్టం చేశారు. రాహుల్ దృష్టిలో 'బీజేపీతో కుమ్మక్కయిన వారు', సాధారణ కార్యకర్తల ఉద్దేశంలో 'అసమ్మతివాదులు' అంటే లేఖ మీద సంతకాలు చేసినవారు 24 నాటి సీడబ్ల్యూసీ సమావేశం మరునాడే సంజాయిషీలు ఇచ్చుకున్నారు. దీనితో గాంధీ కుటుంబ విధేయుల బృందమే ఆ సమావేశంలో పైచేయి సాధించిన సంగతి రుజువైపోయింది. నాయకత్వాన్ని సవాలు చేసే ఉద్దేశం కాని, అసమ్మతి కార్యకలాపాలు కాని తమ ఉద్దేశమే కాదని వారు చెప్పుకున్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని బతికించుకునే స్థితిలో, సొంత సిద్ధాంతాలతో ముందుకు నడిచే స్థితిలో కాంగ్రెస్ లేకపోవడంతో కలత చెంది ఈ లేఖ రాశామని, పార్టీ పునరుద్ధరణే మా అందరి ధ్యేయమని సీనియర్ నాయకుడు వీరప్ప మొయిలీ ప్రకటించారు. అయితే సమావేశం తరువాత గులాం నబీ ఆజాద్ ఇంట జరిగిన సమావేశం సంగతి గురించి ఎవరూ ప్రస్తావించడం లేదు. అలా అని ఈ సమావేశం అంత ప్రాధాన్యం లేనిదేమీ కాదు. ఈ వ్యూహం ఎవరిదైనా గులాం నబీ ఆజాద్‌ను ముందు ఉంచడం పెద్ద ఎత్తే. ఈ లేఖ, దరిమిలా జరిగిన సీడబ్ల్యూసీ సమావేశం కాంగ్రెస్‌కే కాదు, గాంధీ-నెహ్రూ కుటుంబానికి కూడా కుదుపే. దీనిని అంగీకరించడం అవసరం. అలాగే సీడబ్ల్యూసీ పార్టీ పరిణామాలను చర్చించినట్టయితే విజయరాదిత్య సింధియా వ్యవహారం రాకుండా ఉండదు. ఒక రాష్ట్రంలో చిరకాలం తరువాత వచ్చిన అధికారాన్ని చేజార్చుకోవడానికి దారి తీసిన పరిణామమది. అసలు చర్చే లేకుండా ఇలాంటివి ప్రస్తావనకు రాకుండా చేశారనిపిస్తుంది. చర్చిస్తే వైఫల్యం ఎవరిదో తెలిసేదే.

నిజానికి తిరుగుబాటు సోనియా మీద కాదని స్పష్టమవుతోంది. ఆమెకు ఆరోగ్యం సహకరించడం లేదు. అయినా ఆమెకే పగ్గాలు అప్పచెప్పక తప్పని పరిస్థితిని కల్పించినది కుమారరత్నమే. ఇంకా ఆగస్టు 24వ తేదీ సమావేశంలో రాహుల్, సోనియా శిబిరాలు వెలవడం కొత్త పరిణామమే. లేఖలో సోనియా తప్పుకుని పూర్తి సమయం అధ్యక్షునిగా రాహుల్‌నే పునఃప్రతిష్ఠించాలన్న అభిప్రాయం లేదు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, ఏకే ఆంటోని వంటివారు సోనియా గాంధీయే అధ్యక్ష పదవి స్వీకరించాలని చెప్పారు. తను ఇచ్చిన ఒక కీలక ఆర్డినెన్స్ తన ఎదుటే విలేకరుల సమావేశంలో రాహుల్ చించిపారేసిన సంగతి ఈ వృద్ధ నేత మరచిపోవడం కష్టమే. తన రాజకీయ గురువు పీవీని దృష్టిలో ఉంచుకుని, 'తమ కుటుంబం అధికారంలో ఉంటే బాబ్రీ కూలేది కాదు'టూ చేసిన అవమానకర మైన ప్రకటన కూడా సింగ్ మదిలో ఎప్పటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. కొందరు రాహుల్ గాంధీ అధ్యక్షుడు కావాలంటూ నినాదాలు చేశారు. ఇవన్నీ ఎలా ఉన్నా సోనియా అంతరంగం ఏమై ఉంటుందో ఊహించడం కష్టం కాదు. ఇందిర పార్టీ అధ్యక్షురాలు కావాలని నెహ్రూ భావించినట్టు, సంజయ్ గాంధీ పార్టీ పగ్గాలు చేపట్టాలని ఇందిర ఆశించినట్టు, ఇప్పుడు సోనియా కూడా రాహుల్ పగ్గాలు చేపట్టాలనే అనుకుంటున్నారు. ఆ కుటుంబానికే చెందిన ప్రియాంక వాద్రా మనసులో ఉన్నది ఎవరైనా తమ కుటుంబం కనుసన్నలలోనే పదవి పదిలంగా ఉండాలనే. తన కుమారుడు పార్టీ అధ్యక్ష పదవిలో ఉండాలని అనుకున్నప్పుడు ఆయన బాధ్యతతో మెలిగేటట్టు సోనియా చేయగలిగితే ఈ రగడకు ఆస్కారం ఉండేది కాదు. కొందరు విశ్లేషకుల అంచనా ప్రకారం భవిష్యత్తులో రాహుల్ గాంధీయే అధ్యక్ష పదవి చేపడతారు. పార్టీలో వ్యతిరేక శిబిరం మీద పైచేయి సాధించడం కోసం ఇలాంటి విన్యాసాలు చేయడం రాజకీయాలలో కొత్త కాదు. కాబట్టి ఎన్నిక ద్వారా అధ్యక్షుడైనట్టు భ్రమింప చేసే ఒక దృశ్యాన్ని సృష్టించే పని మొదలయింది. కొవిడ్ 19 సద్దుమణిగిన తరువాత జరిగే ఏఐసీసీ సమావేశంలో ఆయనే ఎన్నికవుతారన్నమాట. పార్టీలో సోనియాకు బలం ఉంది. ఆమె 'త్యాగశీలి' కాబట్టి ఆ బలం తన కోసం కాకుండా, తనయుడి కోసం ధారపోయడం ఖాయం. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్‌ను ఎన్నుకోవలసింది అంటూ సోనియా పిలుపునిస్తే అది పార్టీకి శిరోధార్యం కాకుండా ఉండగలదా?

– జాగృతి డెస్క్



దావూద్ ఇబ్రహీం ఎక్కడున్నాడంటే పాకిస్తాన్‌లోనేనని చిన్నారులతో సహా ఎవరైనా చెప్పేస్తారు. భారత్, పాక్ దేశాల్లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా తెలిసిన బహిరంగ రహస్యం ఇది. కానీ అబద్ధాల కోరు పాక్ మాత్రం తమదేశంలో లేడని మొదటి నుంచీ బుకాయిస్తూ వస్తోంది. 1993 నాటి ముంబై పేలుళ్లతో సహా తన మాఫియా కార్యకలాపాలతో ఎందరినో పొట్టన పెట్టుకున్న ఈ నరరూప రాక్షసున్ని పాకిస్తాన్ తమదేశంలో భద్రంగా పెంచి పోషిస్తోంది. తాజాగా దావూద్ తమ దేశంలోనే ఉన్నాడని అంగీకరించిన కొద్ది గంటల్లోనే మాట మార్చేసింది. దీంతో పాకిస్తాన్ అసలు స్వరూపం ఏమిటో ప్రపంచానికి మరోసారి స్పష్టంగా అర్థమైపోయింది. మరోవైపు కశ్మీర్ విషయంలో ప్రతిసారీ చెవిలో జోరీగలా రొద పెడుతున్న పాకిస్తాన్‌తో మైత్రిని తెంచుకున్న సౌదీ అరేబియా భారత్‌కు దగ్గరైపోయింది.

# పాక్‌ను చుట్టుముట్టిన ఆర్థిక కష్టాలు

దావూద్ ఇబ్రహీం.. పాకిస్తాన్ ఇటీవల శాంక్షనరీ రెగ్యూలేటరీ పేరిట విడుదల చేసిన ఒక జాబితాలోని ఈ పేరు ప్రముఖంగా ఆకర్షించింది. తమ దేశంలో ఉంటున్న 88 నిషేధిత ఉగ్రవాద సంస్థలు, వాటి నాయకుల వివరాలు ఉన్న జాబితా ఇది. వీరందరి చర, స్థిర ఆస్తులు స్వాధీనం చేసుకుంటున్నట్టు, వారి బ్యాంకు ఖాతాలను స్తంభింపజేస్తున్నట్టు పాకిస్తాన్ ప్రభుత్వం ప్రకటించింది. అందులో మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్, అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం పేరు కూడా ఉంది. దావూద్‌తో పాటు జమాత్ ఉద్ దవా నాయకుడు హఫీజ్ సయీద్, జైష్ ఎ మహమ్మద్ నాయకుడు మసూద్ అజార్, జాకీర్ రెహమాన్ లఖ్వీల పేర్లు కూడా ఉన్నాయి. దావూద్ అసలు తమ దేశంలోనే లేడని రెండు దశాబ్దాలుగా బుకాయిస్తూ వచ్చిన పాకిస్తాన్, ఇప్పుడు తమ దేశంలో ఉన్నట్లు స్వయంగా అంగీకరించినట్లయింది. ఆయన కరాచీలో ఉంటున్నట్టు చిరునామాలను కూడా ఇచ్చింది. కరాచీలోని వైట్ హౌస్, సౌదీ మసీదు దగ్గర ఓ ఇంటిని, నూరాబాద్‌లో ఇంటి నెం. 37, డిఫెన్స్ 30 వీధిలోని పలాటియన్ భవన్‌ను దావూద్ చిరునామాలుగా పేర్కొంది. ఈ వార్త మీడియా ద్వారా ప్రముఖంగా ప్రపంచం దృష్టిని ఆకర్షించేసరికి పాకిస్తాన్ కుడితిలో పడిన ఎలుకలా విలవిలలాడి పోయింది. ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టు నుంచి తప్పించు కోవడానికి తప్పని పరిస్థితుల్లో విడుదల చేసిన ఈ జాబితా ద్వారా పాకిస్తాన్ ఇప్పుడు ఇబ్బందుల్లో పడిపోయింది. దీంతో ఎప్పటిలాగే తన కుటిలబుద్ధిని బయట పెట్టుకుంటూ దావూద్ తమ గడ్డ మీద లేడని పాత పాటే పాడింది. ఇందతా భారత్ మీడియా సృష్టి అని, ఈ కథనాలు తప్పుదోవ పట్టించేలా ఉన్నాయంటూ పాక్ విదేశాంగ శాఖ ఆరోపించింది. ఐక్యరాజ్య సమితి నిబంధనల ప్రకారమే ఉగ్ర సంస్థలపై ఆంక్షలు విధించామని, ఇది సాధారణ ప్రక్రియనేనని తెలిపింది.

ముంబై మాఫియా, ప్రపంచాన్ని రెండు దశాబ్దాల పాటు శాసించిన నేరగాడు దావూద్ ఇబ్రహీం. 'డి కంపెనీ' పేరుతో ఎన్నో బెదిరింపులు, కాంట్రాక్ట్ హత్యలు, దొంగనోట్లు, అక్రమ ఆయుధాలు, హవాలా, మత్తు పదార్థాల వ్యాపారాలు నిర్వహిస్తున్నాడు. బాలీవుడ్ చిత్ర పరిశ్రమలో పెట్టుబడులు పెట్టి తన కనుసన్నల్లో నడుపుకున్నాడు. తనకు కావాల్సిన నటీనటులకు అవకాశాలు ఇప్పించుకోవడంతో పాటు సినీ నటి మందాకినీ, ఫైనాన్షియర్ భరత్‌షా లాంటి వారితో సంబంధాలు అందరికీ తెలిసినవే. కొందరు ప్రముఖుల హత్యల వెనుక దావూదే ఉన్నాడని తేలింది. తాజాగా ఆత్మహత్య చేసుకున్న హీరో సుశాంత్‌సింగ్ ఉదంతం వెనుక దావూద్ హస్తం ఉందని రా మాజీ అధికారి ఎన్‌కే సూద్ అనుమానం వ్యక్తంచేశారు. 1993 మార్చి 12వ తేదీ నాటి ముంబై పేలుళ్ల వెనుక దావూద్ పాత్ర బయట పడింది. మొత్తం 13 బాంబు పేలుళ్లలో 257 మంది మృతి చెందడంతో పాటు, 713 మంది గాయపడ్డారు. ఈ ఘటన తర్వాత దేశం విడిచిపారిపోయిన దావూద్ పాకిస్తాన్‌లోని కరాచీలో తల దాచుకుంటున్నాడు. ముంబై పేలుళ్ల వెనుక దావూద్, ఆయన అనుచరులు టైగర్ మెమన్, యాకూబ్ మెమన్ పాత్ర కనిపిస్తున్నా తెర వెనుక ఉండి నడిపించింది పాకిస్తానే. ఈ కేసులో న్యాయస్థానం యాకూబ్ సహా 12 మందికి మరణశిక్ష, 18 మందికి జీవితఖైదు విధించింది. అయితే దావూద్ ఇబ్రహీం, టైగర్‌మెమన్ పరారీలోనే ఉన్నారు. ఇదే సందర్భంలో అక్రమ ఆయుధాల కేసులో హీరో సంజయ్ దత్‌కు జైలు శిక్ష పడింది.

## ఎన్నో ఆధారాలు

దావూద్ ఇబ్రహీంను అప్పగించాల్సిందిగా భారత్ మొదటి నుంచీ పాకిస్తాన్‌ను గట్టిగా డిమాండ్ చేస్తూ వచ్చింది. వాస్తవానికి దావూద్ 1990 నుంచే పాక్‌లో స్థావరం ఏర్పరచుకున్నాడు. కరాచీతో పాటు ఇస్లామాబాద్‌లో ఆయనకు తొమ్మిది స్థావరాలు ఉన్నాయి. కరాచీ కేంద్రంగా 'డి కంపెనీ'



క్రాంతిదేవ్ మిత్ర

కార్యకలాపాలు మలేసియా, సింగపూర్, థాయ్‌లాండ్, శ్రీలంక, నేపాల్, దుబాయ్‌లతోపాటు జర్మనీ, ఫ్రాన్స్, ఇంగ్లండ్‌లలో విస్తరించాయి. దావూద్ 3 వేల కోట్ల రూపాయల విలువైన వ్యాపార సౌధాన్ని నిర్మించాడు. 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణంలోనూ డి కంపెనీ పాత్ర ఉంది. దావూద్ భార్య, నలుగురు కుమార్తెలు, కుమారుడికి పాకిస్తాన్ పాస్‌పోర్టులు ఉన్నాయి. పాకిస్తాన్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ జావేద్ మియాందాద్ స్వయాన దావూద్ వియ్యంకుడు. ఆయన కుమారుడు జునైద్‌కు తన కూతురు మహ్రూఖ్‌ను ఇచ్చి వివాహం చేశాడు దావూద్. అదేవిధంగా దావూద్ తన ఏకైక కుమారుడు మొయిన్‌నవాజ్ పెళ్లి కూడా కరాచీలోనే చేశాడు. ఈ సందర్భంగా జరిగిన వలీమా విందుకు పాకిస్తాన్ సీనియర్ ఆర్మీ అధికారులతో సహా పలువురు అతిథులు హాజరయ్యారు.

దావూద్ ఇబ్రహీం తమ దేశంలో నివసిస్తున్నట్లు పాకిస్తాన్ అంగీకరించకున్నా, అక్కడి ప్రభుత్వానికి తెలియకుండా రహస్య జీవితం గడపడానికి అయితే వీలులేదు. కరాచీలో నివసించే ముఖ్యవ్యక్తుల నివాసాలన్నీ అక్కడ సైనిక సంరక్షణలో ఉన్నట్లు వెల్లడవుతోంది. భారత్ నుంచి వలసవెళ్లిన మొహజిర్లు కరాచీలో పెద్ద సంఖ్యలోనే ఉంటారు. వీరిని అణచి వేసేందుకు వారి కదలికలపై ఓ కన్నేసి ఉంచుతుంది. చివరికి కరాచీలో చెత్తను తరలించే పనిలో కూడా సైన్యం జోక్యం ఉంటుంది. ఈ నేపథ్యంలో దావూద్ అక్కడ ఏళ్ల తరబడి నివసించినా కనుక్కోలేదనుకోవడం అపోహే. మరోవైపు దావూద్ కరాచీలో నివసిస్తున్నాడన్న వార్తలను ఆయన ప్రధాన అనుచరుడు చోటా షకీల్ ఖండించాడు. ఈ విషయంలో తాము పాక్ సహా ఎవరికీ జవాబు చెప్పబోమని స్పష్టంచేశాడు. దావూద్ కరాచీలో ఖరీదైన భవనంలో ఉన్నాడని చూపిస్తున్నందుకు భారత మీడియా బాధ్యత వహించాలని బెదిరిస్తున్నాడు. తాజాగా దావూద్ ఐటమ్ గాళ్‌గా తన సినీ కెరీర్ ఆరంభించిన పాకిస్తాన్ సినీ నటి మెహ్విష్ హయత్‌తో ప్రేమాయణం నడిపిస్తున్నట్లు పాకిస్తాన్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఆమెకు సినిమా అవకాశాలు, పాక్ ప్రభుత్వ ప్రతిష్టాత్మక అవార్డు 'తమ్‌గా ఏ ఇంతియాజ్' రావడం కూడా దావూద్ చలవేనట. మెహ్విష్‌కు, దావూద్‌కు మధ్య 27 ఏళ్ల వ్యత్యాసం ఉంది. లేటు వయసులో ఘాటు ప్రేమ ఏమిటి అంటూ దావూద్ మీద నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

### ఉగ్రవాదులకు స్వర్గధామం

పాకిస్తాన్‌లోని కరాచీలో తలదాచుకున్న దావూద్ ఇబ్రహీం అల్ కాయిదా, లష్కరే తాయిబా వంటి మత ఛాందస సంస్థలతో సంబంధాలు ఏర్పాటు చేసుకున్నాడు. అల్ ఖైదా వ్యవస్థాపకుడు ఒసామా


ఇమ్రాన్ ఖాన్

బిన్‌లాడెన్‌తో దావూద్‌కు సాన్నిహిత్యం ఉందని అమెరికా బయటపెట్టింది. అఫ్ఘనిస్తాన్ నుంచి అల్‌కాయిదా సభ్యులు పారిపోవడానికి దావూద్ తన మాఫియా మార్గాలను చూపించాడు. దావూద్ ఇబ్రహీంను 'స్పెషల్లీ డిజిగ్నేటెడ్ గ్లోబల్ టెర్రరిస్టు'గా 2003లో ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. అయినా దావూద్ తమ దేశంలో ఉన్నట్టు పాకిస్తాన్ ఏనాడూ అంగీకరించలేదు. పాకిస్తాన్ ఉగ్రవాదులకు స్వర్గధామమని ప్రపంచమంతటికీ తెలిసిపోయింది. 'హ్యూమానిటీ ఎట్ రిస్క్– గ్లోబల్ టెర్రర్ థ్రెట్ ఇండికెంట్' పేరుతో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ – స్ట్రాటెజిక్ ఫోర్‌సైట్ గ్రూప్‌లు నిర్వహించిన సర్వేలో ఉగ్రవాదానికి పాకిస్తాన్ మద్దతు ఇస్తోందని వెల్లడైంది. సిరియాలో కంటే మూడు రెట్లు ఎక్కువగా ప్రాణాపాయం పాక్‌లోనే ఉందని ఆ నివేదిక చెబుతోంది.

2001 భారత పార్లమెంట్, 2008 ముంబై దాడి, 2016 పఠాన్‌కోట్, 2019 పుల్వామా దాడి ఘటనలతో సంబంధం ఉన్న జైష్–ఎ–మహ్మద్ వ్యవస్థాపకుడు మసూద్ అజర్, జమాద్ ఉద్ దవా నాయకుడు హాఫీజ్ సయీద్‌లకు కూడా పాకిస్తాన్ ఆశ్రయం ఇస్తోంది. భారత్ చాలా కాలం పాటు కృషి చేసి మసూద్ అజర్ పేరును ఐక్యరాజ్య సమితి నిషేధిత జాబితా (1267)లో చేర్పించింది. భారత్‌తో పాటు ఆఫ్ఘనిస్తాన్‌లో ఉగ్ర కార్యకలాపాలు సాగిస్తున్న అనేక సంస్థలను పాకిస్తాన్ పెంచి పోషిస్తోంది. అమెరికాపై 2001లో దాడికి పాల్పడ్డ అల్‌ఖైదా చీఫ్ వ్యవస్థాపకుడు బిన్ లాడెన్‌ను పాకిస్తాన్ తమ దేశంలోని అబోటాబాద్‌లో చాలా కాలం దాచిపెట్టు కుంది. చివరకు అమెరికా సైన్యం దాడి చేసి అతన్ని మట్టుబెట్టే సరికి పాక్ నగ్న స్వరూపం ప్రపంచానికి తెలిసిపోయింది. జమ్ముకశ్మీర్‌లో వేర్పాటువాదాన్ని ప్రోత్సహించడంతో పాటు అనేక ఉగ్రవాద సంస్థలకు పాకిస్తాన్ శిక్షణ ఇస్తోంది. ఉగ్రవాదుల స్థావరాలకు, వారికి నివాసం కల్పిస్తున్న దేశాల్లో పాకిస్తాన్ తొలి స్థానంలో నిలిచింది.

### గ్రే లిస్టు అంటే?

ఉగ్రవాద మూకలను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ తన స్వయంకృతాపరాధానికి ఇప్పుడు కష్టాలు ఎదుర్కొంటోంది. ఆ దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా చితికిపోయింది. అమెరికా నుంచి అందే సాయం కూడా నిలిచిపోయింది. అప్పుల ఊబి నుంచి బయట పడేందుకు ప్రభుత్వ ఆస్తులను సైతం అమ్మకం లేదా వేలం వేసుకోవాల్సి వచ్చింది. ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టు మూలిగే నక్కపై తాటి పండు పడిన చందాన మారింది పాకిస్తాన్‌కు. ఈ లిస్ట్‌లో ఉంటే ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు సహా ఇతర అంతర్జాతీయ సంస్థల నుంచి ఆర్థిక సాయం పొందడం కష్టమవుతుంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి జారీ చేసిన నిషేధిత ఉగ్రవాద సంస్థలను పెంచి పోషిస్తున్నందుకు పారిస్ కేంద్రంగా పనిచేస్తున్న ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) సంస్థ పాకిస్తాన్‌ను 2018 జూన్‌లో గ్రే లిస్ట్‌లో చేర్చింది. ఇందులో ఉంటే అంతర్జాతీయంగా ఎలాంటి ఆర్థిక సహాయం అందదు. ఆ జాబితాలోంచి తొలగించాల్సిందిగా పాకిస్తాన్ బ్రతిమిలాడుకోగా 2019 చివరికల్లా ఉగ్రవాద నిర్మూలనకు కృషి చేయాలని గడువు విధించింది. ఆ తర్వాత కరోనా సంక్షోభంతో గడువు పెంచింది. 2020 జూన్ నాటికి కూడా పాకిస్తాన్ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో గ్రే లిస్టులోనే కొనసాగించాలని నిర్ణయించింది. దీంతో గ్రే లిస్ట్ నుంచి బయటపడడానికి పాకిస్తాన్ దావూద్ ఇబ్రహీం, హాఫీజ్ సయీద్, మసూద్ అజర్ సహా 88 ఉగ్ర సంస్థలు, వాటి నాయకుల ఆస్తులు, బ్యాంకు అకౌంట్లు జప్తు చేస్తూ శాంక్షనరీ రెగ్యులేటరీ ఆర్డర్‌జారీ చేసింది. జమాత్ ఉద్ దవా, జైషే మహమ్మద్, తాలిబన్, అల్‌ఖైదా, హక్కానీ గ్రూప్ వంటి సంస్థల అన్ని రకాల ఆర్థిక లావాదేవీలపై ఆంక్షలు విధించక తప్పలేదు. ఇన్నాళ్లూ దావూద్ తమ వద్ద లేడంటూ నమ్మబలికిన పాకిస్తాన్ లోగుట్టు స్వయంగా బయట పెట్టుకున్నందుకు గతుక్కుమంది. దీంతో ఉత్తర్వులు ఇచ్చిన 24 గంటల్లోనే మాట మార్చేసింది. దావూద్ కరాచీ నివాసం ఆధారాలు బయటకు వచ్చే సరికి పాకిస్తాన్ కొత్త పల్లవి అందుకుంది. దావూద్ ఆస్తులు ఉన్నాయన్నాము కానీ.. అతను ఇక్కడ ఉన్నాడని తాము అనలేదని చెబుతోంది. ఈ మేరకు పాక్ విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. శాంక్షనరీ రెగ్యులేటరీ ఆర్డర్‌లోని వారంతా ఇక్కడ ఉన్నారని అర్థం కాదు అని వక్రభాష్యం చెబుతోంది.

### సౌదీ- పాక్ మైత్రికి బీటలు

పాకిస్తాన్ ఏర్పడినప్పటి నుంచే గల్ఫ్ దేశాలతో సంబంధాలు పెట్టుకుంది. ఇందుకు ప్రధాన కారణం మతమే. అయితే అన్ని చోట్ల మతం పాచిక పారదు. గల్ఫ్ దేశాలు చమురు వనరులు క్షీణిస్తున్న నేపథ్యంలో ఇతర వ్యాపారాలపై దృష్టి పెట్టాయి. ఈ క్రమంలో అతిపెద్ద మార్కెట్ ఉన్న భారత్ వాటికి పెద్ద దిక్కుగా



కనిపిస్తోంది. ఇటీవలి కాలంలో సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు ప్రధాని నరేంద్ర మోదీ కృషి కారణంగా భారత్‌కు దగ్గరయ్యాయి. పాకిస్తాన్ ఎప్పుడూ మతాన్ని అడ్డం పెట్టుకొని బికారీ కేకలు వినిపించి తమ దగ్గర సాయం పొందడం, ప్రతిఫలంగా వారికి ఎలాంటి లాభం కనిపించక పోవడం ఆ దేశాలకు ఇబ్బందికరంగా మారింది. పాకిస్తాన్ ప్రతిసారీ కశ్మీర్ అంశంపై చెవిలో జోరీగలా రొద పెట్టడం సౌదీ అరేబియాకు నచ్చడం లేదు. కశ్మీర్ విషయంలో 57 ముస్లిం దేశాలు సభ్యులుగా ఉన్న ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కార్పొరేషన్ మద్దతు పొందాలని పాక్ భావించింది. ఓఐసీలో సభ్యత్వం కలిగి ఉన్న సౌదీని కశ్మీర్ అంశంపై చర్చించేందుకు సభ్యదేశాల్ని సమావేశపరచాలని కోరింది. కానీ దీన్ని సౌదీ పట్టించుకోలేదు. దీంతో పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్, విదేశాంగశాఖ మంత్రి షా మహ్మద్ ఖురేషి బహిరంగంగానే సౌదీని విమర్శించారు. సౌదీ అరేబియా ముందుకు రాకపోతే ఇతర ముస్లిం దేశాలతో తామే సమావేశాన్ని నిర్వహిస్తామని పాకిస్తాన్ హెచ్చరించింది. ఈ క్రమంలో సౌదీ అంటే గిట్టని ఇరాన్, టర్కీ, ఖతార్, మలేసియాతో కలిసి మరో ఇస్లామిక్ దేశాల కూటమిని ఏర్పాటు చేయాలన్నది పాక్ యోచన. అంతర్జాతీయ స్థాయిలో మంచి సంబంధాలున్న మలేసియా ప్రధానమంత్రి మహతీర్ మహమ్మద్ పదవి నుంచి దిగిపోవడంతో ఆ ప్రణాళిక ముందుకు సాగలేదు. తనకు వ్యతిరేకంగా పాకిస్తాన్ ఆడుతున్న నాటకాలను చూసి సౌదీ కన్నెర్ర చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే సౌదీ అరేబియా నుంచి పాకిస్తాన్ అప్పుగా తీసుకున్న 3 బిలియన్ అమెరికా డాలర్లలో ఒక బిలియన్‌ను తిరిగి చెల్లించినట్లు తెలుస్తోంది. తీర్చడానికి ఇంకా సమయం ఉన్నా సౌదీ ఒత్తిడి మేరకు తప్పలేదు. సౌదీకి పాక్ మొత్తం 6.2 బిలియన్ డాలర్ల రుణం చెల్లించాల్సి ఉంది. సౌదీ నుంచి రాయితీ ధరకు చమురు పొందే ఒప్పందం ఇటీవల ముగిసింది. దీన్ని మరో రెండేళ్లకు పొడగించే అవకాశం ఉన్నా ఇరుదేశాల మధ్య దూరం పెరుగుతున్న నేపథ్యంలో సౌదీ అరేబియా ఈ దిశగా చొరవ చూపడం లేదని తెలుస్తోంది.

భారత్, సౌదీ, యూఏఈల మధ్య ఆర్థిక, భద్రతా, రక్షణపరంగా మంచి సంబంధాలున్నాయి. సౌదీ–పాకిస్తాన్ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం విలువ 3.6 బిలియన్ డాలర్లుకాగా, భారత్–సౌదీ అరేబియాల మధ్య వాణిజ్యం 27 బిలియన్ డాలర్లు ఉంటుంది. కశ్మీర్ విషయంలో పాకిస్తాన్‌కు మద్దతు ఇవ్వడం ద్వారా భారత్‌తో తనకున్న వ్యాపార ప్రయోజనాలను వదులుకోవడం సౌదీ అరేబియాకు ఇష్టం లేదు. మరోవైపు తమ అప్పు తీర్చడానికి చైనా నుంచి పాకిస్తాన్ రుణం తీసుకోవడం సౌదీ అరేబియాకు నచ్చలేదు. చైనా–పాకిస్తాన్ కారిడార్‌లో తన ప్రత్యర్థి అయిన ఇరాన్ కూడా పాల్గొనడంపై సౌదీ అరేబియా అసంతృప్తితో ఉంది.

పాకిస్తాన్ తీరుపై అసంతృప్తితో ఉన్న సౌదీ ప్రస్తుత పరిస్థితుల్లో వెనక్కి తగ్గే అవకాశాలు లేవు. పాక్‌లోని గ్వాదర్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ముందుకు వచ్చిన సౌదీ ఆ దేశ వైఖరి కారణంగా వెనక్కి తగ్గింది. సౌదీ అరేబియా తాను పాకిస్తాన్‌కు ఇచ్చే ఆర్థిక సాయం విషయంలో మనసు మార్చుకోకపోతే సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ పాకిస్తాన్ విదేశీ మారక నిల్వలు పూర్తిగా పడిపోతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అసలే ఆర్థికపరంగా పీకల్లోతు కష్టాల్లో ఉండి సౌదీతో కోరి కయ్యానికి దిగడం పాక్‌కే నష్టం అని పరిశీలకులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టు పాకిస్తాన్ మెడ మీద కత్తిలా వ్రేలాడుతోంది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# నెల్లూరు స్వయంసేవక్ బొమ్మిశెట్టి వీరరాఘవులు ఇకలేరు

నెల్లూరుకు చెందిన జ్యేష్ఠ స్వయంసేవక్ బొమ్మిశెట్టి వీర రాఘవులు (88) ఆగష్టు 26న స్వర్గస్తులైనారు. ఆయన చివరిశ్వాస వరకు సంఘకార్యంలో నిమగ్నమై, క్రియాశీలంగా పనిచేశారు. నెల్లూరు–ఆర్ఎస్ఎస్ అనగానే గుర్తుకువచ్చే నలుగురైదుగురిలో బొమ్మిశెట్టి వీర రాఘవులు ఒకరు. తన వ్యాపారం, కుటుంబం, సంఘం ద్వారా సమాజసేవ చేయడానికే ఉన్నాయని నమ్మినవాడాయన. కుటుంబంలో తనకంటే చిన్నవాళ్లు ముందే వెళ్లిపోవటం ఆయనను క్రుంగదీసినా, సంఘంపై శ్రద్ధగాని, నిష్ఠగానీ బలహీనపడలేదు.

ఎనిమిది దశాబ్దాల నెల్లూరు సంఘ చరిత్రలోని ఎన్నో అనుభవాలకు సాక్షి ఆయన. స్వయంసేవకులకు ఆయన ఇల్లు ముఖ్యకేంద్రం. ఏ క్షణంలో ఏ స్థాయి సంఘ కార్యకర్త వచ్చినా వారి ఇంట్లోనే భోజనం, వసతి లభించేది. కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించి, స్వాగతించేవారు. తిరిగి వెళ్లేంతవరకు అన్ని ఏర్పాట్లు చేసేవారు.



విసుగు, అలసట, అలసత్వం లేని కార్యకర్త వీర రాఘవులు. నెల్లూరులో సంఘవిస్తరణ కోసం ఆయన నిరంతరం శ్రమించారు. కొంతకాలం నెల్లూరు నగర సంఘచాలక్‌గా బాధ్యత నిర్వహించారు. సంఘ అనుబంధ సంస్థల పురోభివృద్ధికి పాటుపడ్డారు. జాగృతి పత్రిక పోషకులుగా ఉన్నారు. వినయం, వివేకం, వినమ్రత ఆయన సొంతం. వయసులో చిన్నవారితో స్నేహ పూర్వకంగా మాట్లాడడం, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం ఒక స్వయంసేవక్‌గా ఆయనలో ఉన్న సహజలక్షణాలు. అన్నదాత మాధవరావు, వైసి రంగారెడ్డి, సుందరరాజు, నరసయ్య, సోమేపల్లి సోమయ్య, చిలుకూరి సుబ్రహ్మణ్య శాస్త్రి, సంగమేశ్వరశాస్త్రి మరెందరో పెద్దలతో కలిసి సంఘకార్య విస్తరణకు విశేషంగా కృషిచేసారు. 88 ఏళ్ల వయసులోనూ స్వయంగా తాను పనిచేస్తూ, మిగతా సంఘకార్యకర్తలకు ఆయన అందించిన మార్గదర్శనం, ప్రేరణ, ఎంతో స్ఫూర్తిదాయకం. జయభారత్ ఆస్పత్రి నిర్మాణంలోనూ అందులో వివిధ బాధ్యతలు స్వీకరించి పనిచేయడంలో ఆయన పాత్ర అనిర్వచనీయం. ప్రస్తుతం హాస్పిటల్ ట్రస్ట్‌కు కోశాధికారిగా సేవలందిస్తున్న వీర రాఘవులు ఆకాలమరణం స్థానిక సంఘ అనుబంధ సంస్థలకు తీరని లోటు.

ఆయనకు ఇద్దరు కుమారులు ఒక కూతురు ఉన్నారు. సోదరులు, కుటుంబ సభ్యులందరూ సంఘ స్వయంసేవకులే.



# 'ప్రకృతిని జయించాలనుకోవద్దు!'

**ఆగస్టు 30న ఆర్‌ఎస్‌ఎస్ పర్యావరణ విభాగం, వివిధ హిందూ ఆధ్యాత్మిక సంస్థల ఆధ్వర్యంలో 'ప్రకృతి వందనం' కార్యక్రమం నిర్వహించారు. ఆన్‌లైన్‌లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో సర్ సంఘచాలక్ మోహన్‌జీ భాగవత్ ఉపన్యసించారు. పలువురు స్వామీజీలు కూడా పాల్గొన్నారు. దేశవిదేశాల నుండి అనేక మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యులంతా ప్రకృతిని కాపాడుతామని సంకల్పం తీసుకున్నారు.**

'పర్యావరణ'మనే శబ్దాన్ని ఈ మధ్య తరచుగా వింటున్నాం. అదేమిటో చర్చించుకుంటున్నాం కూడా. దానితోపాటు నిర్వహించుకోడానికే ఈ 'పర్యావరణ దినం' కూడా. ఇది ప్రపంచమంతా జరుగుతుంది. ఎందుకంటే, ప్రపంచంలో జీవించడానికి ఇప్పటి వరకు అధికంగా అనుసరించే పద్ధతి ఇప్పుడు కూడా ఇతోధికంగా వాడుకలో ఉంది. కాని ఆ జీవనశైలి నిలకడయినది కాదు. పర్యావరణానికి అనుకూలమైనది కూడా కాదు. అది ప్రకృతిని జయించడానికే మనిషి జీవించాలన్న నమ్మకం కలిగినది. ప్రకృతి మనిషి అనుభవించడానికేనని, ప్రకృతి పట్ల మనిషికి ఎలాంటి బాధ్యతా లేదని, ప్రకృతి మీద మనిషికి పూర్తి అధికార ముందని అనుకుంటూ గత 200-250 సంవత్స రాలుగా జీవిస్తున్నాం. దాని దుష్పరిణామం ఇప్పుడు వెలుగులోకి వస్తున్నది. దాని వికృతరూపం మనకు కనబడుతున్నది. ఇదేవిధంగా నడుచుకున్నట్టయితే జీవితం గడవడానికి మనం ఉండం. లేదా ఈ సృష్టే ఉండకుండా పోవచ్చును. అందుకే మనిషి ఇప్పుడు ఆలోచిస్తున్నాడు. పర్యావరణాన్ని రక్షించుకోవాలని ఇప్పుడు అనుకుంటున్నాడు. అందుకోసమే 'పర్యావరణ దినం' జరుపుకుంటున్నాం. ఇదంతా గత 2000 సంవత్సరాల నుండి సాగిస్తూ వచ్చిన జీవన విధానానికి సంబంధించింది. ఇంకా చెప్పాలంటే, అందులో 300 సంవత్సరాల నుండి మరీ దిశాహీన మైన ఈ పద్ధతి మనం స్వీకరించాం.

కానీ, పర్యావరణం పట్ల భారతదేశం అనుసరించిన మార్గం ఎంతో భిన్నమైనది. మన అస్తిత్వం వెనుక ఉన్న పరిపూర్ణత్వంలోని సత్యాన్ని మన పూర్వీకులు అర్థం చేసుకున్నారు. అప్పటి నుంచి మనం కూడా ప్రకృతిలో భాగమేనని భావించడం మొదలు పెట్టారు. శరీరంలోని అన్ని అంగాలు సరిగా పని చేస్తేనే శరీరం కూడా పని చేయగలుగుతుందన్న సత్యం వంటిదే ఇది. శరీరంలో జీవం ఉన్నప్పుడే అన్ని అంగాలు పని చేయగలుగుతాయి. శరీరం నుండి ప్రాణం పోయిన వెంటనే గుండె పనిచేయడం ఆగిపోతుంది. ఆ తదుపరి మెదడు కూడా పనిచేయదు. వెంట వెంటనే అన్ని అవయవాలు పని చేయడం ఆగిపోయి మనిషి మరణిస్తాడు. శరీరం తన అవయవాలపై ఆధారపడుతుంది. అవయవాలు 'ప్రాణం' నుండి లభించే శక్తిపై ఆధారపడి ఉంటాయి. ఇలాంటి పరస్పర సంబంధమే మనిషికి, భూమికి మధ్య కూడా ఉంటుంది. మనం సృష్టికి అంగాలం కాబట్టి, సృష్టిని పోషించడం మన కర్తవ్యమే. మన ప్రాణాలు నిలుపుకోవడానికి మనం సృష్టి నుండి అవసరమైనంత మేరకు తీసుకుంటాం. అంతేకాని దాన్ని పీల్చి పిప్పి చేయం. సృష్టి గొప్పతనం గ్రహించిన మన పూర్వీకులు దానిని ఒక రోజుకే పరిమితం చేసే పద్ధతిలో కాకుండా, ఒక వ్యవస్థకే అని అనుకో కుండా సంపూర్ణ జీవనానికి సంబంధించిన విధానంగా అలవర్చుకున్నారు. గ్రామాల్లో పెద్దలు 'సాయంకాలం పూట చెట్లు ఎక్కకండి! అవి నిద్రపోతాయి. వాటికి ప్రాణం ఉంటుంది. సృష్టిలో అవి భాగం' అని చెబుతారు. ఎలాగైతే జంతులోకం ఉందో అలానే చెట్టుచేమల లోకం కూడా ఉందనే భావన ఆధునిక విజ్ఞానశాస్త్రం ద్వారా రాకపూర్వమే మన దేశంలో వేల సంవత్సరాలుగా ఈ భావన ఉంది. మన దేశంలోని నిరక్షరాస్యుడు, సామాన్యుడు కూడా సాయంకాలం చెట్లు ఎక్కకూడదని అనుకుంటాడు, దానిని ఆచరిస్తాడు. ఇతర ప్రాణులతో ఎలా మసలు కోవాలో మన పెద్దలు ఆచరించి చూపెట్టారు. మనం చీమలకు ఆహారం వేస్తాం. అలాగే గోవులకు గడ్డి, కుక్కలకు ఆహారం, పక్షులకు ధాన్యం గింజలు అందించే అవాట్లు ఉన్నాయి. గ్రామంలో ఎవరైనా అతిథి ఆకలితో ఉంటే అతడికి భోజనం పెడతారు. ఈ అయిదు రకాల బలి కార్యక్రమం పూర్తి చేసిన తరువాత గృహస్థు భోజనం చేస్తాడు. బలి అంటే ప్రాణిహింస కాదు. మన ఇంట్లో వండిన భోజనాన్ని వీరందరికి ఇవ్వాల్సి ఉంటుంది. వీటన్నిటి పోషణ భారం గృహస్థుదే అన్న సూత్రాన్ని మన వారు ఆచరించి చూపారు. వీటన్నింటిని మనిషి పోషిస్తాడు. అలాగే వాటి వలన కూడా మనిషికి పోషణ లభిస్తుంది. మనం ఇవన్నీ అర్థం చేసుకుని జీవనం గడుపుతున్నాం. కాబట్టి మన దేశంలో 'నదుల'ను కూడా పూజిస్తాం. వృక్షాలతో పాటు తులసి మొక్క కూడా పూజలందుకుంటున్నది. ఆవును పూజిస్తాం. పామును పూజిస్తాం. విశ్వమంతా ఒక చరాచర చైతన్యంతో నిండి ఉంది. ఆ చైతన్యాన్ని సృష్టిలోని ప్రతి వస్తువులో చూడటం, దాన్ని శ్రద్ధతో, ఆత్మీయతతో దర్శించడం, దానితో స్నేహపూర్వకంగా నడుచుకోవడం, పరస్పర సహకారంవల్ల అందరి జీవనం సాగేలా మసలుకోవాలి అనేది మన జీవన పద్ధతి.

ఇదే విషయం భగవద్గీతలో కూడా చెప్పారు. 'పరస్పరం భావయంతం'- దేవతల పట్ల మీరు మంచిగా నడుచుకోండి. దేవతలు మీతో మంచిగా నడుచుకొంటారు. పరస్పర మంచి నడవడిక వల్ల సృష్టి మనుగడ సాగిస్తుంది. మన జీవన విధానం ఇలానే ఉండేది. కాని గత వందల సంవత్సరాలుగా గతి తప్పిన జీవన విధానం వల్ల మనం ఇదంతా విస్మరించాం. ఈ కారణంగానే నేడు మనం 'పర్యావరణ దినం' అని ప్రత్యేకంగా ఉత్సవం నిర్వహిస్తూ దానిని స్మరించుకోవలసి వచ్చింది. అవును చేయాలి. ఇది మంచి విషయమే. ఇది ప్రతి ఇంటిలో జరగాలి. ఈ 30 ఆగస్టున ప్రారంభం చేశాం. కాని మనం 'నాగ పంచమి' జరుపుకుంటాం. గోవర్ధన (పర్వతం) పూజ జరుపుకుంటాం, తులసీ కల్యాణం జరుపుకుంటాం. ఇవన్నీ జరుపుకుంటూ నేటి రోజును కూడా సరియైన పద్ధతిలో నిర్వహిస్తూ మనందరి జీవితాలలో ఈ సంస్కారాన్ని పునరుజ్జీవింప చేసి ఆచరణలోకి తీసుకరావాలి. మనం ఆచరించడం వల్ల కొత్త తరం ఇది నేర్చుకుని ఆచరిస్తుంది. మనం ఈ ప్రకృతిలో ఒక అవయవం (అంగం). మనం ప్రకృతి నుండి పోషణ పొందాలి. అంతేకాని ప్రకృతిని జయించడం కాదు. ప్రకృతి నుండి పోషణ పొందుతూ ప్రకృతిని రక్షించుకోవాలి. ఈ ఆలోచనతో భావి తరాలు ముందుకెడుతుంటే గత 300-350 సంవత్సరాలుగా అతలాకుతలమైన దానిని సరిదిద్దగలం. రాబోయే 100-200 సంవత్సరాలలో ప్రకృతి సురక్షితం అవుతుంది. మానవజాతి సురక్షి తంగా ఉండగలుగుతుంది. జీవితం సుందర మవుతుంది.

ఈ ఉత్సవం ఆనందం కోసం జరుపుకుంటున్నా మని మనం భావించరాదు. సృష్టి సంపూర్ణ పోషణ కోసం, మన జీవితాన్ని సుందరమయం చేసుకోవ డానికి, అందరి ఉన్నతికి ఈ పని చేస్తున్నామనే భావన మనలో ఉంచుకోవాలి. ఈ ఒక్కరోజు సందేశాన్ని సంవత్సరమంతా చిన్న చిన్న విషయాలలోనూ ఆలోచిస్తూ ఆచరణలో చూపించాలి. ఈ సందర్భంగా మీ అందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నాను. ★



# కాంగ్రెస్ బాటలో తెలుగుదేశం

**కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు ఒకే దారిలో పయనిస్తున్నాయా? ఒకే విధమైన సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయా? సోనియాగాంధీ, చంద్రబాబునాయుడు రాజకీయంగా సమాధానంలేని సమస్యలతో సతమతమవుతున్నారా? రెండు పార్టీలు నాయకత్వ సమస్యను ఎదుర్కొంటున్నాయా? గత చరిత్ర రెండు పార్టీలను వెంటాడుతోందా? ఈ ప్రశ్నలన్నింటికి రాజకీయ విశ్లేషకుల నుంచి అవుననే సమాధానమే వస్తోంది. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈ రెండు పార్టీల మధ్య అనూహ్య మిత్రత్వం కుదిరింది. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుతాన్ని, ప్రధానమంత్రి మోదీని ఓడించడమే లక్ష్యంగా చంద్రబాబు, కాంగ్రెస్ పార్టీ అప్పటి అధ్యక్షుడు రాహుల్‌గాంధీ దేశమంతా తిరిగారు. బహుముఖ రాజకీయ విన్యాసాలను ప్రదర్శించారు. ఎలాంటి అడ్డు అదుపూ లేకుండా ప్రధాని నరేంద్ర మోదీని దుర్భాషలాడారు. చివరకు ప్రజలు ఎలాంటి తీర్పునిచ్చారో అందరికీ తెలిసిందే. కేంద్రంలో కాంగ్రెస్ చిత్తుగా ఓడిపోయింది. ఇక్కడ తెలుగుదేశం కనీవినీ ఎరగని రీతిలో ఘోరపరాజయాన్ని మూట గట్టుకుంది. సోనియా వారసుడు రాహుల్ తన సొంత నియోజకవర్గం అమేథీలో చిత్తుగా ఓడిపోతే, ఇక్కడేమో చంద్రబాబు వారసుడు లోకేష్ మంగళగిరిలో భంగపడ్డారు. ఇక అక్కడి నుంచి ఈ రెండు పార్టీలలో సంక్షోభానికి తెర లేచింది. అది మెల్లమెల్లగా రెండు పార్టీల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేసింది.**



రాజనాల బాలకృష్ణ

కాంగ్రెస్ పార్టీలో తలెత్తిన నాయకత్వ సంక్షోభం నేపథ్యంలో ముమ్ముందు రాష్ట్రంలోని ప్రాంతీయ, కుటుంబ పార్టీల భవిష్యత్ ఏమిటి? ఎలా ఉంటుంది? ముఖ్యంగా గత లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌తో జట్టు కట్టి చిత్తుగా ఓడిపోయిన తెలుగుదేశం పార్టీ పరిస్థితి ఏమిటి? అనే ఆసక్తికర చర్చ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ప్రారంభమైంది. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ఈ చర్చకు శ్రీకారం చుట్టారు. కొద్దిరోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రత్యక్షంగా కాకపోయిన పరోక్షంగా ఆ పార్టీ హక్కుదారులైన నెహ్రూ-గాంధీ కుటుంబాన్ని టార్గెట్ చేశారు. అసమ్మతి గళం వినిపించారు. పార్టీకి పూర్తిస్థాయి అధ్యక్షుడు కావాలని, సంస్థాగత ఎన్నికలు నిర్వహించాలని, అందుకో వ్యవస్థను ఏర్పాటు చేయాలని నెహ్రూ-గాంధీ కుటుంబానికి (ఆ మాటకొస్తే ఏ కుటుంబ పార్టీ యజమానికి అయినా) మింగుడు పడని డిమాండ్లతో, పార్టీ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీకి లేఖ రాశారు. ఈ లేఖ రాజకీయ వర్గాల్లో, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో పెను దుమారాన్ని సృష్టించింది. గత సోమవారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఇదే ప్రధాన అజెండాగా చర్చ జరిగింది. చివరకు తాత్కాలిక సర్దుబాటుతో తాత్కాలిక ఉపశమనం అయితే లభించింది గానీ, రాజుకున్న అసమ్మతి అగ్గి ఇంకా పూర్తిగా చల్లారలేదు. శాశ్వత పరిష్కారం కనుచూపు మేరలో ఎక్కడా కనిపించడం లేదు.

ఈ నేపథ్యంలోనే జీవీఎల్ 'ప్రస్తుతం కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలు ప్రాంతీయ పార్టీలకు వర్తిస్తాయి' అన్నారు. కుటుంబ పార్టీలలో నాయకత్వ సంక్షోభం ఏర్పడినప్పుడు ఇలాంటి పరిణామాలు అనివార్యం అవుతాయని ఆయన చెప్పకనే చెప్పారు. అలాగే, ఆయన ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితిని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ జాతీయ పార్టీ కావడంతో కొన్ని రాష్ట్రాల్లోనైనా అధికారం నిలబెట్టుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో


లోకేష్


రాహుల్

ఇంచుమించుగా అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్న తెలుగుదేశం పార్టీకి ఆ అవకాశం కూడా లేదు. వైకాపా కూడా కుటుంబ పార్టీ కావడంతో దానికీ భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవు' అని పేర్కొన్నారు.

నిజమే. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం ఎదుర్కొంటున్న సంకట పరిస్థితికి, రాష్ట్రంలో తెలుగుదేశం ఎదుర్కొంటున్న సంక్షోభ స్థితికి మధ్య చాలానే సారూప్యతలు కనిపిస్తున్నాయి. సోనియాగాంధీ, చంద్రబాబునాయుడు ఇద్దరూ ఇంచుమించుగా సమ వయస్కులు. ఇద్దరూ సుదీర్ఘకాలంగా తమ పార్టీల అధ్యక్ష పదవిని పట్టుకుని కూర్చున్నారు. చంద్రబాబు 1995లో మామ ఎన్టీఆర్ నుంచి పార్టీని, అధ్యక్ష పీఠాన్ని ఆక్రమించుకున్నారు. ఆ తర్వాత మూడు సంవత్సరాలకు 1998లో సోనియా గాంధీ అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు సీతారామ్ కేసరిని 'మర్యాద'గా సాగనంపి పార్టీ అధ్యక్ష పదవిని చేపట్టారు. అప్పటి నుంచి (రాహుల్ గాంధీ అధ్యక్షుడిగా ఉన్న కొద్ది కాలం మినహా) ఇప్పటి వరకు కాంగ్రెస్ అధ్యక్ష పదవిలో కొనసాగుతున్నారు. సోనియా, చంద్రబాబు ఇద్దరు కూడా సంస్థాగత ఎన్నికల మాట లేకుండా స్వయంప్రకటిత అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. అదేవిధంగా, అక్కడ వారసత్వంగా చేతికి చిక్కిన పార్టీ పగ్గాలను రాహుల్ గాంధీకి అప్పగించేందుకు సోనియా గాంధీ పార్టీని ఫణంగా పెడుతున్నారని కాంగ్రెస్ నాయకులు కన్నీరు కారుస్తుంటే, ఇక్కడ చంద్రబాబు నాయుడు తన కుమారుడు లోకేష్‌ను అందలం ఎక్కించే ప్రయత్నంలోనే పార్టీని ఈ స్థితికి తీసుకువచ్చారని తెలుగు తమ్ముళ్లు గుసగుసలాడుతున్నారు. రెండు పార్టీలు, ఇద్దరు నాయకుల మధ్య మరో ముఖ్య సారూప్యత కూడా ఉందంటారు. రెండు పార్టీలను, ఇద్దరు నాయకులను వారి వెనక ఉన్న అవినీతి ఘనచరిత్ర వెంటాడుతోంది. ఈ నేపథ్యంలోనే ఇక పార్టీ భవిష్యత్ ఏమిటని ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో ఈ రెండు పార్టీల ముఖ్య నేతలు ఏవిధంగా అయితే ఎవరి దారి వారు చూసుకున్నారో, అదేవిధంగా ఏపీలోనూ ఎవరికి వారు పక్కదారులు వెతుక్కుంటున్నారు. ఇప్పటికే, కొందరు బీజేపీలో చేరితే మరికొందరు వైసీపీ గూటికి చేరారు. మున్ముందు ఈ దూకుళ్లు మరింత జోరందుకునే సంకేతాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

ముఖ్యంగా బీజేపీలో సంస్థాగత మార్పులు జరిగి సోము వీర్రాజు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత తెలుగుదేశం మరింతగా ఇరకాటంలో పడింది. ఏదోవిధంగా మళ్లీ బీజేపీ పంచన చేరేందుకు మీడియా ద్వారా విఫల ప్రయత్నం చేసిన చంద్రబాబు నాయుడు ఇప్పుడు కొత్త పలుకులు పలుకుతున్నారు. రాష్ట్రంలో బీజేపీ ఎదగాలంటే ఏమి చేయాలో, ఏమి చేయకూడదో చెప్పే ప్రయత్నాలు ఆయన అనుకూల మీడియా ప్రారంభించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో బీజేపీ ఎదగాలంటే చంద్రబాబు జోలికి, టీడీపీ జోలికి అసలు పోకూడదని, ఈ విషయంలో జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్‌ను పార్టీ అధిష్టానం కట్టడి చేయాలని ఉచిత సలహా కూడా ఇచ్చారు. అయితే బీజేపీ అధ్యక్షుడు వీర్రాజు, సదరు బహిరంగ లేఖ ద్వారా మీ సలహాలు చంద్రబాబుకు ఇచ్చుకోమని నిర్మొహమాటంగా కూడా బద్దలుకొట్టారు. అంతేకాదు, పతనానికి చేరువలో ఉన్న చంద్రబాబును, టీడీపీని రక్షించేందుకు ఇది మీరు చేస్తున్న ప్రయత్నమని చిన్నపిల్లలకు కూడా చక్కగా అర్థమవుతోందని చురక అంటించారు.

మరోవైపు చంద్రబాబు నాయుడు అధికారంతంలో వ్యవహరించిన తీరును మరిచిపోయి రాష్ట్ర ప్రభుత్వం మీద కేంద్రానికి ఫిర్యాదులు చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలకు సంబంధించి కేంద్రం జోక్యం చేసుకోవాలని ప్రధాన మంత్రికి లేఖ రాశారు. అలాగే, మూడు రాజధానుల విషయంలో, ఇంకా అనేక విషయాల్లో కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాగాలు తీస్తున్నారు. కానీ, ఇదే చంద్రబాబు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సాక్షాత్తు ప్రధానమంత్రిని నోటికి వచ్చిన విధంగా దుర్భాష లాడారు. సీబీఐ రాష్ట్రంలోకి రావడానికి వీలులేదని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పుడు మాత్రం కేంద్రం అన్ని విషయాల్లో జోక్యం చేసుకొని తమ ప్రయోజనాలను కాపాడాలని అంటున్నారు.

జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఎలాగైతే సంక్షోభాల సుడిగుండంలో చిక్కుకుని విలవిల్లాడుతుందో.. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ అదే అవస్థలో కొట్టుమిట్టాడుతోంది. ఉభయ పార్టీలకు భవిష్యత్ శూన్యంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ★

## 'జాగృతి-2020' పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కార్టూన్



## అసలు నిజం

# తూర్పు, ఉత్తరం దిక్కునే ఇంటి ద్వారం

ఇంటి ముఖద్వారం తూర్పు లేక ఉత్తరం దిక్కువైపు చూస్తుండాలని వాస్తుశాస్త్రం నిర్దేశిస్తుంది. ఇలా ఎందుకుండాలని ప్రశ్న ఉదయించవచ్చు. వాస్తుశాస్త్రం ఆధారంగా నిర్మించిన గృహాల వల్ల అనేక విధాలైన ప్రయోజనాలున్నాయని అనుభవపూర్వకంగా తెలుస్తోంది. ఆ గృహాల్లో నివసించేవారు అనారోగ్య సమస్యలు లేకుండా ప్రసన్నంగా, ఆహ్లాదకరంగా జీవిస్తున్నట్లు నిరూపితమైంది. వర్షాలు కురిసే విధానం, గాలులు వీచే దిశ, సూర్యకాంతి ప్రసరించే దిక్కులను ఆధారంగా చేసుకొని వాస్తు గృహనిర్మాణ విధానాన్ని తెలుపుతుంది. వాతావరణ కాలుష్యం వల్ల ఓజోన్ పొర ఇంకా క్షీణించే అవకాశం ఉంది. దానివల్ల అతి నీలలోహిత కిరణాలు సూటిగా భూమిని తాకుతాయి. ఫలితంగా మానవులకు ఎంతో హాని కలుగుతుంది. అదే ఇల్లు ఉత్తరం వైపుకు ముఖం కలిగి ఉన్నట్లయితే ఇంట్లోకి నీలలోహిత కిరణాలు ప్రవేశించే బెడద ఉండదు. అరుగుపై కూర్చొని బంధుమిత్రులతో ముచ్చటించుకోవడానికి అనుకూలంగా కూడా ఉంటుంది. ఒకవేళ ఇంటి ముఖం తూర్పు దిశగా ఉన్నట్లయితే, ఉదయపు సూర్యకిరణాల్లో విటమిన్ శాతం పుష్కలంగా ఉంటుంది. అవి లోపలి గదుల వరకు వ్యాపిస్తాయి. కాబట్టి, మన శరీరాలపై ప్రసరించి ఆరోగ్యాన్ని కలిగిస్తాయి. అలాగే అందరూ పొద్దెక్కె వరకు సోమరిలా నిద్రపోయే సమస్యను సూర్యకిరణాలు పారద్రోలి ఉదయాన్నే నిద్రలేపుతాయి. ★

## సంప్రదాయం - శాస్త్రీయత

# దీపం సర్వ తమోపహం

సనాతన హిందూ సంప్రదాయంలో దీపానికి ప్రత్యేక స్థానం ఉంది. "తేజస్సు" లేదా "అగ్ని" తత్వమే దీపం. అగ్ని పురాణం దీపానికి ఆవునెయ్యి, నువ్వుల నూనెను మాత్రమే వాడాలని చెబుతోంది. ఆవునెయ్యి దీపం, నువ్వుల నూనె దీపం కంటే తక్కువ సమయం వెలిగినా ఆవునెయ్యి దీపానికి అధిక ప్రాధాన్యత కల్పించింది శాస్త్రం. ఆవునెయ్యికి సాత్విక తరంగాలని ఆకర్షించే శక్తి అధికంగా ఉంటుంది. యజ్ఞకుండంలో ఆహుతిగా వేసిన నెయ్యి కొద్ది క్షణాల్లోనే భూమి ఉపరితలం నుండి ఎనిమిది కిలోమీటర్ల పైకి చేరి వాతావరణ కాలుష్యాన్ని తొలగిస్తుంది. ఆవు నెయ్యి క్రిమిసంహారిణి. అందువల్ల ఆజ్యం,నిరుక్తం అని సంస్కృతంలో పేర్లు. అగ్నిహోత్రంలో ఆహుతిగా వేసిన నెయ్యి కాలిన వాసన ఎంత వరకు వ్యాపిస్తుందో అంత దూరం వరకు రోగకారక క్రిములు సమూలంగా నాశనం అవుతాయని శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. అంతేకాదు అగ్ని హోత్రంలో వేసిన 10 గ్రాముల నెయ్యి ఒక టన్ను ప్రాణ వాయువుని ఉత్పత్తి చేస్తోంది. ఇలాంటి అనేక ప్రయోజనాలు ఉన్నాయి కనుకనే ఆవు నెయ్యి దీపాన్ని వెలిగించమని పెద్దలు సూచించారు. ఆవు నెయ్యితో వెలిగించిన దీపం వాతావరణంలో ఉండే సాత్విక తరంగాలను నూనె దీపం కంటే మరింత ఎక్కువగా ఆకర్షిస్తుంది. నూనె దీపం ఒక మీటరు దూరం వరకు ఉన్న సాత్విక తరంగాలను ఆకర్షిస్తే ఆవు నెయ్యి దీపం స్వర్గలోకం వరకు వ్యాపించి ఉన్న సాత్విక తరంగాలను ఆకర్షిస్తుంది. తద్వారా దేవతలు కూడా ఆకర్షణకు లోనవుతారని విశ్వసిస్తారు.

నూనె దీపం మానసిక శక్తిని ప్రేరేపిస్తే, ఆవు నెయ్యి దీపం ఆత్మ శక్తిని తట్టి లేపుతుంది. అందుకే ఎప్పుడు కూడా దీపం ఆరిపోయింది అనరాదని పెద్దలు చెబుతుంటారు. ఎందుకంటే దీపం ఆత్మస్వరూపం. జ్ఞాన స్వరూపం. ఆత్మకు మరణం ఉండదు. జ్ఞానానికి అంతం ఉండదు. అందువల్ల దీపం కొండెక్కింది, పరమైంది, శాంతించింది అని చాలా రకాలుగా అంటుంటారు. ఒక్కసారి దీపారాధన చేశాక ఇక ఆ దీపంతో ఇతర దీపాలను, హారతిని వెలిగించరాదని పండితుల అభిప్రాయం. ఎందుకంటే ఆ దీపం వెలుగుతున్న సమయంలో అది సానుకూల శక్తులను ఆకర్షిస్తూనే ఉంటుంది. ఆ సానుకూల శక్తులను కూడా అధికంగా 'V' ఆకారంలోనే ఆకర్షిస్తుంది. ఆ ద్వీపం నుండి వేరే దీపాలను అగరవత్తులు, హారతి కర్పూరాన్ని వెలిగించే సమయంలో అది ఆకర్షించే సానుకూల శక్తులకు విఘాతం కలుగుతుంది. మొత్తం ఆ ప్రాంతంలో ఉన్న దైవ శక్తులను సాత్వికత మీద చెడు ప్రభావాలను చూపించే అవకాశం ఉంటుంది.

ఒక్కో దీపానికి ఒక్కొక్క ప్రత్యేకత ఉంటుంది. ఆవు నేతితో వెలిగించిన దీపపు కాంతిని రోజు కనీసం ఒక గంట సమయం అయినా చిన్న వయసు నుండి చూస్తే దీర్ఘకాలంలో గ్లూకోమా రాదు. (కంటికి సంబంధించిన వ్యాధి) నువ్వుల నూనె దీపకాంతి రోజుకు కనీసం ఒక గంట పాటు కళ్ల మీద పడితే కంట్లో శుక్లాలు రావు. ఆవునెయ్యి, నువ్వుల నూనెతో వెలిగించిన దీపం కిరణాలు కళ్ల దృష్టిని మెరుగుపరుస్తాయని అనేక పరిశోధనల్లో నిరూపితమైంది. అందువల్ల మనం చేసే ప్రతి శుభకార్యంలో దీపం తప్పక ఉంటుంది. హృద్రోగులు, రక్తపోటుతో బాధపడేవారు, ఎక్కువగా ఒత్తిడికి లోనయ్యేవారు రోజు ఒక గంట సమయం కనుక దీపంకాంతిలో కూర్చున్నట్లయితే వారి ఆరోగ్యం మెరుగుపడుతుంది. రక్తపోటు అదుపులో ఉంటుందని ఆయుర్వేదం చెబుతుంది. కనుకనే "దీపం సర్వ తమోపహం" అని పెద్దలు అన్నారు. అంటే అన్ని రకాలైన చీకట్లను తొలగించేదని అర్థం. ★




## మంచిమార్గం

# జీవిత పరమార్థం

తాను చనిపోయిన తరువాత కాలగర్భంలో కలిసిపోకుండా తన గురించిన జ్ఞాపకాలు, జనం మధ్యలో మరపురాని గుర్తులుగా ఉండిపోతాయనీ చరిత్రలో తాను కీర్తిశేషుడిగా మిగిలిపోతానని ప్రగాఢమైన నమ్మకం కలిగిన మనిషి మరణ సమయంలోనూ ఆనందంగానే ఉంటాడు. జీవితం శాశ్వతం కాదు. యౌవనం అంతే. ధనం ఎప్పుడు అస్థిరమే. భార్య, బిడ్డలు శాశ్వతంగా ఉండిపోరు. ఈ లోకంలో శాశ్వతంగా నిలిచేవి తాను చేసిన ధర్మం, సంపాదించిన కీర్తి మాత్రమే.

చందనం, మల్లిక వంటి పుష్పాల సువాసన గాలివాటంగా వస్తుంది. పరిసరాలను పరిమళభరితం చేస్తుంది. గొప్పవారు, సుగుణవంతుల కీర్తి ప్రచండ వాయువుల్ని సైతం చీల్చుకుని సర్వవ్యాప్తి అవుతుంది. వారి కీర్తి విశ్వమంతటా వ్యాపించి కలకాలం నిలచి ఉంటుంది. మానవజన్మ లభించడమే ఎంతో అదృష్టం. ఆ జన్మను సార్థకం చేసుకోవాలంటే, కొన్ని ఉత్తమ లక్షణాలను కలిగి ఉండవల సిందే. మానవ జన్మ ఆత్మ, బుద్ధి, శరీరం అనే మూడు ప్రధాన అంశాలను కలిగి ఉంటుంది. శరీరం జంతువులకు కూడా ఉంటుంది. కానీ బుద్ధి కలిగి ఉన్న ప్రాణి మానవుడు మాత్రమే. అందువలన బుద్ధితో ఆలోచించి, ఆత్మావలోకనం చేసుకుంటూ మానవుడు జీవనం సాగించాలి. ★

# విష్ణు సహస్రనామం మానవాళికి చేరిన తీరు



భీష్మపితామహుడు విష్ణు సహస్రనామం పలుకుతున్నప్పుడు కృష్ణుడు, ధర్మరాజుతో సహ అందరూ శ్రద్ధగా విన్నారు. కాని ఎవరు రాసుకోలేదు. మరి ఈ అద్భుతమైన విష్ణు సహస్రనామం మనకెలా అందిందని సహజంగానే అందరికి సందేహం వస్తుంది.

అది 1940వ సంవత్సరం. కంచి పరమచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి వారిని ఒక వ్యక్తి ఇంటర్వ్యూ చేయడానికి టేప్ రికార్డర్‌తో వచ్చాడు. ఆ టేప్ రికార్డర్ చూసి స్వామి వారు ఆ వ్యక్తిని అక్కడున్న వారినందిరినీ ఉద్దేశించి, "ప్రపంచంలో అతి పురాతన టేప్ రికార్డర్ ఏది?" అని అడిగారు.

ఎవరూ సమాధానం చెప్పలేక పోయారు. మళ్లీ స్వామివారు, "విష్ణు సహస్రనామం మనకెలా వచ్చింది?" అని అడిగారు.

అందులో నుండి ఒకరు "భీష్ముడందించారన్నారు"

స్వామివారు, "భీష్ముడు విష్ణు సహస్రనామం పలుకుతున్నప్పుడు ఎవరు రాసుకున్నారు?"

మళ్లీ నిశబ్దం.

స్వామివారు చెప్పడం మొదలుపెట్టారు. భీష్ముడు సహస్రనామాలతో కృష్ణుడిని స్తుతిస్తున్నప్పుడు, కృష్ణుడు, పాండవులు, వ్యాస మహర్షి అందరూ అత్యంత శ్రద్ధగా విన్నారు. కానీ ఎవరు రాసుకోలేదు.

"ఈ వేయి నామాలని మనమంతా విన్నాం. కాని ఎవరం రాసుకోలేదు. ఇప్పుడెలా కృష్ణా" అని యుధిష్ఠురుడన్నాడు.

"అవును కృష్ణా ఇప్పుడెలా! ఆ సహస్రనామాలు మాకందరికీ కావాలి" అని అందరూ కృష్ణుడిని వేడుకున్నారు.

అప్పుడు శ్రీకృష్ణుడన్నాడు. "అది కేవలం సహదేవుడు, వ్యాసుడి వల్లనే సాధ్యం అవుతుంది" అని చెప్పాడు.

"అదెలా" అని అందరూ అడిగారు.

శ్రీకృష్ణుడు చెప్పాడు. ''మనందరిలో సహదేవుడొక్కడే సూత స్ఫటికం వేసుకున్నాడు. ఈ స్ఫటికం మహేశ్వర స్వరూపం. దీని ప్రత్యేకత ఏమిటంటే వాతావరణంలోని శబ్ద తరంగాలని గ్రహించి తనలో దాచుకుంటుంది. సహదేవుడు శివుడిని ధ్యానించి, ప్రార్థిస్తే ఈ స్ఫటికంలోని సహస్రనామ శబ్ద తరంగాలని వెనక్కి రప్పించి (రిప్లే) వ్యాస మహర్షితో రాయించమని కృష్ణుడు సలహా ఇచ్చాడు.

శ్రీకృష్ణుడి ఆజ్ఞ మేరకు, ఆ సహస్రనామ శబ్ద తరంగాలు వచ్చిన చోట అనగా భీష్ముడికి అతి సమీపంలో సహదేవుడు, వ్యాసమహర్షి కూర్చుని, ఆ సహస్రనామ శబ్ద తరంగాలు రిప్లే అవుతుంటే వ్యాస మహర్షి రాసాడు. ఆ విధంగా మొట్టమొదటి టేప్ రికార్డర్ శివస్వరూప స్ఫటికం ద్వారా మానవాళికి విష్ణు సహస్రనామం అందిందని మహాస్వామి వారు తెలియజేశారు. ★

# జీవితం భగవంతుని లీల, ఇక భయమెందుకు !

ఒక అడవిలో ఒక చిట్టి కుందేలుకి పిరికితనం ఎక్కువ. పెద్ద జంతువులను చూడాలంటేనే భయం. తనకంటే పెద్ద జంతువులు వస్తున్నట్లు తెలిస్తే చాలు ఏ చెట్టు వెనకో, పుట్ట వెనకో దాక్కునేది. చిన్న శబ్దం వచ్చినా, చివరకు ఆకుల శబ్దానికి కూడా బెదిరిపోయి పరుగెత్తేది. దానిని మిగతా కుందేళ్లు పిరికిదని వెక్కిరించేవి. కొన్ని రోజుల తరువాత కుందేలుకు జీవితం మీద విరక్తి కలిగింది 'ఛీ... ఛీ... నా అంత పిరికివాళ్లు ప్రపంచంలో ఇంకెవరూ ఉండరేమో. అనుక్షణం భయపడుతూ బతికేకంటే చచ్చిపోయినా బాగుణ్ణు' అనుకుని ఆత్మహత్య చేసుకోవడానికి బయలుదేరింది. నీటిలో దూకి ప్రాణం తీసుకోవాలని సరస్సు వైపు వెళ్లింది.

ఆ సరస్సు ఒడ్డున కొన్ని కప్పలు ఉన్నాయి. పెద్ద కప్పలు తీరిగ్గా కబుర్లు చెప్పుకుంటున్నాయి. చిన్న కప్పలు నీటిలోంచి ఒడ్డుకు, ఒడ్డు నుండి నీటిలోకి గెంతుతూ ఆడుకుంటున్నాయి. కుందేలు రాకను పసికట్టిన ఒక కప్ప "అటు చూడండి. ఒక కుందేలు ఇటువైపే వస్తోంది" అని గట్టిగా అన్నది. దాంతో కప్పల్లో కలకలం బయలుదేరింది. "అమ్మో ఇక్కడుంటే ప్రమాదం పదండి. దాక్కుందాం పదండి" అని ఒకదానిని మరొకటి హెచ్చరించుకున్నాయి. వెంటనే దబ్బు దబ్బుమని సరస్సులోకి దూకాయి. కుందేలు అక్కడికి చేరేసరికి అక్కడున్న కప్పలన్నీ నీటిలోకి చేరిపోయి తల మాత్రం బయటికి పెట్టి కుందేలు వైపు భయంగా చూడసాగాయి. అది చూసి కుందేలు నోరు వెళ్లబెట్టింది. 'ఇదేమిటి, అవి నన్ను చూసి ఎందుకు భయపడ్డాయి. నేను వాటినేం చేయనుగా!' అనుకుని ఆశ్చర్యపోయింది. అప్పుడు కుందేలుకు ఒక సత్యం బోధపడింది. 'ఈ ప్రపంచంలో తనకన్నా బలహీనమైన ప్రాణులు ఎన్నో ఉన్నాయి. ప్రతిదానికీ భయపడటం సరైనది కాదు. ఆపద కలిగినప్పుడు దాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలి. అంతేకానీ ఆపద కలుగుతుందేమోనని ఊహించి భయపడటం మూర్ఖత్వం' అనుకుంటూ అక్కడ నుంచి తన స్థానానికి బయలుదేరింది. ఆ సంఘటన కుందేలులో ఆత్మవిశ్వాసాన్ని కలిగించింది. అప్పటి నుంచి ధైర్యంగా జీవించాలని నిర్ణయించుకుంది. ఇక ఆరోజు నుండి చీటికీ మాటికీ భయపడకుండా, హాయిగా ఉండసాగింది. కుందేలులో వచ్చిన మార్పు మిగిలిన కుందేళ్లకు ఆశ్చర్యం కలిగించింది. అన్నీ దాన్ని మెచ్చుకోసాగాయి. ఆపదలు వచ్చినప్పుడు ధైర్యం, ఐశ్వర్యం కలిగినప్పుడు ఓర్పు, సభలో వాక్చతుర్యం, యుద్ధంలో శౌర్యం, విద్య పట్ల ఆసక్తి కలిగి ఉండాలి. లేకపోతే మనం ఉన్నా లేనట్లే లెక్క అని ప్రాచీన వచనంలో ఉంది.

ఈ సృష్టిలో అన్ని ప్రాణులకు బ్రతికే హక్కు సమానంగా ఉంది. ఏ జీవి ఇంకొక జీవి మనుగడను శాసించలేదు. అలా శాసించగలం అనే భ్రమలో ఎవరైనా ఉంటే అది ప్రాయశ్చిత్తం చేసుకోవడానికి వీలు లేనంత మహా పాతకం అవుతుంది. మనం ఈ భూమ్మీద ఉన్నంతవరకు భగవంతుడి రక్ష ఎప్పుడు ఉంటుంది. దీపం వెలగాలంటే నూనె కావాలి. మనం బ్రతకాలంటే దేవుని దీవెనలు ఉండాలి. అంతేకానీ, ఎవరు ఎవరిని ఉద్ధరించలేరు. ఎవరికివారే మనో ధైర్యం, సంకల్పంతో ముందుకు సాగాలి. ఆ తర్వాత జయాపజయాలను మన కర్మ ఫలితాలను బట్టి భగవంతుడు నిర్ణయిస్తాడు. చిన్న చిన్న విషయాలకు బెంబేలెత్తిపోవడం అంత మంచిది కాదు. జరిగేది జరగక మానదు మనం భయపడినంత మాత్రం ఏదీ ఆగదు. ఏది జరిగినా అంతా మన మంచికే అనే సానుకూల దృక్పథంతో ముందుకు సాగడం విజయవంతుల లక్షణం. ★



13వ భాగం

“.... చిన్నప్పటినుండి వెర్రి వ్యామోహం ఉండేది పుస్తకా లంటే... అదేంటో ఎవరి పుస్తకమైనా తెచ్చుకునేవాడిని కానీ పుస్తకం తిరిగి ఇవ్వాలంటే మనసు ఒప్పేది కాదు. పుస్తకాలని చూస్తుంటే ఎందరో మహానుభావులు మన చుట్టూ ఉన్న ధైర్యం. మనకి పరిచయం లేని వారు సైతం చేయి పట్టుకుని నడిపిస్తారన్న భావన. అందుకే వీటిని అపురూపంగా చూసుకుంటూ, కాపాడుకుంటూ వచ్చాను.” అని క్షణం ఆగి పైకి చూస్తూ–

“కానీ ఎంతకాలం? డెత్ కీప్స్ నో కాలెండర్. నిన్నరాత్రి ఎందుకో నిద్ర పట్టలేదు. పుస్తకాలని చూస్తూ గడిపేశాను. ఎంతసేపో తెలీదు. తెలియకుండా నిద్ర కూడా పట్టేసింది. నిద్రలో పుస్తకాలు దిక్కులేని అనాథలయినట్టు ఏదో పిచ్చి కల. వీటికి ఓ దారి ఏర్పరచాలి. అందుకే, నువ్వు గుర్తుకొచ్చావ్... నా అంత అపురూపంగా వీటిని కాపాడేవాళ్లు ఎవరు? నువ్వు గుర్తుకొచ్చావ్.... ఈ పుస్తకాలని సద్వినియోగం చేసే వారి చేతికి అందివ్వాలి. నీకు తెలుసున్న అలాంటి వారికి ఇస్తావా?” అన్నాడు.

“తప్పకుండా!” లక్ష్మణ్ చొరవ చూపిస్తున్నట్టుగా అన్నాడు.

విశ్వేశ్వరరావు తనలో తాను మాట్లాడుకొంటున్నట్టు పైకి మాట్లాడుతూ–

“ఏమిటో! ఎంతో జీవితాన్ని చూసినట్టుగా ఉంటాం... ‘జాగు’ చేయడంలో విపరీతమైన ఆనందం పొందుతారో... ఒకానొక స్థితిలో ‘జాగు’ చేయడం కన్నా ‘వదిలి’ పెట్టడానికి ఎక్కువ ఆత్రుత పడిపోతాం. బహుశా ఈ నేలలో ఉన్న మహాత్యమే అదేమో! ఎలాంటి వారినైనా మారుస్తుంది. నేనెంత నిమిత్తమాత్రుడననిపిస్తుంది. ఇష్టపడినవి కూడా బరువుగా అన్పిస్తాయే!” అన్నాడు.

లక్ష్మణ్, శివరాం జవాబులు చెప్పలేదు.

ఏం జవాబు చెప్తారు? జీవన తాత్త్వికతని మాటల్లో రంగరిస్తున్నారాయన.

విశ్వేశ్వరరావు కుర్చీలో కూర్చున్నారు. దీర్ఘ ఆలోచనలో పడ్డారు.

దాదాపు వెయ్యి పుస్తకాలుంటాయేమో! వాటిని అప్పటికే విశ్వేశ్వరరావు సాహిత్యం, రాజకీయం, తాత్త్వికం, ఆధ్యాత్మికం, బాలల సాహిత్యం సైన్స్‌ఫిక్షన్... ఇలా విభజించి ఉంచారు.

లక్ష్మణ్ మొదటగా బాలల సాహిత్యం ఉన్న షెల్ఫ్ దగ్గరకి వెళ్లాడు.

కొన్ని పాత ‘చందమామ’ల బైండింగ్‌లు దొరికాయి. వాటి పక్కనే బాలభారతం, బాలల రామాయణం, భాగవతం, కాకమ్మ కథలు, పెద్ద బాలశిక్షలు మూడు, సామెతలకి కథలు, స్ఫూర్తినిచ్చే కథలు, టాగూర్ రాసిన చిన్న పిల్లల కథలు, ఉపనిషత్ కథలు, ఆదర్శదీపాలు, రైలుబడి, పరమానందయ్య శిష్యుల కథలు, తెనాలి రామకృష్ణ కథలు, సైన్స్ కథలు, పిల్లల కోసం రాసిన జీవితచరిత్రలు, చిన్నయసూరి వ్యాకరణం, సులభంగా సంస్కృతం నేర్చుకుందాం– ఇలా, వ్యాకరణం నుండి స్ఫూర్తినిచ్చే అనేక పుస్తకాలు. “చిక్కడపల్లిలో ఒక సంస్థ ఉంది. వారు ఇలాంటి పుస్తకాలు తీసుకుంటారు. పల్లెటూళ్లలో ఉన్న గ్రంథాలయాలకి పంపుతారు. దాని ఇంఛార్జ్ లక్ష్మయ్యగారు ఉన్నారు. ఆయనకి ఫోన్ చేస్తే ఆయనే ఇంకో ఇద్దరితో వచ్చి తీసుకువెళ్తారు.” అన్నాడు లక్ష్మణ్.

ఆ మాటలంటూనే లక్ష్మయ్యగారికి ఫోన్ చేశాడు.

ఫోన్ కలవలేదు.

“సిగ్నల్ ప్రాబ్లమ్ ఉన్నట్టుంది... ఇప్పుడు తీసుకెళ్లమంటారా?” అనడిగాడు.

“ఆ.... కానీ అన్నీ ఒక్కసారి ఖాళీ చేస్తే దిగులు పట్టుకుంటుంది.” చిన్న పిల్లాడిలా బెంగగా చూశారు విశ్వేశ్వరరావు.

“... అంతలా దిగులుపడకండి! మొదట కొద్దిగా పిల్లల పుస్తకాలు తీసుకెళ్తాం. రెండురోజుల గ్యాప్ ఇచ్చి ఒక్కో విభాగం తీసుకెళ్తాను. లక్ష్మయ్యగారికి అదే మాట చెబుతాను. వాళ్లు సర్ది లైబ్రరీలకి పంపడానికి టైం పడ్తుంది.”

“ఓ తాడు ఉందా?” అనడిగాడు.

ఆయన పురికొస తాడు ఇచ్చాడు.

లక్ష్మణ్ శ్రద్ధగా ఇరవయ్యేసి పుస్తకాలు ఓ బండిల్‌లా కట్టడం ప్రారంభించాడు.

శివరాం పుస్తకాలని ఒజ్జిపెట్టి ఇస్తున్నాడు.

అరగంట దాటేసరికి ఆరు బండిల్స్ తయారైనాయి.

ఎన్నో మేధస్సులకు అక్షర రూపాలు ఆ పుస్తకాలు. ఏ క్షణంలో ఏ ఆలోచన మొలకెత్తి, అది సమాజానికి దోహదపడుతుందని భావించి ఉంటారో ఆ రచయితలు. వారి అపురూప కానుకలవి. అప్పుడే ఎవరో అన్న మాటలు శివరాంకి గుర్తువచ్చాయి–

“ఆర్థిక వారసత్వం ఎంత ఇచ్చినా పెద్ద ప్రయోజనం ఉండదు.. విద్యా వారసత్వం ఇవ్వాలి. చదువునివ్వాలి. అది సంస్కారాన్ని ఇస్తుంది. ఆ చదువు పుస్తకం ద్వారా వస్తుంది. ఆ పుస్తకాలే ఆస్తులు కావాలి!” అని –

‘కానీ ఈ జనరేషన్ వాళ్లు పుస్తకాలు చదువుతున్నారా?’

“ఇక మేము బయలుదేరతాం సార్! మళ్లీ ఫోన్ చేసి వస్తాను. ఈసారి లక్ష్మయ్యగారిని తీసుకువస్తాను.” అన్నాడు బైటకి అడుగు వేస్తూ లక్ష్మణ్.

లక్ష్మణ్ చేతిలో మూడు బండిల్స్ శివరాం చేతిలో మూడు బండిల్స్ ఉన్నాయి. ఇద్దరు బైక్ దగ్గరకి వచ్చారు.

“నువ్వు రాగలవా?” అడిగాడు లక్ష్మణ్ శివరాంని.

టైం చూశాడు. నాలుగున్నర అవుతోంది.

“ఒక్కసారి చానెల్‌కి వెళ్లి పరిస్థితి చూసి వీలైతే వస్తాను.” అన్నాడు.

“సరే... ముందు మూడు బండిల్స్ పెడ్తాను...



వెనక పట్టుకుని కూచో....” లక్ష్మణ్ బైక్ స్టార్ట్ చేస్తూ అన్నాడు.

* * *

“వెళ్లడానికి పర్మిషన్ తీసుకుంటాను.” చానెల్ లోపలికి వెళ్తూ అన్నాడు శివరాం.

అతనికి లక్ష్మణ్‌తో ఎక్కువసేపు గడపాలని ఉంది. అందుకే ఇంఛార్జ్ దగ్గరకి వెళ్లి–

“సార్.... చిక్కడపల్లి వెళ్లాలి...” అన్నాడు.

“ఎందుకు?” అనడిగాడు క్యాజువల్‌గా.

“... అక్కడ పుస్తకాలు ఇవ్వాలి సార్... నాకు తెలుసున్నాయన ఇచ్చారు... చాలా పుస్తకాలు ఉన్నాయ్..” అన్నాడు నిజాయితీగా–

“నిజంగా?” నమ్మలేనట్లుగా అన్నాడతను.

“మీరు కిందికి వచ్చి చూడొచ్చు పుస్తకాలు...”

“ఓ.కే.. ఓ.కే... నమ్మకం ఉందిలే... నిజానికి నువ్వు బైటకి వెళ్తే ఆగి పోయేంత అర్జెంట్ వర్క్ ఏదీ లేదు. కాకపోతే ఇప్పటికిప్పుడు పుస్తకాలు అర్జెంట్‌గా ఇవ్వాలా?” ఎంక్వైరీ చేస్తున్నట్టుగా అన్నాడు.

“సార్.. అదో మంచి పని... మన పని ఎప్పుడూ అర్జెంట్ అనుకునే చేయాలి... లేకపోతే ఎప్పుడొప్పుడు చేద్దామనుకుంటే ఎప్పటికీ చేయలేం... నేను అనాథని... ‘మంచి’ని అర్జెంట్‌గా చేయాలనుకున్న వారే నాకు నాలాంటి వాళ్లకి కొత్త జీవితాన్ని ఇచ్చారు. ఏమో... ఎక్కడో ఎవరో మేము తీసుకెళ్లే పుస్తకాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారేమో!” నిజాయితీగా, స్పష్టంగా అన్నాడు శివరాం.

ఇంఛార్జ్ ఏమీ మాట్లాడలేకపోయాడు.

“ఓకె, ఆల్ ది బెస్ట్!” అన్నాడు.

మరో పది నిమిషాలకి ఖైరతాబాద్ చౌరస్తా దగ్గర ఉన్నారు ఇద్దరు.

రాజ్‌భవన్ రోడ్డు నుండి ఎవరో విఐపి వెళ్తున్నారని ట్రాఫిక్‌ని ఆపారు.

ఆ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన అంబులెన్స్ సౌండ్ విన్పిస్తోంది.

“విఐపిలు తగ్గితేనే దేశం బాగుపడ్తుంది.. ప్రాణాలు ఏమైనా పర్లేదు... వాళ్ల తిరుగుళ్లకి అంతరాయం రాకూడదు...” ఆవేశంగా అన్నాడు లక్ష్మణ్.

చిత్రంగా ఓటు వేసినప్పుడు ఓటర్ వి.ఐ.పి. ఓట్లు వేశాక నాయకుడు వి.ఐ.పి. ఓటర్ ఎందుకు పనికిరానివాడు. ఐదు నిమిషాల తరువాత వి.ఐ.పి. ఎవరి కంటపడకుండా పోలీసులు జాగ్రత్తగా తీసుకెళ్లిపోయారు. ట్రాఫిక్ వదిలారు. నెక్లెస్‌రోడ్డు మీద నుండి వెళ్తుంటే అటువైపుగా ట్యాంక్‌బండ్ కన్పిస్తోంది.

“ఇక్కడే వినాయక నిమజ్జనం జరుగుతుందిగా.”

“అవును. ఆ ఉత్సవం అందరిని ఏకం చేస్తుంది.” అన్నాడు లక్ష్మణ్.

“అవునవును. మన ఆంజనేయుడి గుడి ఉత్సవం చేస్తున్నారుగా?”

“పట్టాభి బాబాయ్‌కి ఎలాగైనా చేయాలని ఉంది. ఆ ప్రయత్నాలు మొదలుపెట్టారు.”

“ఏనుగు మీద ఉత్సవం ఉంటుందా?”

“ఆ....”

“ఏనుగుని ఎక్కడ్నించి తెస్తారు?”

“జూ నుండి తెస్తాం... ఇంకా అవన్నీ మాట్లాడాలి.



ఆకెళ్ల శివప్రసాద్

ఇవాళ వేదపండితులని కలుస్తారని చెప్పాడు బాబాయ్. చాలా రోజులయ్యిందిగా చేసి... హరిహరశర్మగారని, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంలో దిట్ట.. ఆయన్ని కలుస్తున్నాడు.”

ఆ ఉత్సవం ఎన్నిరోజులు జరిగితే అన్ని రోజులు సెలవుపెట్టి అక్కడే ఉండాలనుకున్నాడు శివరాం.

మరో పావుగంటకి చిక్కడపల్లిలో ఉన్న ఆ పుస్తకాల ఎన్‌జివో దగ్గరికి చేరుకున్నారు.

(సశేషం)



సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం

# ‘ఓనమాలు’ దేవుడికి వందనాలు

**‘ఒకరోజు నేను దేశ పూర్వాధ్యక్షుడిని అవుతాను. కానీ ఎప్పటికి మాజీ విద్యావేత్తను కాను’ (One day I will become former president but I will never become ex academician) అన్నారు సర్వేపల్లి రాధాకృష్ణ పండితుడు. చదవడమన్నా, చదువు చెప్పడమన్నా అంత ఇష్టం. ఉపరాష్ట్రపతిగా రెండుసార్లు, రాష్ట్రపతిగా ఒకసారి రాజ్యాంగ పదవుల నిర్వహణకు ముందు సుదీర్ఘకాలం అధ్యాపక వృత్తిలో కొనసాగారు. దేశంలోని అనేక ప్రతిష్ఠాత్మక కళాశాలల్లో, విశ్వవిద్యాలయాలలో పాఠాలు చెప్పారు. వివిధ విశ్వవిద్యాలయాలకు ఉపకులపతిగా సేవలు అందించారు. ప్రతి చోట విద్యార్థుల మనసులపై చెరగని ముద్రవేశారు.**



విద్యార్థుల మనసులో గూడు కట్టుకొని, వారితో బ్రహ్మరథం పట్టించుకున్న ఆధునిక గురువులలో అరుదైనవారు. మైసూరు నుంచి కలకత్తా విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా వెళుతున్నప్పుడు పూలతో అలంకరించిన గుర్రబగ్గీని మైసూర్ రైల్వేస్టేషన్ వరకు విద్యార్థులే లాక్కెళ్లారంటే ఆయన విద్యార్థులకు ఎంత చేరువయ్యారో, గురుస్థానానికి ఆయనఇచ్చిన విలువ ఎంతో అవగతమవుతుంది. రాష్ట్రపతి బాధ్యతలు చేపట్టిన తరువాత కలసిన పలువురు అభిమానులు, విద్యార్థులు ఆయన పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చేసిన అభ్యర్థనను మృదువుగా తిరస్కరించారు. తన జన్మదినం కంటే ఉపాధాయ దినోత్సవంగా జరుపుకోవడం తనకు సంతోషదాయకమని చెప్పారట. అలా 1962 సెప్టెంబర్ 5 నుంచి ఉపాధ్యాయ దినోత్సవం ఆనవాయితీగా వస్తోంది. డాక్టర్ రాధాకృష్ణన్‌ను నవభారత విద్యానిర్మాతగా చెబుతారు. ‘విశ్వవిద్యాలయాలు జ్ఞాననిలయాలుగా భాసిల్లుతూ నూతన ఆవిష్కరణలు చేయాలి. కళాశాలల సంఖ్య పెరగాలి. విద్యావ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలి. విద్యపై వ్యయాన్ని ప్రజల, ప్రజాస్వామ్య భవిష్యత్ పెట్టుబడిగా భావించాలి’ అని ఆయన సూచించారు. సంపదను పెంచేందుకు, ఉజ్వల భారతదేశ నిర్మాణానికి విద్య ముఖ్య సాధనంగా, చోదకశక్తిగా పని చేయాలని, ఉపాధ్యాయలోకం ఇంధనంగా పనిచేయాలని ఉద్బోధించారు. దేశం పారిశ్రామిక ప్రగతి సాధించాలంటే విద్యారంగం పటిష్టంగా ఉండాలని భావించిన ప్రథమ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, అందుకు తగు సలహాలు కోరుతూ రాధాకృష్ణన్ అధ్యక్షతన ఏర్పాటు (1948) చేసిన విశ్వవిద్యాలయ మొదటి కమిషన్ నివేదికలో ఆయన ఈ సూచనలు చేశారు. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి తక్కువగా ఉన్నప్పుడే విద్యార్థులు తమలోని స్వేచ్ఛను, భావావేశాన్ని, కళాత్మకతను, మేధోపరమైన కార్యకలాపాలను వ్యక్తం చేసే అవకాశం ఉంటుంది’ అని సూచించి అమలు చేయించారు. ఉపాధ్యాయులకు బోధనాంశాల పట్ల ప్రేమ, శిష్యులు ఎదగాలనే తపన ఉండాలంటూ తాను ఆచరించి ఉపాధ్యాయలోకానికి ఆదర్శంగా నిలిచారు. విద్యాసంస్థలలో వాణిజ్య దృక్పథం అసమానతల సమాజానికి, అనేక దుష్ఫలితాలకు దారితీస్తుందనే ఆనాడే సూత్రీకరించారు.

‘మీరు నాలో ఆత్మవిశ్వాసం పెంపొందించే జగద్గురువైన శ్రీకృష్ణుడు. నేను ఆ జ్ఞానామృతాన్ని స్వీకరించే అర్జునుడిని’ అని గాంధీజీ, ‘నేను దేశానికి ప్రధాన మంత్రిని కావచ్చు కానీ మీ సమక్షంలో నిరంతరం విద్యార్థినే’ అని నెహ్రూజీ, ‘నా తరంలో నేను దర్శించిన స్ఫూర్తిదాయక మహనీయులు మీరే’ అని నాటి సోవియెట్ అధినేత స్టాలిన్ ప్రశంసలను బట్టి రాధాకృష్ణన్ గురుత్వ విశిష్టత బోధపడుతుంది. భారతీయ ఆధ్యాత్మిక చింతనను దేశవిదేశాలలో ప్రచారం చేసిన మేటి తత్వవేత్త. మూర్తిభవించిన సమగ్ర భారతీయ సంస్కృతి. ‘సమస్త ప్రపంచానికి మన దేశమే సంస్థానం. ఆ స్థానాన్ని మనమెల్లప్పుడు పదిల పరచుకోవాలి’ అనేవారు. రాధాకృష్ణ పండితుడు రాజనీతివేత్త, పరిపాలనాదక్షుడిగా కూడా నిరూపించుకున్నారు. ఉపరాష్ట్రపతిగా రాజ్యసభ అధ్యక్షుని హోదాలో సభా కార్యక్రమాల నిర్వహణ సందర్భంగా వివిధ పార్టీల సభ్యుల మధ్య వాదోపవాదాలు, ఆవేశకావేషాలు తారస్థాయికి చేరే సమయంలో అనునయ వాక్యాలు, హాస్యోక్తులు, శ్లోకాలతో సభను గాడిలో పెట్టేవారట. అందుకే ‘రాధాకృష్ణన్ రాజ్యసభ నిర్వహిస్తుంటే పండుగకు పదిమంది ఒకచోట చేరి సందడి చేస్తున్నట్లు ఉంటుంది’అని నెహ్రూ వ్యాఖ్యానించారు.

### అధ్యాపకత్వమే మిన్న

విద్యా విజ్ఞాన పరంగా రాధాకృష్ణన్ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నవారు మరో పూర్వ రాష్ట్రపతి అబ్దుల్ కలాం. పదవీ విరమణ తరువాత తనను మాజీ రాష్ట్రపతిగా కంటే అధ్యాపకుడిగా, శాస్త్రవేత్తగా సంబోధించడాన్నే ఇష్టమనే వారు. రాష్ట్రపతిగా ఉన్నప్పుడు పిల్లలతో సమావేశమయ్యేవారు. ఆ సందర్భంలో కొందరు పిల్లలు ‘మీకు మార్గదర్శకులు ఎవరు?’ అని ప్రశ్నిస్తే ‘అమ్మానాన్న, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు’ అని బదులు ఇచ్చారు. ‘మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ’ ఆర్యోక్తికి ఆయన జవాబు సమాంతరంగానే అనిపించినా ‘ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు’ అనడంలోనే ప్రత్యేకతను గమనించవచ్చు. ఎన్ని అంతస్తుల భవనానికైనా పునాదే కీలకమనే భావం ఆ మాటలలో వ్యక్తమవుతోంది. వృత్తిరీత్యా శాస్త్రవేత్త అయినా ప్రవృత్తిరీత్యా బోధన పట్ల ఆసక్తి చూపేవారు. గురువు–తాను తన ఆచార్యుల నుంచి నేర్చిన దానిని



శిష్యులకు బోధించి, వారు వారి శిష్యులకు (ప్రశిష్యులకు) ప్రబోధించాలని కోరుకుంటారని, అదే కృతజ్ఞత అని పెద్దల మాట. దానిని అక్షరాల పాటిస్తూ, కలాం దేశాధ్యక్షుడిగా పదవీ విరమణ తరువాత పలు విద్యాసంస్థలలో పాఠాలు చెప్పేవారు. 2015 జూలై 15న షిల్లాంగ్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)విద్యార్థులకు బోధిస్తూనే ఆ జ్ఞానశిఖరం నేలకొరిగింది.

**గురుస్థానం**

శిష్యులలో జ్ఞానాన్ని సృష్టించి, ప్రతిభా పాటవాలను పెంచి అజ్ఞానాన్ని అంతమొదిస్తాడు కనుక గురువును త్రిమూర్తుల స్వరూపుడిగా వర్ణించారు. ఆయన ఆశీస్సులు లేని పుస్తక జ్ఞానం వృథా అని, ఎంత మంచి పుస్తకమైనా ఉపాధ్యాయునికి దీటు రాదని అంటారు. 'పుస్తకాం ప్రత్యయాధీతం –నాధీతం గురుసన్నిధౌ' (గురువు వద్ద నేర్చుకొనక స్వయంగా పుస్తకాలు వల్లించడం వల్ల కలిగే జ్ఞానం అసంపూర్ణమ'ని గురువు విశిష్టతను 'చాణక్యనీతి' చెబుతోంది. 'గురువు శిక్షలేక గుఱుతెట్లు గల్గునో/ అజునికైన వాని యబ్బకైన/దాళవు జెవి లేక తలుపెట్టులూడురా' అని గురువు విలువను వేమన నొక్కి చెప్పారు.

'తాను కష్టపడి తెలుసుకున్న సత్యాన్ని స్వయంగా ఆచరిస్తూ నలుగురిని మార్చగల మహనీయుడే నా దృష్టిలో గురువు' అని గాంధీజీ, వేదాతీతమైన ఆత్మశక్తిని విద్యార్థులలో ప్రజ్వరిల్లంపచేసే గురువే జాతిభవితకు మూలస్థానమని, మనల్ని దారితప్పకుండా సమర్థంగా నడపగల ఏకైక వ్యక్తి గురువే' అని స్వామి వివేకానంద ఆచార్య ప్రాముఖ్యాన్ని ప్రస్తావించారు. 'గురువు ఆదేశాలను అనుసరించు. గురువు చూపిన దారిలో నడువు. ఎందుకంటే ఇప్పటికే గురువు ఆ దారిలో నడచి ఉండడం వల్ల ముళ్లు (సమస్యలు) ఉన్నా అవి నిన్ను బాధించవు. అటువంటి వాటిని తప్పించుకొని నడిచేలా గురువు నేర్పుతాడు' అని ఉపదేశించారు షిర్డీ సాయి.

గురుశిష్యుల అనుబంధంపై అనేక పురాణ, చారిత్రక గాథలు ఉదాహరణలుగా ఉన్నాయి. రామలక్ష్మణులు విశ్వామిత్రుని వద్ద,బలరామకృష్ణులు సాందీపుని వద్ద, భీష్ముడు పరశురాముని వద్ద, అర్జునుడు ద్రోణుని వద్ద, ఆదిశంకరులు గోవింద భగవత్పాదుల వద్ద, వివేకానందుడు రామకృష్ణ పరమహంస వద్ద… ఇలా ఎందరో విద్యను అభ్యసించారు. పురాణపురుషులంతా స్వయంజ్ఞానులు, జ్ఞానప్రదాతలు, మహిమాన్వితులైనప్పటికీ గురుకులంలో ఉండి, గురుశుశ్రూషతో విద్యాభ్యాసం చేయడం ఆనాటి ఆచారం. ఈశ్వరావతారమైన ఆదిశంకరులు సన్యాసం స్వీకరణకు గురువును అన్వేషిస్తూ వెళ్లారు. గురుస్థానం విలువ పెంపునకు, పరిరక్షణకు ఇలా చేయవలసి వచ్చిందని భావించాలి.

**'శిష్యాదిచ్ఛేత్ పరాజయం'**

తన సుఖం, పేరు ప్రఖ్యాతుల కంటే శిష్యుడి ఉన్నతి కోరేవాడే నిజమైన గురువు అంటారు. 'శిష్యాదిచ్ఛేత్ పరాజయం' ఆర్యోక్తిని బట్టి శిష్యుడి చేతిలో ఓటమి పొందాలని కోరుకుంటారు. పలానా వ్యక్తికి గురువునని చెప్పుకునేందుకు ఇష్టపడతారు. ఆయన బోధన, అనుగ్రహంతో పాటు శిష్యుని అభ్యాసం వల్లనే అది సాధ్యం. ఉత్తమ గురువు జ్ఞాన వారసత్వాన్ని అభిలషిస్తారు. తాను బోధించే మంచి తన వారసుల ద్వారా తరతరాలకు అందాలనుకుంటారు. అదే సమయంలో 'ప్రమాదో ధీమతామపి' అన్నట్లు.. తమలోని ఏవైనా లోపాలు ఉంటే వాటిని పరిహరించి తమలోని మంచిని మాత్రమే స్వీకరించాలని విద్యాభ్యాసం ముగింపువేళ గురువులు శిష్యులకు చెప్పేవారు.

గురుకులంలో వేదవిద్యను అభ్యసించిన విద్యార్థులకుగురువు చేసిన స్నాతకోపదేశం' నేడు పట్టాల ప్రదాన సమావేశంగా మారిపోతోందని అపవాదు కూడా ఉంది. 'ఒకప్పుడు పాఠశాలలు దైవ మందిరాలు. అధ్యాపకులు ఆరాధ్యదైవాలు. విద్యాలయాలకు విలువలేదు. గురువులకు పరువు



డాక్టర్ ఆరవల్లి జగన్నాథస్వామి

లేదు. ఒక విద్యార్థిని దండిస్తే ప్రజలు నిలదీస్తారు. ప్రజానాయకులు అసెంబ్లీలో దుమ్మెత్తిపోస్తారు' అని యూభయ్ మూడేళ్ల నాటి అప్పటి పరిస్థితిపై వచ్చిన ప్రబోధాత్మక చలనచిత్రంలోని పతాక సన్నివేశం గుర్తుకొస్తోంది. వర్తమాన పరిస్థితి అందుకు భిన్నంగా ఉందనలేం. గురుశిష్యుల బంధం ఎలా ఉంది? గురువులకు దక్కుతున్న విలువ ఏ పాటిదో? అక్షరాస్యత, సాంకేతికాభివృద్ధి స్థాయిలో గురువుకు గౌరవం దక్కుతుందా? 'బతకలేక బడిపంతులు' అనే సామెతను దాటి 'బతకాలంటే బడిపంతులు' అనేంత వరకు ప్రయాణించినా, నాటి వీధిబడుల అయ్యవార్ల లోని అంకితభావం, చిత్తశుద్ధి కనిపిస్తోందా? వారికి దొరికిన గౌరవం దొరకుతోందా? ఆలోచించుకోవాలి. ముఖ్యంగా సినిమాలలో తల్లిదండ్రులతో పాటు గురువును చిన్నబుచ్చే పాత్రలు ఎన్నెన్నో. విద్యా సంస్థలలో లైంగిక వేధింపుల గురించి తరచూ మాధ్యమాలలోచదువుతున్నాం, వింటూనే ఉన్నాం. ఏ కొందరి వల్లనో ఎందరో ఉపాధ్యాయులు అపవాదులు ఎదుర్కోవలసి వస్తోందని ఆవేదన వ్యక్తమవుతోంది. 'మనిషి నైతిక వర్తనానికి అవసరమయ్యే ఎన్నో సుగుణాలకు ఆలవాలం గురువు' అనే ఆర్యోక్తి నిజమయ్యేందుకు పునరంకితం కావాలి. అందుకు సమాజం సహకరించాలి.

*'శ్రీ గురుభ్యోనమః'* ★





# అమీర్ ఖాన్‌ను అర్థం చేసుకోండి

**టర్కీ పర్యటనతో ఇటీవల అమీర్ ఖాన్ బాగా వార్తలకు ఎక్కాడు. అక్కడ అధ్యక్షుడు ఎర్డోగాన్ భార్యను కలిసిన అమీర్ ఖాన్ ఆ దేశమన్నా, అక్కడి ప్రజలన్నా తనకు, తన భార్య కిరణ్‌రావ్‌కు ఎంతో ఇష్టమని చెప్పాడు. టర్కీ ఇటీవలనే హాజియా సోఫియా ప్రదర్శనశాలను అధికారికంగా మసీదుగా మార్చింది. కుర్ద్ లపై మారణకాండ సాగించింది. అన్నిటికంటే ముఖ్యంగా భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్‌కు అనుకూలంగా వ్యవహరిస్తోంది. ఇలాంటి నేపధ్యంలో అమీర్‌ఖాన్ అక్కడ పర్యటించడం, అధ్యక్షుడి భార్యతో సమావేశం కావడం పలు విమర్శలకు తావిచ్చింది.**

అమీర్‌ఖాన్ తనని తాను సెక్యులర్ విలువలకు కట్టుబడిన, ఏ పార్టీకి చెందని వ్యక్తిగా చెప్పుకుంటుంటాడు. కానీ యదార్థం వేరు. ఆయన గురించి అనేక నిజాలను ట్విట్టర్‌లో అనేకమంది బయటపెడుతూనే ఉంటారు. అలా బయటపెట్టిన విషయాల్లో ఒకటి 2002 గుజరాత్ అల్లర్లపై అమీర్ చేసిన వ్యాఖ్యలు. ఆ అల్లర్లకు అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ కారణమని అమీర్ ఆరోపించాడు. అదీ ఈ సంఘటనలపై కోర్ట్‌లో విచారణ జరుగుతున్న సమయంలో ఇలాంటి వ్యాఖ్యలు చేశాడు. అప్పుడు కేంద్రంలో యూపీయే (2005) ప్రభుత్వం ఉంది. అయితే ఆ తరువాత నరేంద్ర మోదీ నిర్దోషి అని కోర్ట్ తీర్పునిచ్చింది. కానీ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు చెప్పని అమీర్ ఆ తరువాత జరిగిన ఏ మతకలహాల గురించి ఇంత తీవ్రమైన రీతిలో స్పందించలేదు. బహుశా ఆ గొడవలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరగకపోవడం, 'సెక్యులర్' పార్టీలైన కాంగ్రెస్ లేదా సమాజ్ వాదీలను ఏమి అనకూడదనే నియమం వల్ల అలా ప్రవర్తించి ఉంటాడు.

2014 సార్వత్రిక ఎన్నికల సమయంలో తాము పూర్తి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని బీజేపీ విశ్వసిస్తున్నప్పుడు సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడే విధంగా ప్రజలు ఓటు వేయాలంటూ విజ్ఞప్తి చేశాడు అమీర్. యూపీఏ రెండు ప్రభుత్వాలూ పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయాయంటూ మీడియా కోడై కూస్తున్నా, ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉన్నా సంకీర్ణ ప్రభుత్వం వైపే అమీర్ మొగ్గుచూపాడు. సంకీర్ణ పరిస్థితుల్లో ప్రాంతీయ పార్టీలు ఎలాగూ తమకు అనుకూలమైన కాంగ్రెస్ కే మద్దతు తెలుపుతాయి. అప్పుడు మళ్లీ అవినీతిమయమైన యూపీఏ ప్రభుత్వమే ఏర్పడుతుందన్నది అతని అంచనా కావచ్చును. ఇలా ఏ రాజకీయ పార్టీకి చెందనివాడినని చెప్పుకునే అమీర్ ఆ సందర్భంలో మొహమాటం లేకుండా కాంగ్రెస్ పక్షాన నిలిచాడు. అయిన ఈ విషయాన్ని ఎవరు పట్టించుకోలేదు, అతన్ని నిలదీయలేదు.

2015లో కూడా అమీర్ ఇలాంటి వైఖరే అవలంబించాడు. అప్పుడు తన భార్యకు భారత్‌లో ఉండాలంటే భయంగా ఉందని, వేరే దేశానికి వెళ్లిపోవాలా అనే సందేహం కలుగుతోందంటూ అమీర్ బహిరంగంగానే వ్యాఖ్యానించాడు. 'మూకుమ్మడి దాడులు', 'అసహిష్ణుత', అవార్డ్‌ల వాపసి వంటి వాటిపై చర్చ జరుగుతున్న రోజుల్లో అతను అలా మాట్లాడాడు. అమీర్ ఖాన్ సినిమా పీకే కూడా ఆ సమయంలోనే అత్యధిక వసూళ్లు నమోదు చేసింది. అంతేకాదు ఆ ఉపన్యాసంలోనే ఐసిస్‌కు, తీవ్రవాదానికి, ఇస్లాంతో ఎలాంటి సంబంధం లేదంటూ అమీర్ తేల్చి చెప్పాడు. కానీ సరిగ్గా అప్పుడే ప్యారిస్‌లో ఇస్లాం తీవ్రవాదులు దాడి చేసి 127మందిని పొట్టన పెట్టుకున్నారు.

భారత్‌లో తన సినిమా ద్వారా వందల కోట్ల రూపాయలు సంపాదించుకున్న అమీర్ ఖాన్‌కు హఠాత్తుగా ఈ దేశం సురక్షితమైనదికాదని ఎందుకనిపించింది? అవార్డ్ వాపసిని సమర్ధించిన అతను తన పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులను ఎందుకు తిరిగి ఇవ్వలేదు? ముంబైకంటే ఐసిస్ దాడులతో దద్దరిల్లిన ప్యారిస్ సురక్షితమైనదని అతను అనగలడా? లేక ఇస్లాం అసహిష్ణుత, తీవ్రవాదం అంటే అతనికి భయంలేదా? భారత్‌లో ఉండాలంటే భయమేస్తోందన్న తన భార్య ఇటీవల టర్కీ, అక్కడి ప్రజలను ఎంతో మెచ్చుకుందని అమీర్ అంటున్నాడు. మరి వాళ్లు టర్కీకి ఎప్పుడు తరలిపోతున్నారు?

మన స్నేహితులవల్ల మనమేమిటో తెలుస్తుంది

ఎంతో 'ఆలోచనాపరుడు', 'ప్రజావాణి వినిపించేవాడు', పని విషయంలో రాజీపడనివాడు, బాలీవుడ్ గాసిప్‌లకు దూరంగా ఉండేవాడంటూ అమీర్ ఒక పేరును, గుర్తింపును తెచ్చుకున్నాడు. ఇటీవల సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ సంఘటనలో బాలీవుడ్, పాకిస్థాన్ సంబంధాలపై చర్చ జరుగుతున్నప్పుడు కూడా సల్మాన్, షారూఖ్, ఇతరుల పేర్లు వినిపించాయి. కానీ అమీర్ ఖాన్ గురించి ఎవరు ప్రస్తావించలేదు. అలా వివాదరహితుడు అనే పేరు మాత్రం అమీర్ సాధించగలిగాడు.

అయితే అమీర్ వివాదాలకు నిజంగానే దూరంగా ఉన్నాడా అంటే లేదనే చెప్పాలి. ఒక సిద్ధాంతానికి చెందినవారితో సన్నిహితంగా మెలగడమేకాక అనేకసార్లు వాళ్లు చేసే పనులను బాహాటంగానే సమర్ధించాడు. అర్బన్ నక్సల్ మేధా పాట్కర్‌కు మద్దతు తెలుపడమేకాక 2006లో నర్మదా నదిపై వంతెనల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఆమె చేసిన ఉద్యమానికి బాగా ప్రచారం చేశాడు. అయితే డ్యామ్‌ల నిర్మాణం వల్ల నిర్వాసితులైన వారందరికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించడమేకాక, వారికి తగిన జీవనోపాధి చూపించింది. ఈ ప్రాజెక్ట్ పూర్తవడం వల్ల గుజరాత్‌లోని కరవు ప్రాంతాలకు పుష్కలంగా నీరందుతోంది. ఆ సమయంలో అమీర్ చేస్తున్న ప్రచారాన్ని కాంగ్రెస్ నాయకులు సైతం వ్యతిరేకించారు. అయినా అతను

పవన్ పాండే

మేధాపాట్కర్ వైపే నిలుచున్నాడు. అలాగే భారత్‌లోని వివిధ ప్రాంతాల్లో నీటి కొరతకు, కాలుష్యానికి కారణమైన కోకాకోలా కంపెనీకి చాలాకాలం ప్రచారం చేశాడు. కాబట్టి డబ్బు సంపాదన విషయం వచ్చినప్పుడు పాపం అతనికి ప్రజాసమస్యలు గుర్తుండవు.

పాకిస్థాన్‌కు చెందిన ఇస్లాం మతబోధకులుగా మారిన సంగీతకారులు మౌలానా తారిక్ జామీల్, జున్నైద్ జంషెడ్‌లు అమీర్‌కు చాలా సన్నిహితులు. హజ్ యాత్రకు వెళ్లినప్పుడు అమీర్ గంటలపాటు మౌలానా తారిక్ జామీల్ పాటలు వినేవాడు. అలాగే తన సినిమాలు విజయవంతం కావాలని ఆశీర్వదించాలని మౌలానాను తరచూ కోరేవాడు. కోవిడ్ మహమ్మారి ప్రపంచమంతా వ్యాపించడానికి మహిళలు కురుచ దుస్తులు ధరించడమే కారణమంటూ ఇటీవల మౌలానా జమీల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. అనేక సందర్భాల్లో బహిరంగంగానే హిందూ ధర్మాన్ని, దేవిదేవతలను గురించి అవమానకరంగా మాట్లాడటం ఆయనకు అలవాటు. ‘ప్రేమను పెంచాలి, పంచాలి’ అని చెపుతూనే మరోపక్క హిందూత్వం ఒక బూటకపు, అసత్యపు మతమంటూ వ్యాఖ్యానించడం మౌలానా తారిక్‌కే చెల్లింది. కానీ మరి ఇంకెవరైనా ఇస్లాం పట్ల అటువంటి ‘ప్రేమను’ కనబరిస్తే వెంటనే వాళ్ల తలకు వెలకడతారు. తబ్లీగి జమాత్‌కు చెందిన ఈ మౌలానా భక్తుడిగా ఆయన సిద్ధాంతానికి, వ్యాఖ్యలకు తాను కట్టుబడి ఉన్నాడో, లేడో అమీర్ ఖాన్ స్పష్టం చేయాలి.

ఇటీవల అమీర్ ఖాన్ టర్కీ పర్యటన కూడా అనేక విమర్శలకు తావిచ్చింది. టర్కీ ప్రస్తుత అధ్యక్షుడు ఎర్డోగాన్ సెక్యులరిజాన్ని భూస్థాపితం చేసి ఆ దేశాన్ని పూర్తిగా ఇస్లామీకరించడంలో చాలా శ్రద్ధ తీసుకున్నాడు. ఇస్లాం సంస్థ ముస్లిం బ్రదర్ హుడ్‌కు మద్దతునివ్వడమేకాక భారతీయ ముస్లింలకు మతమౌఢ్య పాఠాలు చెప్పేందుకు ఐసిస్ తీవ్రవాదులను కూడా ఎర్డోగాన్ నియమించారని అనేక వార్తలు వచ్చాయి. భారతీయ విద్యార్థులను టర్కీ పంపడానికి ఇక్కడి టర్కీ రాయబార కార్యాలయం వివిధ స్వచ్ఛంద సంస్థలతో కలిసి చురుకుగా ఏర్పాటు చేస్తోందని, అక్కడకు వెళ్లిన విద్యార్థులకు టర్కీ, పాకిస్థాన్ అనుకూల సిద్ధాంతాలు నూరిపోస్తున్నారని ఆ వార్తల సారాంశం. కాశ్మీర్, పౌరసత్వ సవరణ చట్టం (సిఏఏ), జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్ఆర్‌సి)ల విషయంలో ఇప్పటికే పాకిస్థాన్ అనుకూల వైఖరి



అవలంబిస్తున్న టర్కీ అధ్యక్షుడు భారత్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సిరియాలో కుర్ద్‌లపై దారుణ మారణకాండకు పాల్పడిన టర్కీ, గతంలో జరిగిన అర్మేనియా మారణకాండతో తమకు సంబంధం లేదని బుకాయిస్తోంది. మరోపక్క ఆ దేశంలో ప్రభుత్వమే పనిగట్టుకుని చర్చిలని మసీదులుగా మారుస్తోంది. ఈ విషయాలన్నీ ప్రపంచం మొత్తానికి తెలుసు. అన్నీ మీడియా సంస్థలు వీటి గురించి రాసాయి, చర్చించాయి. ఈ నేపథ్యంలో అమీర్‌ఖాన్ ఆ దేశానికి వెళ్లడమేకాక అక్కడ అధ్యక్షుడి భార్యను కలిసి ఆ దేశం పట్ల ఆసక్తిని, గౌరవాన్ని వ్యక్తం చేయడం అతని మోసపూరిత మనస్తత్వాన్ని తెలుపుతుంది. ఇదే అమీర్‌ఖాన్ మన దేశానికి వచ్చిన ఇజ్రాయెల్ ప్రధాని ఆహ్వానాన్ని తిరస్కరించడం గమనార్హం.

## అమీర్ సినిమా, సిద్ధాంతం

అమీర్ ఖాన్ ధోరణి అతని సినిమాల్లో కూడా స్పష్టంగా కనిపిస్తుంది. ఉదాహరణకు అతని పీకే సినిమానే తీసుకుందాం. ఈ సినిమా హిందూ ధర్మాన్ని, హిందూ దేవిదేవతలను కించపరచడంతోపాటు ఆ దేవతలను పూజించడమంటే ‘రాంగ్ నంబర్‌కు ఫోన్ చేయడమే’ నని చూపించారు. అలాగే ముస్లిం అబ్బాయిలతో హిందూ అమ్మాయిలు స్నేహం చేయడంలో తప్పులేదంటూ ఆ సినిమాలో చెప్పారు. కానీ నిజ జీవితంలో ఇలాంటి స్నేహాల వల్ల హిందూ అమ్మాయిలు అనేక కష్టాలు, నష్టాలు ఎదుర్కొంటున్నారన్న విషయం ఎక్కడా ప్రస్తావించలేదు. అమీర్ ఖాన్ తాను చేసుకున్న రెండు పెళ్లిలలో హిందూ అమ్మాయిలనే ఎంచుకున్నాడు. పైగా తమ పిల్లలను ఇస్లాం ప్రకారమే పెంచుతానని వారికి స్పష్టంగా చెప్పాడు కూడా.

భారతీయ సమాజంలో సమస్యలను పెద్దవి చేసి చూపేందుకు అతను సత్యమేవ జయతే అనే టీవీ సీరియల్ కూడా తీశాడు. మూడు సీజన్‌లుగా సాగిన ఈ సీరియల్ మొత్తంలో ఎక్కడా ట్రిపుల్ తలాక్, నిఖా హలాల్, మదర్సాలలో అత్యాచారాలు, నిఖా ముతా, ముస్లిమేతర ఆడపిల్లలను పెంచడం, పర్దా వంటి వాటిలో ఏ ఒక్కటీ చూపించలేదు, వాటి గురించి చర్చించలేదు. అలా హిందూ సమాజాన్ని కించపరచడం, ముస్లిం సమాజంలో లోపాలు బయటపడకుండా చూడటం ఈ సీరియల్ ఉద్దేశమని అనిపిస్తుంది. తాను నటించే, తీసే సినిమాలన్నింటిలో అమీర్ ఖాన్ తన మాటే చెల్లించుకుంటాడన్నది అందరికీ తెలిసిన విషయమే. అంటే అతను మరెవరో చెప్పిన ప్రకారం చేయడం లేదని, తన సొంత ఆలోచనతోనే వ్యవహరిస్తున్నాడని స్పష్టమవుతుంది. ఇంకా చెప్పాలంటే అమీర్ ఖాన్ ఇస్లాం అనుకూల, హిందూ లేదా భారత వ్యతిరేక ధోరణి అవలంబిస్తున్నట్లు తెలిసిపోతోంది.

## ముగింపు

భారత ప్రజానీకం అమీర్ ఖాన్‌కు ఎంతో సంపదనిచ్చారు, ప్రేమాభిమానాలు పంచారు. సినీ రంగంలో ఆ స్థాయికి అతను చేరుకున్నాడంటే అది హిందూ ప్రేక్షకుల పుణ్యమే. కానీ విచిత్రమేమిటంటే అలాంటి అమీర్ ఖాన్ తనకు ఈ స్థాయి, హోదా ఇచ్చిన ఈ దేశాన్ని నిరసించి, ఈ దేశాన్ని వ్యతిరేకిస్తున్న, తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పరాయి దేశాన్ని పొగుడుతున్నాడు. అమీర్ ఖాన్ అనుసరిస్తున్న ఈ ఇస్లాం అనుకూల, హిందూ వ్యతిరేక ధోరణి గురించి అందరూ తెలుసుకోవాలి. ముఖ్యంగా ఆయన అభిమానులు ఈ విషయాన్ని గుర్తించాలి. అలా చేయకపోతే ఈ దేశానికి, ధర్మానికి అన్యాయం చేసినవారమవుతాం. సత్యమేవ జయతే! ★

**భారతీయ సమాజంలో సమస్యలను పెద్దవి చేసి చూపేందుకు అతను సత్యమేవ జయతే అనే టీవీ సీరియల్ కూడా తీశాడు. మూడు సీజన్‌లుగా సాగిన ఈ సీరియల్ మొత్తంలో ఎక్కడా ట్రిపుల్ తలాక్, నిఖా హలాల్, మదర్సాలలో అత్యాచారాలు, నిఖా ముతా, ముస్లిమేతర ఆడపిల్లలను పెంచడం, పర్దా వంటి వాటిలో ఏ ఒక్కటీ చూపించలేదు, వాటి గురించి చర్చించలేదు. అలా హిందూ సమాజాన్ని కించపరచడం, ముస్లిం సమాజంలో లోపాలు బయటపడకుండా చూడటం ఈ సీరియల్ ఉద్దేశమని అనిపిస్తుంది.**



# రాజగురువు

23వ భాగం

**చా**ణక్యుడు ముసిముసి నవ్వులు నవ్వాడు. "పర్షియా మీద దాడి చేయటం అయ్యే పనికాదని నాకు తెలుసు, నీకు తెలుసు. కానీ సెల్యూకస్ అలా అనుకోకపోవచ్చు కదా. అందుకే ఒక చిన్న పుకారు పుట్టించాను."

"ఏమని?"

"మన తదుపరి దాడి పర్షియా మీదే అని."

"సెల్యూకస్ నమ్మడు."

"అందుకే మిమ్మల్ని గాంధారంలో విడిది చేయించాను. గాంధారం దాటితే వచ్చేది పర్షియా సామ్రాజ్యమేగా. మీరు ఇక్కడదాకా వచ్చారంటే, అది సరిహద్దు దాటే ప్రయత్నాల్లో భాగంగానే అని అతను అనుకోవాలని నా ప్రయత్నం."

"ఈ ప్రయత్నంలో నేను చేయగలిగింది ఏదన్నా ఉందా?"

"ఎందుకు లేదు? తప్పనిసరిగా ఉంది. సైనికులను ఉద్దేశించి ఒకటి రెండు ఉపన్యాసాలు ఇవ్వాలి. ఆ ఉపన్యాసాలలో ఒక విషయం పదేపదే చెప్పాలి. త్వరలో పర్షియన్ సామ్రాజ్యం మీద మన దండయాత్ర మొదలవుతుందని, అందరూ సిద్ధంగా ఉండాలని చెప్పాలి. ఆనాడు అలగ్జాండర్ జగజ్జేత కావాలని బయలుదేరి ఆ కార్యం సాధించలేక వెనుదిరిగాడు. నేను మాత్రం అలా వెను తిరగనని వారి మనసుల్లో నాటుకునేలా చెప్పాలి. భరత ఖండంలో ఇక జయించటానికి ఏమీ మిగలలేదని, ఇక భూభాగం అంటూ మిగిలి ఉంటే అది భరత ఖండానికి అవతల మాత్రమే ఉందని, కాబట్టి పర్షియా మీద దండయాత్రకు అందరినీ సిద్ధంగా ఉండమని చెప్పాలి"

"నేను ఉపన్యాసం ఇస్తే ఏమవుతుంది? ఆ అబద్ధం మాటల వలన ఎవరికి ఉపయోగం?"

"చూద్దాం! నువు చేయవలసింది నోటితో నాలుగు మాటలు మాట్లాడటమేగా.."

"తరువాత నిజంగా యుద్ధం చేయమని పర్షియా పంపరుగా?"

"మన భారతీయులకు అంత స్వార్థం లేదు చంద్రగుప్తా. ఇప్పుడూ మనకు ఎవరి భూభాగం అవసరం లేదు. కాకపోతే నాలుగు కాలాలపాటు శాంతిని అనుభవించాలంటే ఇలాంటి కిటుకులు కొన్ని చేయక తప్పదు" అన్నాడు చాణక్యుడు.

* * *

దాదాపు నెల రోజులు తక్షశిలలోనే విడిది చేశాడు చంద్రగుప్తుడు.

చాణక్యుడు చెప్పినట్లు సైనికులు చేసే విన్యాసాలు చూస్తూ, వారిని ఉత్సాహపరచే ప్రసంగాలు ఇస్తూ కాలం గడుపుతున్నాడు.

సరిగ్గా నెల రోజులు గడిచేటప్పటికి పర్షియన్ దూత మెగస్తనీస్ తక్షశిల వస్తున్నాడని తెలిసింది.

భారతదేశ చక్రవర్తిని కలుసుకునే అవకాశం ఇవ్వమని అతని నుండి కబురు వచ్చింది.

వెంటనే అనుమతి ఇచ్చాడు చాణక్యుడు.

అయితే అతన్ని కలిసే ముందు తామేం మాట్లాడాలో ఆలోచించి ఉంచుకున్నారు చాణక్యుడు, చంద్రగుప్తుడు.

మెగస్తనీస్ విద్యావంతుడు. ఎన్నో రాజ్యాలు తిరిగినవాడు. ఎవరితో ఎలా మాట్లాడాలో బాగా తెలిసినవాడు.

మెగస్తనీస్ వెళ్లేటప్పటికి చంద్రగుప్తుడు సింహాసనం మీద కూర్చుంటే, కొద్దిగా కింద ఉన్న ఆసనం మీద చాణక్యుడు కూర్చుని ఉన్నాడు.

చంద్రగుప్తుని ఎదురుగా నిలబడి వంగి నమస్కరించి తనతో తెచ్చిన బహుమానాలు చక్రవర్తి ముందు ఉంచాడు మెగస్తనీస్.

అతనికి ఉచితాసనం చూపించాడు చంద్రగుప్తుడు.

"ఊరకరారు మహానుభావులు. అంత దూరం నుండి మా దేశానికి రావటంలో ఆంతర్యం ఏమిటో?" అంటూ మాటలు మొదలు పెట్టాడు చాణక్యుడు.

"నాలుగు దేశాలు తిరిగితేనే కదా ఆచార్యా, నాలుగు కొత్త విషయాలు తెలిసేది. ఎన్నో దేశాలు తిరిగాను. అక్కడి వింతలు విశేషాలు తెలుసుకున్నాను. గ్రంథస్థం చేశాను. ఇప్పుడు భారతదేశంలో పర్యటించాలని కోరిక కలిగింది. మీ అనుమతి కోరుతూ ఇటు వచ్చాను."

"నిరభ్యంతరంగా మా దేశం అంతా తిరగటానికి మీకు అనుమతిస్తున్నాను." అన్నాడు చంద్రగుప్తుడు. అంతటితో ఆగకుండా, "ఎవరు చూడవచ్చారు? కొన్నాళ్లకు మన రెండు దేశాలు ఒకటే అవుతాయేమో" అని కూడా అన్నాడు.

ఆ మాటలతో మెగస్తనీస్ అనుమానం పెరిగింది. కానీ, తన అనుమానాలు బయట పెట్టకుండా, "ప్రభువుల వారిని కలవటానికి పాటలీపుత్రం రావాలేమో అనుకున్నాను. ప్రభువుల వారి దర్శనం మా దేశానికి ఇంత దగ్గర్లో ఈ తక్షశిలలో జరుగుతుందని నేను ఊహించలేదు."

"అవును. యుద్ధం చేద్దామనుకున్నపుడు వైరిపక్షానికి ఎంత దగ్గర్లో ఉంటే అంత మంచిదని..." అన్న చంద్రగుప్తుడిని రహస్యాలు మాట్లాడవద్దన్నట్లు వారిస్తూ చూశాడు చాణక్యుడు.

చాణక్యుని సైగలు గమనించిన మెగస్తనీస్ అనుమానాలు మరింత బలపడ్డాయి. నిజానికి చాణక్యుడు కావాలని తనలో అనుమానాలు రేకెత్తిస్తున్నాడని అతనికి తెలియదు. "ప్రభూ, మీ పొరుగున ఉన్నది మా పర్షియా సామ్రాజ్యమే కదా.



పుట్టగంటి గోపీకృష్ణ

మనవి మిత్రదేశాలు కదా. మీకు వైరిపక్షం ఎక్కడ ఉంది?" అని అడిగాడు.

"విషయం ఇంతవరకు వచ్చింది కాబట్టి నేను కల్పించుకుంటున్నాను" అంటూ మొదటిసారి మాట్లాడాడు చాణక్యుడు. "మిత్రత్వం ఇద్దరు సమానుల మధ్య ఉంటేనే నిలుస్తుంది. మా చక్రవర్తి మీ పర్షియా సామ్రాజ్యాన్ని తనతో సమానంగా భావించటం లేదు."

"ఎందులో చూసుకున్నా మా పర్షియా కూడా బలవంతమైనదే" చెప్పాడు మెగస్తనీస్.

"ఒకప్పుడు అలగ్జాండర్ పర్షియా చక్రవర్తి డేరియస్ గురించి అలా భావించలేదు. యుద్ధం చేసి అతని సామ్రాజ్యాన్ని ఆక్రమించుకున్నాడు. ఇప్పుడు మా చక్రవర్తి కూడా జగజ్జేత కావాలనుకుంటున్నాడు" నిర్లిప్తంగా చెప్పాడు చాణక్యుడు. "పైగా మేము మా ప్రయత్నాలు రహస్యంగా ఉంచలేదు. ఏది చేసినా బహిరంగంగానే చేస్తున్నాం."

"అవును. అందుకే మీ ప్రయత్నాలు సెల్యూకస్‌కి తెలిశాయి. ఆయన తన మాటగా మీతో ఒక విషయం చెప్పమన్నారు."

"వింటున్నాం, చెప్పండి" అన్నాడు చంద్రగుప్తుడు.

"సెల్యూకస్ మిమ్మల్ని శత్రువుగా భావించటం లేదు. యుద్ధం ఇద్దరినీ నష్టపరుస్తుంది. ఇద్దరూ కలిసి కూర్చుంటే ఉభయతారకంగా ఉండే ఒప్పందం చేసుకోవచ్చు. మీకు ఇష్టమైతే చెప్పండి, సెల్యూకస్ మిమ్మల్ని కలవటానికి స్వయంగా వస్తారు."

"నన్ను కలవటానికి సెల్యూకస్ వస్తానన్నాడా?" అన్నాడు చంద్రగుప్తుడు.

"నిజం చెప్పాలంటే ఆయన చాలా దగ్గర్లో ఉన్నారు. మీరు ఊఁ అంటే రెండు రోజుల్లో మీ ముందుంటారు" అన్నాడు మెగస్తనీస్.

"కలవను అనే అంత శత్రుత్వం కూడా మా మధ్య లేదుగా. రమ్మనండి." అన్నాడు చంద్రగుప్తుడు.



* * *

రెండు రోజుల తరువాత జరిగింది చంద్రగుప్తునితో సెల్యూకస్ సమావేశం.

తనతో ఎంతో విలువైన బహుమతులు తెచ్చాడు సెల్యూకస్. అతని వెనుక ఉన్నాడు మెగస్తనీస్.

తనకు చంద్రగుప్తునితో యుద్ధం చేసే ఆలోచన లేదనీ, ఇరు దేశాలు పక్కపక్కన ఎవరి పరిపాలన వారు చేసుకుంటూ ప్రశాంతంగా ఉండవచ్చనీ వివరించాడు సెల్యూకస్.

అలగ్జాండర్ మరణ సమయంలో అధికారం అప్పచెప్పమన్న వారిని కాదని సెల్యూకస్ ఒక రకంగా బలవంతంగా పర్షియాని ఆక్రమించుకున్నాడు. దానితో అతనికి అలగ్జాండర్ విశ్వాసపాత్రులతో, మసిడోనియన్‌లతో వైరం తీవ్ర దశలో ఉంది. పడమర దిక్కు నుండి వస్తున్న ప్రమాదాలనే కాచుకోలేక పోతుంటే, మగధలాంటి శత్రువు తూర్పు సరిహద్దున ఉండటం భరించలేని భారం అనిపించింది. అందుకే చంద్రగుప్తునితో ఏదో ఒక ఒప్పందం చేసుకుని సంధి కుదుర్చుకోవాలని ప్రయత్నం చేస్తున్నాడు.

ఇద్దరు చక్రవర్తుల మధ్య చాలాసేపు చర్చలు జరిగాయి.

చాణక్యుడు, మెగస్తనీస్ ఆ చర్చల్ని మరింత ముందుకు తీసుకెళ్లారు.

ఎంతో నేర్పుగా ఒప్పందాన్ని తమకు అనుకూలంగా ఉండేలా చూశాడు చాణక్యుడు. అలా అని పూర్తిగా సెల్యూకస్‌కి వ్యతిరేకంగా వెళ్లలేదు. అలా చేస్తే ఏ ఒప్పందమైనా ఎక్కువ రోజులు మనలేదు.

ఎట్టకేలకు గాంధారానికి పడమటి దిక్కున, ఎడారి

వరకు ఉన్న పర్షియన్ సామ్రాజ్యాన్ని మగధకు వదులుకోవటానికి సెల్యూకస్ ఒప్పుకున్నాడు.

ఇద్దరి మధ్య ఒప్పందం కుదిరింది.

ఒక్క రక్తపు బొట్టు చిందించకుండా విశాల సామ్రాజ్యాన్ని అఖండ భారతంగా నిర్మించాడు చాణక్యుడు.

"ఈ ఒప్పందం మీద నా ముద్ర పడాలంటే మీరు చేయవలసిన పని ఒకటుంది" అన్నాడు సెల్యూకస్.

ఆఖరి నిమిషంలో మళ్లీ ఈ తకరారు ఏమిటా అనుకున్నారు చాణక్యుడు, చంద్రగుప్తుడు.

"నా కూతురు హెలెన్" ఒక చిత్ర పటం చూపుతూ అన్నాడు సెల్యూకస్. "అద్భుత సౌందర్యరాశి. ఈమెను నేను చంద్రగుప్తునికి ఇచ్చి వివాహం చేయాలను కుంటున్నాను. మీరు దానికి అంగీకరిస్తే, మీ ఒప్పందానికి నాకెలాంటి అభ్యంతరం లేదు" అన్నాడు.

ఇలా బంధుత్వం కలుపుకుంటే ఇక జీవితాంతం తనకు చంద్రగుప్తునితో భయం ఉండదనుకున్నాడు సెల్యూకస్.

ఈ విషయంలో చంద్రగుప్తుడి సమాధానం ఏమై ఉంటుందో చాణక్యుడికి తెలుసు. అందుకే అతను సమాధానం చెప్పకముందే, రక్షున కల్పించుకున్నాడు. "మాకు ఆలోచించుకోవటానికి ఒక రోజు సమయం ఇవ్వండి" అన్నాడు.

* * *

"రాజకీయాలకు వ్యక్తిగత జీవితాన్ని ముడి పెట్టటం నాకు ఇష్టం లేదు. నేను ఈ ప్రస్తావనకు ఒప్పుకోను" అన్నాడు చంద్రగుప్తుడు తరువాత ఏకాంతంలో.

"చక్రవర్తికి వ్యక్తిగత జీవితం అంటూ వేరే ఉండదు. నీ కొడుకు కాబోయే చక్రవర్తి. నీ భార్య దుర్ధర ఈ సామ్రాజ్యానికి మహారాణి. మరి నీ వ్యక్తిగత జీవితం నీకు మాత్రమే ఎలా పరిమితమవుతుంది?" నచ్చచెప్తున్నట్లు అన్నాడు చాణక్యుడు.

"నేను ఒకసారి పెళ్లి చేసుకున్నాను. దుర్ధరను ఇష్టపడి పెళ్లి చేసుకున్నాను. తను త్వరపడి ముందుగా పైకి వెళ్లిపోయింది. ఇప్పుడు హఠాత్తుగా ఎవరినో సంతోషపెట్టటానికి, ముక్కూ మొహం తెలియని అమ్మాయిని వివాహం చేసుకోవటానికి నా మనసు అంగీకరించటం లేదు."

"ఎవరి సంతోషం కోసమో కాదు. కోట్లాది ప్రజల సంతోషం కోసం. నీ మీద నమ్మకం ఉంచిన నీ రాజ్య ప్రజల కోసం. అఖండ భారతం స్థాపించాలన్న నీ గురువు లక్ష్యం కోసం. స్నేహితుడు మోసగాడైతే ఎలా శాంతి ఉండదో, చిన్న రాజ్యంలో ప్రజలకు సుఖం ఉండదు."

"అఖండ భారతం ఇప్పటికే సాకారమైంది."

"దీనితో పరిపూర్ణమవుతుంది."

చాణక్యుడి వైపు దీనంగా చూశాడు చంద్రగుప్తుడు. "నేను దుర్ధరను మరచిపోలేను. మరో యువతిని మహారాణిగా ఊహించుకోలేను" అన్నాడు.

"దుర్ధర స్థానం ఎవరూ తీసుకోలేరు. అది ఎప్పటికీ ఆమెదే. కాబోయే చక్రవర్తి బిందుసారుడే. నువ్వు హెలెన్‌ను వివాహం చేసుకుంటే ఆమె కేవలం నీకు భార్య అవుతుంది. అంతే తప్ప ఈ రాజ్యానికి మహారాణి కాదు."

"అప్పుడు వివాహం చేసుకుని ఆమెకు అన్యాయం చేసినట్లు కాదా?"

"ఎందుకవుతుంది? ఆమెను వివాహం చేసుకుంటానని నువ్వు అడగలేదు. ఆమె తండ్రి సెల్యూకస్ కోరుతున్నాడు. కనీసం ఈ బంధుత్వ కారణంగా రాబోయే రోజుల్లో మీ ఇద్దరి మధ్య యుద్ధం రాకుండా ఉంటుందని అతని ఆశ. రెండు రాజ్యాల ప్రజల ఆశలను వమ్ము చేసే అధికారం నీకు లేదు" కరాఖండిగా చెప్పాడు చాణక్యుడు.

చంద్రగుప్తునికి హెలెన్‌ను వివాహం చేసుకోవటానికి అంగీకరించక తప్పలేదు.

తక్షశిలలో వివాహం జరిగింది.

చంద్రగుప్తునికి తోడుగా కూతురు హెలెన్‌ను వదిలి వెనుతిరిగాడు సెల్యూకస్.

భార్యను తీసుకుని పాటలీపుత్రం బయలుదేరాడు చంద్రగుప్తుడు.

* * *

చంద్రగుప్తుడి కొత్త భార్య హెలెన్‌ను పాటలీపుత్రం మనసారా స్వాగతించలేదు. ఆమె వేషభాషలను మగధ ప్రజలు వింతగా చూస్తున్నారు.

హెలెన్ కూడా తన ప్రవర్తనను కానీ, వస్త్రధారణను కానీ కొత్త ప్రదేశానికి అనువుగా మార్చుకునే ప్రయత్నం చేయలేదు.

తను పుట్టి పెరిగిన దేశాన్ని వదిలి రావటం ఆమెకు నరకప్రాయంగా ఉంది.

చంద్రగుప్తునితో అయినా సఖ్యత ఉంటే ఎలా ఉండేదో? ఒకటి రెండు రోజులు ఆమెతో కాలం గడపటానికి ప్రయత్నించిన చంద్రగుప్తుడు అది సాధ్యం కాదని గ్రహించాడు. ఆమె మాట్లాడుతున్న భాష అతనికి అర్థమయ్యేది కాదు. అతని భాష ఆమెకు రాదు.

"కనీసం మాటలు మాట్లాడుకునే వీలు లేనపుడు కలిసి ఎలా ఉంటాం?" అన్నాడు చంద్రగుప్తుడు ఒకరోజు అర్థం కాని ఆమె భాషతో విసిగిపోయి.

నిరసనగా నవ్వింది హెలెన్.

"రేపే మా భాష నేర్పటానికి ఒక పండితుడిని ఏర్పాటు చేస్తాను. నేర్చుకో" అన్నాడు చంద్రగుప్తుడు.

ఒకవారం తరువాత తిరిగి కలిసినపుడు ఆమె ఏమి నేర్చుకుందో పరీక్షించబోయాడు. ఒక్క అక్షరం కూడా రాలేదని తెలిసి నిర్ఘాంతపోయాడు. ఎందుకు నేర్చుకోలేదో కారణం అడగాలన్నా, ఆమె భాష అతనికి రాదు.

ఆ పండితుడినే పిలిపించాడు చంద్రగుప్తుడు.

"ప్రభూ! రాణిగారికి నేర్చుకోవాలన్న కోరిక లేదు. పైపెచ్చు, నేను కొత్త భాష ఎందుకు నేర్చుకోవాలి? మీ ప్రభువే మా భాష నేర్చుకోవచ్చు కదా అన్నారు" చెప్పాడు ఆ పండితుడు.

అప్పుడర్థమైంది చంద్రగుప్తుడికి హెలెన్‌కి ఇష్టం లేనిది తన దేశం, తన భాష మాత్రమే కాదు తను కూడా అని.

* * *

బిందుసారుడికి అయిదు సంవత్సరాల వయసు వచ్చింది. అతన్ని విద్యా బుద్ధులు నేర్పటం కోసం తక్షశిలకు పంపాడు చంద్రగుప్తుడు.

గడచిన అయిదు సంవత్సరాలలో మగధ సామ్రాజ్యం మరే రాజ్యం చేరుకోలేని ఉన్నత స్థితికి చేరుకుంది.

**"ఈ ఒప్పందం మీద నా ముద్ర పడాలంటే మీరు చేయవలసిన పని ఒకటుంది" అన్నాడు సెల్యూకస్. ఆఖరి నిమిషంలో మళ్లీ ఈ తకరారు ఏమిటా అనుకున్నారు చాణక్యుడు, చంద్రగుప్తుడు.**

**"నా కూతురు హెలెన్" ఒక చిత్ర పటం చూపుతూ అన్నాడు సెల్యూకస్. "అద్భుత సౌందర్యరాశి. ఈమెను నేను చంద్రగుప్తునికి ఇచ్చి వివాహం చేయాలను కుంటున్నాను. మీరు దానికి అంగీకరిస్తే, మీ ఒప్పందానికి నాకెలాంటి అభ్యంతరం లేదు" అన్నాడు. ఇలా బంధుత్వం కలుపుకుంటే ఇక జీవితాంతం తనకు చంద్రగుప్తునితో భయం ఉండదనుకున్నాడు సెల్యూకస్.**



తమ అవసరాలు చెప్పకముందే గ్రహించే చక్రవర్తి మీద ప్రజలందరికీ ఒక నమ్మకం.

తన కోసం అవసరం వస్తే ప్రాణాలైనా ఇచ్చే ప్రజలున్నారని చంద్రగుప్తునికి ఒక ధైర్యం.

రాజ్యంలో అతను తిరగని ప్రదేశం లేదు.

రోజుల తరబడి పయనించి మారుమూల ప్రదేశాలకు కూడా వెళ్లేవాడు. ఎక్కడకు వెళ్లినా అక్కడి ప్రజల అవసరాలు కనుక్కోవటమే అతని పని. వారి కష్టాలు దూరం చేయటమే అతని కర్తవ్యం.

ముందు ఆ పర్యటనలను చాణక్యుడు వ్యతిరేకించాడు. ఒక చక్రవర్తి ఇంతగా పర్యటించటం తగదని అతను హితవు చెప్పబోయాడు. కానీ చంద్రగుప్తుడు ఆ విషయంలో చాణక్యుని మాట వినలేదు.

చంద్రగుప్తుడు వెళుతున్నది ప్రజలకు చేరువగా కాదు, హెలెన్‌కు దూరంగా అని చాణక్యునికి ఆలస్యంగా అర్థమైంది. ఇద్దరికీ సర్ది చెప్పటానికి చాణక్యుడు అనేక ప్రయత్నాలు చేశాడు. ఆమెకు అతనంటే ఇష్టం లేదు. అతనికి ఆమె అంటే ఆసక్తి లేదు. రెండూ రెండు విభిన్న ధృవాలు.

ఇద్దరు రాజులు ఆడిన చదరంగంలో తను ఒక పావుగా మారానన్నది హెలెన్ బాధ.

తండ్రితో పాటు చంద్రగుప్తుడిని కూడా సమాన స్థాయిలో ద్వేషించటం మొదలు పెట్టింది.

నేను ఏ నేరం చేశానని నాకీ ఆజన్మాంత శిక్ష అని ఆమె బాధపడేది. కనీసం తన బాధ చెప్పుకోవటానికి తన భాష తెలిసిన మరో మనిషి లేని దీనావస్థ ఆమెది.

ఆమెకు తోడుగా పర్షియా నుండి పరిచారికలను రప్పించాడు చాణక్యుడు. అలా అయినా ఆమె మనుషుల్లో కలుస్తుందేమో అనుకున్నాడు. కానీ అతని ఆశలు అడియాశలే అయ్యాయి.

* * *

బిందుసారుడు తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకుంటున్నాడు. విద్య, వినయం, వీరత్వం దేంట్లోనూ తండ్రికి తీసిపోదని విద్య నేర్పుతున్న గురువులు చెప్తున్నారు.

రెండు మూడు నెలలకొకసారి పాటలీపుత్రం వచ్చేవాడు బిందుసారుడు.

అప్పుడప్పుడూ తను స్వయంగా తక్షశిల వెళ్లేవాడు చంద్రగుప్తుడు.

పెరిగి పెద్దవుతున్న బిందుసారుడిని చూసి హెలెన్ మరింతగా క్షోభిల్లేది.

తన జీవితం నాశనం కావటానికి, తనకు ఇష్టం లేని పెళ్లి చేయటానికి, తనకుపిల్లలు లేకపోవటానికి కారణమైన తండ్రి సెల్యూకస్‌ని, చంద్రగుప్తుడినీ ద్వేషించటంతోనే ఆమెకు కాలం గడిచిపోతోంది.

క్రమక్రమంగా ఆమె తనలో తాను ముడుచుకుపోయింది. ఎవరితోనూ మాట్లాడటం మానేసింది. తనలో తాను ఏదో మాట్లాడుకుంటూ ఉండేది.

అది చిత్త చాంచల్యం అన్నారు వైద్యులు.

ఏది ఏమైనా ఆమె మానసిక వైకల్యం కారణంగా బాహ్య ప్రపంచం నుండి విముక్తి పొందింది.

'అదృష్టవంతురాలు' అనుకున్నాడు చంద్రగుప్తుడు మనసులో.

* * *

బిందుసారుడికి రెండు పదుల వయసు వచ్చే వరకు ముళ్ల మీద కూర్చున్నట్లు సింహాసనం మీద కూర్చున్నాడు చంద్రగుప్తుడు.

భార్య దుర్ధర వియోగం అనుక్షణం బాధిస్తున్నా, దాన్ని రాజ్యాన్ని పరిపాలించటానికి అడ్డుకానివ్వలేదు అతను. పైగా అన్నీ తానై చూసుకుంటున్న చాణక్యుడు ఉండనే ఉన్నాడు.

అప్పటికి మగధ పేరు ప్రపంచంలోనే పేరొందిన రాజ్యాల్లో ఒకటిగా మారు మోగింది.

సైనిక సంపదలో కానీ, జన రంజకంగా పాలనను అందించటంలో కానీ మగధ ప్రపంచం లోనే అగ్రభాగాన నిలిచింది. వేలెత్తి చూపటానికి వీలు లేని పాలన అంటే మగధలోనే ఉంటుందని అందరు అనుకునేవారు.

చాణక్యుడు తన అర్థశాస్త్రానికి, రాజనీతి శాస్త్రానికి ప్రయోగశాలగా మగధను ఎన్నుకున్నాడు.

(ముగింపు వచ్చేవారం)



# మధునాపంతులవారి మహేతిహాసం 'ఆంధ్రపురాణం'

గత సంచిక తరువాయి

**కొండవీటి రాజ్య పతనానంతరం రెడ్డిరాజుల ప్రాభవం అంతరించి వెలమరాజుల ప్రాభవం ప్రారంభమైంది. సర్వజ్ఞ సింగభూపాలుడు తన ఆస్థానంలో ప్రముఖ కవిపండితులను ఆదరించి పోషించాడు. శ్రీనాథుడు సింగభూపాలుని సాహితీపోషణకు ముగ్ధుడై "రావుసింగమహీపాలు ధీవితాలు"ని దర్శించుకొని శారదాస్తవంతో ఆయన మెప్పు పొందాడు. సింగభూపాలుని కాలం నాటికే భక్తకవి పోతన రసకవిత్వ సృష్టి సాగుతుంది. కాకతీయుల కాలంలో విలసిల్లిన తెలుగు సంస్కృతీ వైభవాన్ని, సాహితీ ప్రాభవాన్ని రెడ్డిరాజులు, రాచకొండ వెలమ ప్రభువులు పునఃప్రతిష్ఠ చేసే ప్రయత్నాలు జరిగినందున కవి ఈ పర్వాన్ని పునఃప్రతిష్ఠాపర్వంగా పేర్కోవడం ఔచిత్యంగా ఉంది.**

ఈ కావ్యంలో ఆరోదైన విద్యానగర పర్వంలో విద్యారణ్యస్వామి ఆదేశానుసారంగా హరిహర బుక్కరాయ సోదరులు తమ గురువైన మాధవాచార్యులకు అవివందనం చేసి, విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించడాన్ని కవి సముచితంగా వర్ణించాడు. హరిహరరాయలు పిదప బుక్కరాయలు విజయనగర సింహాసనాన్ని అధిష్ఠించారు. బుక్కరాయల కొలువులో ప్రముఖ కవి ఉత్తర హరివంశకర్త నాచన సోముడు ఆస్థానకవి. అతడి పాలనావైభవాన్ని వర్ణిస్తూ "అతని కంటే ధన్యుడాంధ్ర రాజన్యుల ఉండడనుమాట సమధికోక్తి కాదు" అని ప్రశంసించాడు. బుక్కరాయలు సువిశాల సామ్రాజ్య విస్తరణతో 27 సంవత్సరాలు సుపరిపాలన అందించాడు. మధునాపంతులవారీ పర్వంలో ప్రౌఢదేవరాయల పాలనావిభవాన్ని సాహిత్య సంగ్రహణ పారీణతను ఔచిత్యంగా వర్ణించాడు. ఆయన ఆస్థానకవి గౌడ ఢిండిమభట్టు రాజుగారి ముత్యాలశాలలో కవితాగోష్టులు పాండితీ ప్రకర్ష చర్చలు సాగేవి. ఆస్థానకవి గౌడ ఢిండిమభట్టు గర్వోన్నతిని వర్ణిస్తూ "కవితాగర్వము శాస్త్ర గర్వము మహీకాంతాశ్రయ పాత్రవైభవ గర్వము ముప్పిరిగొనిన విద్వత్ సార్వభౌముడిగా" వర్ణించాడు. ఢిండిమభట్టు మూడు గర్వాలతో ముప్పిరిగొని విర్రవీగుతున్నాడు. మొదటిది కవితా గర్వం. రెండోది శాస్త్ర పాండిత్యగర్వం. మూడోది రాజాశ్రయగర్వం. భవిష్యత్‌లో మూడు గర్వాలతో అతనికి శ్రీనాథుడు చేతిలో గర్వభంగం తప్పదన్న విషయాన్ని ఈ పదాల ప్రయోగంతో సూచించడం మధునాపంతులవారి కవితా ప్రతిభకు నిదర్శనం.

అష్టదిక్కులలో పండితులను గెలిచిన గౌడ ఢిండిమభట్టు బిరుదాంకితుడి అసలు పేరు అరుణగిరినాథుడు. అతడి పాండిత్య గర్వం కొండవీటి ప్రాంతంలో ఉన్న శ్రీనాథుడి చెవులకు సోకింది. శ్రీనాథుడు కొందరి శిష్యులతో కలిసి ప్రౌడదేవరాయల ఆస్థానానికి ముందుగా వెళ్లి ఢిండిమభట్టుని మర్యాదపూర్వకంగా కలిశాడు. అతడి ఆకారంలో ఉన్న దురహంకారాన్ని గమనించాడు. పిదప ప్రౌఢదేవరాయలను దర్శించు కొన్నాడు. ముమ్మకవి అభిప్రాయాన్ని అనుసరించి రాయలు శ్రీనాథుని ఆస్థాన సాహిత్య గోష్ఠికి ఆహ్వానించాడు. చంద్రభూష క్రియాశక్తి మహోపాధ్యాయులవారు అధ్యక్ష స్థానంలో కూర్చున్నారు. శ్రీనాథ, గౌడ ఢిండిమభట్టుల శాస్త్ర వైదుష్య కవితా శేముషీ చర్చను నిర్వహించాడు. శ్రీనాథుడు ఢిండిమభట్టును ఓడించి విజేతగా నిలిచాడు. అధ్యక్ష స్థానంలో ఉన్న చంద్రభూష క్రియాశక్తి శ్రీనాథుని విజేతగా ప్రకటించాడు. రాయలవారు శ్రీనాథుని పాండిత్యానికి ముగ్ధుడై తమ అదృష్టం వల్ల ఇటువంటి శాస్త్ర విషయాలు విన్నామని శ్రీనాథ మహాకవి కనకాభిషేకానికి అర్హుడని ప్రకటించాడు. ఢిండిమభట్టు రాజుగారి ఆదేశం మేరకు శ్రీనాథుని కనకాభిషేక సత్కారం నిర్వహిస్తూ "ఢిండిమ బుదేంద్రు నలఘు పాండితిని గెలిచి / కవులలో సార్వభౌమత గన్న మేటి / ఇతని వ్యుత్పత్తి నెరిగి ప్రౌఢేశ్వరుండు / చేయుచున్నాడు స్వర్ణాభిషేక పూజ'' అంటూ



సహృదయ వ్యాఖ్యానంతో శ్రీనాథుని కనకాభిషేక కార్యక్రమాన్ని గొప్పగా రాయలవారు నిర్వహించారు. ఈ ఘట్టంలో మధునాపంతులవారు శ్రీనాథ డిండిమభట్టుల శాస్త్రార్థచర్చలను, కనకాభిషేక కార్యక్రమాన్ని ఔచిత్యమైన పద ప్రయోగాలతో మనోజ్ఞంగా వర్ణించాడు.

ఈ పర్వంలోనే సాళువ నరసింహరాయల పాలనా వైభవాన్ని ఆయన ఆస్థానకవి పిల్లలమర్రి పినవీరభద్రుని జెమినీ భారత రచనావిధానాన్ని సముచితంగా వర్ణించాడు. వాణీకటాక్షంతో ఒక్కరోజులో పినవీరన జైమినీ భారతాన్ని రచించి మహాకవులకు ఆశ్చర్యం కలిగించే విధంగా సత్కారం స్వీకరించాడు. ఈ పర్వంలోనే తుళువ నరసరాజు మంత్రాంగ దక్షతను మనోజ్ఞంగా వర్ణించాడు.



ఏడోదైన శ్రీకృష్ణదేవరాయపర్వంలో తిమ్మరుసు ధీయుక్తి, శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక మహోత్సవాన్ని కవి అద్భుతంగా వర్ణించాడు. రాయలవారు భూపరిపాలనా భారాన్ని వహిస్తున్నందున అష్టదిగ్గజ కవులు మహాకావ్య రచనలకు పూనుకున్నారని, అష్టదిక్పాలకులు శ్రద్ధతో రాయలవారిని పర్యవేక్షిస్తున్నారని, అష్టదిగ్గజ పదాన్ని శ్లేషచమత్కారంగా వర్ణించాడు. ఎనిమిదో పర్వమైన విజయపర్వంలో రాయలవారి పాలనలో సామ్రాజ్య విస్తరణపై దృష్టిని కేంద్రీకరించి దుర్భేద్యమైన ఉదయగిరి, కొండవీడు, అద్దంకి, వినుకొండ, నాగార్జునకొండ వంటి వాటిని జయించి పూర్వ దిగ్విజయ యాత్రలో కృతార్థుడయ్యాడు. మహామంత్రి తిమ్మరుసు రాజనీతి చతురతతో రాయలవారు సువిశాల సామ్రాజ్య పాలకుడయ్యాడు. కటకం పాలకుడైన గజపతి రాయలవారితో సంధి చేసుకొని తన కుమార్తె అన్నపూర్ణను ఇచ్చి కన్యాదానం చేశాడు. సువిశాల సామ్రాజ్య స్థాపనానంతరం సాహితీ తృష్ణతో భువనవిజయ సభను ఏర్పాటు చేశాడు. సాహితీ సమరాంగణా సార్వభౌముడైన రాయలవారి భువనవిజయ సభలో సంస్కృత కర్ణాట ద్రావిడ భాషల మహాకవులున్నారు. భువనవిజయ సభలో అల్లసాని పెద్దనను "ఆంధ్రకవితా భువనాంచిత శిల్పబంధ మంధరుడిగా" వర్ణించాడు. పెద్దనగారి మనుచరిత్రను అంకితం తీసుకునే సందర్భంలో ఆహ్లాదభరితమైన అనుభూతిని కలిగించే, ఔచిత్యమైన ఉపమానాలను ప్రయోగించి అద్భుతంగా వర్ణించాడు. రాయలవారు ఉత్సాహంతో పెద్దన కాలికి గండపెండేరం తొడిగాడు. పల్లకీని తన చేత్తో ఎత్తి మోశాడు. శ్రీకృష్ణదేవరాయల అనంతరం పాలకుడైన అచ్యుత దేవరాయలు, సదాశివరాయలు, వెంకటపతిరాయల పాలనతో తుళువ వంశం అంతరించింది. ఆరవీటి వంశస్థుడైన అళియ రామరాయలు రాజ్యపాలకుడైన విషయాన్ని కవి వర్ణించాడు.

మధునాపంతులవారు విజయపర్వంలో రాయలవారి దిగ్విజయ యాత్రలను, సువిశాల సామ్రాజ్య స్థాపనను భువనవిజయ సాహితీ సభా విశేషాలను అద్భుతంగా వర్ణించాడు.

చివరిదైన నాయకరాజ పర్వంలో విజయనగర రాజ్యంలో లెస్సగా విరిసి పండిన ఆంధ్ర వైభవం తంజావూరు నాయకరాజుల పాలనలో 17వ శతాబ్దంలో వెల్లివిరిసింది. అచ్యుత నాయకుడు, ఆయన మంత్రి గోవింద దీక్షితుడు శస్త్ర శాస్త్రాలలో ఉద్దండులు. యువరాజు రఘునాథ నాయకుడు సాహితీ ప్రీతితో అభినవ శ్రీకృష్ణదేవరాయలు అనిపించుకున్నాడు. శత్రువులను గెలిచి విజయాలను సాధించి తన సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నాడు. గర్వంతో విర్రవీగిన మధుర మహారాజును చూసి పరిహసిస్తూ "వీరెవరయ్యా ! మధుర మహారాజులే / ఇట్లు కృపణులై పట్టువడన్ వీరికి వలసెనే" మధునాపంతులవారీ సన్నివేశంలో తిక్కన భారతంలో ద్రోణుడు ద్రుపదమహారాజుని పరిహసించిన విషయాన్ని అనుసరించాడు. రఘునాథ నాయకుడు వాల్మీకి చరిత్ర, అచ్యుతాభ్యుదయం వంటి కావ్యాలు రాశాడు. ఆయన ఆస్థానంలో విజయవిలాసకర్త చేమకూరి వెంకటకవిని ఆదరించి పోషించాడు.

రఘునాథ నాయకుని వారసుడుగా విజయరాఘవ నాయకుడు పాలకుడయ్యాడు. తండ్రి మార్గంలో యక్షగానాలు విరివిగా రాశాడు. రంగాజమ్మను ఆస్థాన కవయిత్రిగా ఆదరించి కనకాభిషేకం చేశాడు. ఇందిరామందిరం అనే సభలో సాహిత్య గోష్ఠులు నిర్వహించేవాడు. నాయకరాజ పర్వంలో కవి నాయకరాజుల పాలనా వైభవాన్ని సాహిత్య పోషణను సముచితంగా వర్ణించాడు.

ఆధునిక చారిత్రక కావ్యాలలో ప్రసిద్ధిమైంది ఆంధ్రపురాణం. ఆంధ్రపురాణ రచనల వల్లనే



డా॥ పి.వి. సుబ్బారావు
9849177594

మధునాపంతులవారికి ఆంధ్ర విశ్వవిద్యాలయం వారి కళాప్రపూర్ణ బిరుదు లభించింది. ఆంధ్ర కల్హణ – అనే బిరుదు వరించింది. అభినవ తిక్కన తుమ్మల సీతారామమూర్తి ఆంధ్ర పురాణాన్ని మెచ్చుకుంటూ "తీయని కైతతోడ గడిదేరిన పాండితి తోడ ఆంధ్ర రా/ ష్ట్రీయ వికాసమున్ వలచు డెందము తోడ నపార శౌచ ల / క్ష్మీయుత జీవన ప్రవణశీలముతోడ నెసంగు సత్యనా / రాయణ శాస్త్రికిన్ జయపరంపర సంతతమై లభించుతన్." అంటూ ప్రశంసించాడు. వేలూరు శివరామశాస్త్రి గారు ఆంధ్ర పురాణాన్ని పారవశ్యంతో చదివి అందులో ఉన్న హాలుడు, నన్నయ, గుణఢ్యుడు రాజరాజులు సజీవపాత్రలై తన కళ్లెదుట సంచరిస్తున్నారని ఇది కథ కాదు కదా ! అంటూ ఆశ్చర్యంతో ప్రశంసించారు.

శాస్త్రిగారు శ్రీఖండం చైత్రరథం వంటి ఖండకావ్యాలు ఛందోబద్ధంగా, మనోజ్ఞమైన శైలిలో రచించాడు. 'గోపికా శౌక' అనే ఖండకావ్యాన్ని భావకవితా ధోరణిలో రచించాడు. పద్యకవిత్వమే కాకుండా, "ఆంధ్ర రచయితలు" అనే గ్రంథంలో నూట పదమూడు మంది ఆధునిక రచయితలను గూర్చి విమర్శ దృష్టితో సరళమైన గద్యశైలిలో రచించాడు. కొన్నాళ్లు 'ఆంధ్రీ' అనే పత్రికను కూడా నడిపారు. ఆయన జీవితం ఉపాధ్యాయ వృత్తిలో పునీతమైంది.

మధునాపంతులవారి ఆంధ్రపురాణంలో తెలుగు సంస్కృతీ దీప్తినీ, రాజవంశాల కీర్తినీ రాజుల ఆదరణలో విలసిల్లిన సాహితీ పరిమళాల స్ఫూర్తినీ ఆకర్షణీయమైన సరళసుందరమైన శైలిలో అచ్చతెలుగు పదాల పోహళింపుతో అక్షరబద్ధం చేశారు. ఆంధ్రజాతి ఉన్నంతవరకు ఆంధ్రపురాణం నిలిచి ఉంటుంది. మధునాపంతులవారి కీర్తిని అజరామరం చేసి చిరస్మరణీయకావ్యం ఆంధ్రపురాణం.

శతజయంతి సందర్భంగా మధునాపంతులవారికి అక్షరాభివందనాలు.

***(కేంద్ర సాహిత్య అకాడెమీ వారి మధునాపంతుల శతజయంతి గోష్ఠిలో సమర్పించిన వ్యాసం.)***

పల్లెపాలెం, తేదీ. 5-3-2020.

వ్యాకసర్త : రిటైర్డ్ ప్రొఫెసర్ & తెలుగు శాఖాధిపతి, సి.ఆర్. కళాశాల, గుంటూరు.

# తీసివేత

## కొత్తపల్లి ఉదయబాబు

"ఆరులోంచి నాలుగు తీసివేస్తే ఎంత బావ?" అని నేను అడిగిన ప్రశ్నకి బావ నా తల మీద ఒక్కటిచ్చాడు.

"ఆ మాత్రం కూడా తెలీదా? ఐదవ తరగతి చదువుతున్నావ్?"

"ఎంతో చెప్పమంటే కొడతావేంటి? నీతో మాట్లాడను పో" అన్నాను బుంగమూతి పెట్టి.

"అది కాదు సీత. ఆరులోంచి నాలుగు తీసేస్తే రెండు అని చెప్పలేనంత చవటననుకున్నావా? పన్నెండవ తరగతి చదువుతున్న నాకు అవమానం కాదూ?" అన్నాను.

"నీ మొహం. ఏం కాదు. అరులోంచి నాలుగు తీసి వేస్తే ఆరే" అన్నాను జడగంటలు చేత్తో తిప్పుతూ..

"అమ్మ దొంగా అలా వచ్చావా? నువ్వు ఆ ఉద్దేశంతో అడిగావనుకోలేదు సుమా." అన్నాడు బావ నవ్వేస్తూ.

"ఒక సంఖ్యతో మరో సంఖ్యని కూడితే విలువ పెరుగుతుంది. అదే పెద్ద సంఖ్య లోంచి చిన్న సంఖ్య తీస్తే విలువ తగ్గుతుంది. తీసి-వేస్తే విలువ పెరగదు గానీ అదే ఉంటుంది. అర్థం అయిందా."

"అబ్బా ఎంత బాగా చెప్పావ్? ఎవరు నేర్పారు నీకు ఈ తెలివితేటలన్నీ?" అన్నాడు బావ నా బుగ్గ చిదుముతూ..

"మనిషి జీవితం కూడిక లాగా పెరగనైనా పెరగాలి లేదా తీసి-వేసినట్టుగా నిలకడ గానైనా ఉండాలి అంతే గాని తీసివేతలా ఉండకూడదంట. మా లెక్కల టీచర్ సరోజినీ మేడం చెప్పారు." అన్నాను.

"మా మాస్టర్లు ఎవరూ ఇలా విశదంగా చెప్ప లేదు. ఏది ఏమైనా నువ్వు నా జీవితంలోకి వస్తే కూడిక లాగానే నీ విలువ పెంచుతాను. అంతే గానీ తీసేయడం మాత్రం చెయ్యను. సరేనా?"

"ఏదీ ఒట్టు వెయ్యి." అంటూ చేయి చాచాను.

"గడుసుదానివే ." అని తమలపాకు లాంటి నా చేతిలో బచ్చలి ఆకులాంటి తన చెయ్యి వేసి మృదువుగా నొక్కాడు. అలా ఒట్టేసిన ఆ బావతోనే ఆ వేసవిలోనే నా పెళ్లి అయింది. అప్పుడు తనకి పదిహేడు సంవత్సరాలు. నాకు పన్నెండేళ్లు.

ఇదంతా నలభై ఎనిమిదేళ్ల క్రితం మాట. బావ అలా అన్నాడే గానీ అతనితో అత్తవారింట్లో అడుగు పెట్టినప్పటి నుంచి నన్ను 'తీసేయడమే' అయింది. ఇంకా అర్థం కాలేదా? ప్రతీ దానికీ నన్ను లెక్కలోంచి తీసేయ్యడమే జరిగిందీ అంటున్నా.

ఈ మగవాళ్లంతా అంతే. పరమ అవకాశ వాదులు. వాళ్ల అచ్చట్లు, ముచ్చట్లు తీర్చుకోవడానికి ఎంతకైనా దిగజారతారు. అవసరమైతే కాళ్లు పట్టుకుంటారు. మా ఆడవాళ్లని గాడిదల్ని చేసి వాళ్లు వాసుదేవులవుతారు. ఆ విషయంలో బావ ఏమీ తీసిపోలేదు.

కొత్త కోడలిగా ఆ ఇంట్లో ఏ క్షణాన అడుగు పెట్టానో తెలీదు గానీ అప్పటినుంచి మొదలైంది నా జోడు గుర్రాల సవారీ జీవితం.

ఆ జోడు గుర్రాలూ ఎవరో కాదు...మా అత్తగారు...ఆవిడ అత్తగారు. నా మీద పెత్తనం చెయ్యాలని మా అత్తగారు, మా ఇద్దరి మీదే కాకుండా కొడుకు మీద, మనవడి మీద కూడా తన పెత్తనం చెల్లాలని పెద్దావిడ పట్టుదల.

ఒక్కగానొక్క కొడుకంటే గారం. పెద్ద మనవడంటే వంశాన్ని నిలబెట్టే వాడట. వాళ్లిద్దరూ అంటే అపురూపమే. అస్సలు వాళ్లిద్దరినీ ఆమె ఏమీ అనేవారు కాదు. ఎంత పెద్ద తప్పు చేసినా సరే. "వెర్రి వెధవా. ఇంటి యజమానివి నువ్వే తప్పు చేస్తే ఎలా చెప్పు. ఈసారి అలా జరగకుండా చూసుకో." అని తన కొడుకుని, అంటే... మా మావగారిని గారంగా మందలించినట్టే చెప్పేవారు. మనవడికైతే అడిగిందే తడవు - కొండమీద కోతిని తెచ్చి ఇచ్చేవారు. తరువాత నాకు మరిదీ, ఆడపడుచు ఉన్నారు. వాళ్లు ఏ తప్పు చేసినా మాత్రం చింత బరిగెతో రెండు దెబ్బలు వేసేవారు వాతలు తేలేలాగా.

"ఇద్దరమూ కోడళ్లమేగా. ఆవిడ మాట విన్నట్టు నటించి మన పని మనం కానివ్వడమే. అర్థమైందా." అన్నారు మా అత్తగారు నా తలమీద చిన్నగా మొట్టి. ఆ కొడుకుదీ తల్లి పోలికే అనుకున్నాను.

మా పెళ్లి అయ్యే నాటికి మా వారికి ఉద్యోగం లేదు. ఎస్.ఎస్.ఎల్.సి. పాసయ్యారు. మా మావగారికి ఒక్కత్తే చెల్లెలు. రాజమహేంద్రవరంలో ప్లీడర్ గారి భార్య ఆవిడ.

నేను కాపురానికి వచ్చానని తెలిసి చూడటానికి వచ్చి "మీ నాన్నకసలు బుద్ధి ఉందా? పట్టుమని వాడికి పదిహేడేళ్లు లేవు. ఉద్యోగం సద్యోగం చేస్తాడో లేదా తెలియదా? అలాంటి బొడ్డూడని వెధవకి ముక్కుపచ్చలారని బంగారం లాంటి పిల్లని ఇవ్వడానికి మీ నాన్నకి మనసెలా ఒప్పింది?" అని నాన్నని తిట్టేస్తోంటే...

భయపడుతూ అడిగాను. "మా నాన్న మీకు తెలుసాండీ?"

ఈవిడ కూడా నా తలమీద చిన్నగా మొట్టి పకపకా నవ్వేసింది. వీళ్లది మొట్టికాయల వంశమను కుంటా అనుకుని ఆమెనే చూస్తున్నంతలో ఆవిడ సిగ్గుపడుతూ అంది "మీ నాన్న.. నాకు వెంట్రుకవాసిలో తప్పిపోయిన సంబంధం. అలా జరిగితేనా...నువ్వు నా కడుపునే పుట్టి ఉండేదానివి. ఈసారి పుట్టింటికి వెళ్లినప్పుడు చెప్పు మా మావగారి చెల్లెలట. పేరు బాలాత్రిపురసుందరట. నిన్ను అడిగానని చెప్పమంది నాన్నా అని చెప్పు. ఇక్కడ నిన్ను చూస్తే అమాయకు రాలిలా ఉన్నావ్. మీ ఆయనేమో పెరటి చెట్టులాంటి వాడు. దేశంలో వాళ్లందరికీ పనిచేస్తాడు. పని చేసిపెడతాడు. ఇంటికి మాత్రం ఉపయోగపడడు. వాడిని లైన్‌లో నేను పెడతానుగా." అని నన్ను తీసుకువెళ్లి మావగారి ముందు నిలబెట్టారు.

ఆవిడా ఆయనా ఏం మాట్లాడుకున్నారో నాకైతే అర్థం కాలేదు. ఒక విషయం మాత్రం అర్థం అయింది. ఆవిడ బావకి



ఉద్యోగం వేయిస్తుందట. దానికి మూడువందల రూపాయలు లంచం ఇవ్వాలట. ఆవిడ ఆయన దగ్గర డబ్బులు తీసుకుని ఊరు వెళ్లిపోయాకా మా అత్తగారిని అడిగాను “లంచం” అంటే ఏమిటి అత్తయ్యా? అని.

“అదో బహుమతి లాంటిది. బహుమతి ఇస్తే మీ ఆయనకు ఉద్యోగం ఇస్తారు.” అంది గొంతు తగ్గించి.

“మీ అబ్బాయి రోజూ బయటకి వెళ్లేటప్పుడు ‘ముద్దు’ బహుమతిగా అడుగుతారు. వచ్చేటప్పుడు నాకు పూలు మర్చిపోకుండా తెస్తారు. అలానా?” ఆవిడ ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ నా తల మీద చిన్నగా మొట్టి వెళ్లిపోయారు.

రాత్రి ఆ మాట బావకి చెప్పాను. నేను చెప్పిన దాంట్లో ఏం తప్పుందో ఏమో బావ తల పట్టుకున్నాడు. “అయితే అమ్మకి నువ్వు నాకిచ్చే బహుమతి గురించి చెప్పేసావా?” అన్నాడు కోపంగా.

“ఆవిడ నవ్వి వెళ్లిపోయారు గానీ నాకు ఓ విషయం అర్థం కాలేదు బావా. నీకు ఉద్యోగం ఇచ్చే ఆయనకీ మీ అత్తయ్య ‘బహుమతి’ ఇస్తుందట.. యాక్... బయటవాళ్లకి అలా ఎలా ఇస్తారు బావా అసహ్యంగా?” అన్నాను. బావ పడీ పడీ నవ్వాడు.

“తింగరి బుచ్చీ. బయటవాళ్లకి బహుమతి ఇవ్వడం అంటే డబ్బులు ఇవ్వడం. మన బహుమతి కాదు.” అని నెత్తిన మొట్టబోయాడు. పారిపోయాను.

బావకి ఆవిడ పుణ్యమా అని ఉద్యోగం రాజమండ్రిలో వచ్చింది. అదీ పోస్టల్ డిపార్టుమెంటులో.

“సామాను కట్టిన గోనె సంచీ దగ్గరనుంచి సంచీలో వేసిన చెంచా వరకు మొత్తం ఏభై వస్తువులు. నీకు మొదటి జీతం వచ్చాకా నీ సామాను నువ్ కొనుక్కుని నా సామాను నాకు తెచ్చి ఇచ్చెయ్యి” అన్నారు మావగారు లిస్టు రాసి బావ చేతిలో పెడుతూ.

రాజమండ్రిలో మా కొత్త సంసారం మొదలైంది. అది జరిగిన ఏడాదికే మనవడి మీద బెంగతో మా మావగారి తల్లి కాలం చేసారు. మా సంసారం దిన దిన ప్రవర్ధమానంగా సాగింది. ముందు అబ్బాయి, అమ్మాయి.. తరువాత ఇద్దరు అబ్బాయిలు పుట్టారు. నా పిల్లలూ పెరిగి పెద్దవాళ్లయ్యారు.

ఇన్నేళ్ల సంసారంలో ప్రతీ చిన్న విషయంలోనూ బావదే పైచెయ్యి. ప్రతీ పనికీ నా సలహా అడిగేవాడు. కానీ తన నిర్ణయం ప్రకారమే చేసేవాడు. ఆ పని చేసేసాకా “ఇలా చేసానోయ్. ఏం చేసినా నీ కోసం, మన పిల్లల కోసమే. ఏమంటావ్?” అని అడిగేవాడు. “నీకు అన్నీ తెలుసు కదా బావా'' అని సంతృప్తితో సమాధానం చెప్పేసేదాన్ని.



ఎందుకంటే రేపు ఒక వేళ ఆ పని వల్ల నష్టం కలిగినా లాభం కలిగినా చూసుకునేది అతనే.

మా పెద్దాడు పదవతరగతిలో ఉండగా మా అత్తగారికి, మావగారికి ఏదో విషయంలో గొడవ వచ్చిందట. ‘ఇంట్లోంచి వెళ్లిపో. ఎక్కడకు పోతావో పో...’ అని ఆమెని ఆ వయసులో వీదిలో వాళ్లు అందరూ చూస్తుండగా గట్టిగా అరిచి బయటకు గెంటేసారట మా మావగారు.

ఆవిడ ఏడుస్తూ కూర్చోలేదు. ఎదురింటి వాళ్ల ఇంట్లో కూర్చుని ఆ ఇంటావిడచేత నాలుగు చీరలు, రైకలూ ఒక సంచీలో పెట్టి తెప్పించుకుని పుట్టింటికి వెళ్లడానికి దారి ఖర్చులు ఇస్తేగానీ పుట్టింటికి పోను అని భీష్మించుకు కూర్చుందట.

దాంతో ఆయన ఒక ఏభై రూపాయలు కూడా ఇచ్చాడట. ఆవిడ నేరుగా పోస్టాఫీసుకు వెళ్లి మా అబ్బాయి పేరు ఫలానా. వాడు రాజమండ్రి పెద్ద పోస్టాఫీసులో పనిచేస్తున్నాడని పోస్ట్-మాస్టర్ చేత ఫోన్ చేయించిందట.

కొడుకు ఫోన్ ఎత్తగానే...“ఒరేయ్ పెద్దోడా. మీ నాన్న ఈ వయసులో నన్ను ఇంట్లోంచి పొమ్మని గెంటేసార్రా. నీ దగ్గరే ఉంటాను. నేను ఇక్కడ పోస్టాఫీసులో ఉన్నాను. వచ్చి నన్ను వెంటనే మీ ఇంటికి తీసుకెళ్లు.” అని ఏడుస్తూ చెప్పిందట. ఆ పూట సెలవు పెట్టి ఆవిడను ఇంటికి తీసుకొచ్చాడు బావ.

ఆవిడ వస్తూనే నన్ను పిలిచి “ఒసేయ్ అమ్మాయి. ముసలమ్మగారు ఉన్నప్పుడు నేను నిన్ను ఎన్నోసార్లు ఆవిడ నుంచి కాపాడాను. దానికి కృతజ్ఞతగా నా గౌరవం నాకిచ్చి మర్యాదగా చూడాలమ్మాయ్. ఈ వయసులో మొగుడు వదిలేసాడు కదా మేమే దిక్కు అన్నట్టుగా చూస్తే మాత్రం ఒక్కక్షణం కూడా నీ ఇంట్లో ఉండను తెలిసిందా?” అని నాకు నియమం పెట్టి మరీ లోపలికి వచ్చారావిడ.

గడబద్దలా వచ్చి నున్నగా తయారైనా ఆమె బతుకు కూడా మొదటినుంచి ‘తీసిపడేయడమే’ అన్న రీతిగానే సాగింది. అందులో నన్ను నాకే బాధ కలిగినా వాళ్ల అత్తగారినుంచి నన్ను కన్నబిడ్డలా సాకింది. ఎన్నో సందర్భాలలో నా తప్పు తన మీద వేసుకుని నన్ను కాపాడింది. ఆ కృతజ్ఞత నా నరనరానా ఉండడంతో ఆమెను ఆ ఆరునెలలూ తల్లిలా సాకాను. ఆరునెలల తరువాత జీవితంలో మొదటిసారి మా మావగారు తన పెళ్లాన్ని తీసుకు వెళ్లడానికి మా ఇంటికి వచ్చారు.

"నేనేదో కేకలేసాననుకో. తను ఇక్కడికి వచ్చేస్తానంటే వాడు తీసుకోచ్చేయడం, నువ్వు మీఇంట్లో ఉంచేసుకోవడం బాగుందమ్మా. చాలా బాగుంది. దానికెల్లాగూ బుద్ధి లేదు. మీరైనా నచ్చచెప్పి కాపురానికి పంపించేయవచ్చు కదా." అన్న మావగారి మాటలకి బలవంతానా నవ్వు అమ్ముకున్నాం నేను, మా వారు. ఆమె చిలకలా కులుకుతూ భర్తవెంట తిరిగి వెళ్లింది.

పెళ్ళైన నెలకే అర్ధమైంది. 'బావ నా కన్నా చదువుకున్నాడు. బయట తిరుగుతాడు. ప్రపంచ జ్ఞానాన్ని సంపాదించాడు. సంసారం కోసం కష్టపడుతున్నాడు. ఏనాడూ...నా మాట ప్రకారమే జరగాలి అని నేను అనుకోలేదు. పిల్లలకి ఎవరిదో ఒక భయం ఉండాలి. అందుకే వాళ్లు ఏమి అడిగినా 'నాన్నగారిని అడగండి' అని చెప్పేసేదాన్ని. ఆవిధంగా వాళ్లల్లో బావ అంటే పైకి భయంతో కూడిన గౌరవం, భక్తితో నిండిన ప్రేమ అంతర్లీనంగా ఉండేవి. ఆ భయంతోనే అందరూ కష్టపడి చదువుకుని బావ చేసిన దిశానిర్దేశం వల్ల వాళ్లు అనుకున్న ఉద్యోగాలలో స్థిరపడ్డారు.

ఇప్పుడు పిల్లలందరికీ పెళ్లిళ్లు అయ్యి, ఎవరి సంసారాలు వారు ఆనందంగా చేసుకుంటూ వాళ్లకూ కుటుంబాలు ఏర్పడ్డాకా ఏ విషయంలోనైనా బావ నన్ను తీసిపడేస్తుంటే "అదేంటి నాన్నగారు? అమ్మకీ కొన్ని ఇష్టాలు ఉంటాయిగా. ఈ వయసులోనైనా ఆమెని అడిగి వాటిని తీర్చకపోవడం మాకైతే చాలా బాధగా ఉందండీ..." అని పిల్లలు అనడంతో బావ ఇప్పుడు చేస్తున్న ప్రతి పనికీ నన్ను కూడిక చేస్తున్నాడు. నాకు ఇప్పుడు కొద్ది విలువ పెరిగింది అందరిలో.

పిల్లలందరూ కలిసి ఆయన షష్టిపూర్తిని అయిదేళ్ల క్రితం రంగ రంగ వైభవంగా చేసారు.

**"ఒరేయ్. శతకం అంటే ఏమిట్రా? ఎక్కం అంటే ఏంటి? బరి అంటే ఏమిటి నాన్నమ్మా?" ముందుగా ఒకళ్లకు ఒకళ్లు నెమ్మదిగా అడుగుకుని, తమకు తెలియవని ఒక నిర్ణయానికి వచ్చి "ఊహూ. మాకు తెలీవు నాన్నమ్మా. అసలా వర్డ్స్ మేము వినలేదు." అన్నారు కలిసి కట్టుగా.**

మళ్లీ ఇన్నాళ్లకి కూడబలుక్కున్నట్టు కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు, అల్లుళ్లు, మనవలు అందరూ ఒక్కసారిగా ఎందుకు వచ్చారో నాకు అర్థం కాలేదు. అయినా వాళ్ల నాన్నగారితో వాళ్లకేం పనులున్నాయో ఏమిటో అనుకుని సరిపెట్టేసుకున్నాను. కానీ వాళ్ల వచ్చినప్పటినుంచి బావలో కూడా చాలా మార్పు వచ్చింది. "ఏ పనికైనా మీ అమ్మని అడిగి తన ఇష్టప్రకారం చెయ్యండి. ఇందులో నా ప్రమేయం లేదు". అన్నాడు బావ.

నేను వింతగా తనకేసి చూసాను. "అన్నీ నీకే అర్థం అవుతాయి లేవోయ్." అని నా అందగాడు నవ్వేసాడు. పిల్లలు అస్తమానూ బజార్లకి వెళ్లడం, రావడం...ఏ ఏ వస్తువులు ఎంతెంత అవసరమో... అన్నీ నన్ను అడగడం... ప్రతీదీ నాకు నచ్చినట్టుగానే జరగడం నాకు ఆశ్చర్యాన్ని కలగచేసింది.

ఒకరోజు మధ్యాహ్నం అప్పుడే భోజనం చేసి నడుం వాల్చేసరికి మనవలందరూ వచ్చి నా పందిరి మంచం చుట్టూ చేరారు.

"నాన్నమ్మా. నీ హాపీ బర్త్ డే అంట కదా?" అడిగింది రెండో అమ్మాయి కూతురు.

"ఎప్పుడో నీకు డేట్ తెలుసా?" అడిగాడు పెద్ద మనవడు.

"నాన్నమ్మకు తెలీదురా, నాన్నమ్మ చదువుకోలే దంట?" అన్నాడు చిన్న మనవడు.

"నేను చదువుకోపోవడం ఏమిట్రా? అయిదవ క్లాస్ చదువుకున్నాను."

పిల్లలందరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకుని నోటికి చేతులు అడ్డు పెట్టుకుని చిలకల్లా నవ్వేసారు. నాకు ఆనందంతో పాటు ఉక్రోషం కూడా వచ్చింది.

"నాకు అయిదు రకాల శతకాలు, రామాయణం, భారతం, భాగవత కథలు, భగవద్గీతా శ్లోకాలు అన్నీ వచ్చు. ఇరవై ఇరవైల వరకు ఎక్కాలు వచ్చు. సంగీతంలో వర్ణాలు, కొన్ని కృతులు వచ్చు. ఇంగ్లీష్‌లో నాలుగు బరులూ వచ్చు. మీకేమనా వచ్చా?" అడిగాను వాళ్ల మొహాలలోకి చూస్తూ.

"ఒరేయ్. శతకం అంటే ఏమిట్రా? ఎక్కం అంటే ఏంటి? బరి అంటే ఏమిటి నాన్నమ్మా?" ముందుగా ఒకళ్లకు ఒకళ్లు నెమ్మదిగా అడుగుకుని, తమకు తెలియవని ఒక నిర్ణయానికి వచ్చి "ఊహూ. మాకు తెలీవు నాన్నమ్మా. అసలా వర్డ్స్ మేము వినలేదు." అన్నారు కలిసి కట్టుగా.

నాకు తోచిన పరిజ్ఞానంలో ప్రతి ఒక్కదాని గురించి విడమర్చి వివరించి ఉదాహరణలతో సహా చెప్పాను. "ఒరేయ్. నాన్నమ్మ పైకి అమాయకురాలిలా కనిపిస్తుంది గాని పెద్ద ఎన్‌సైక్లోపీడియా రా... ఆటలాడుకుని రెస్ట్ తీసుకునే సమయంలో బామ్మా దగ్గర కూర్చుంటే మనకు తెలియని విషయాలు బోలెడు నేర్చుకోవచ్చు. సరేనా?" అడిగింది అందరికన్నా పెద్ద మనవరాలు. "సరే" అన్నారు అందరూ ఏకకంఠంతో...

"అయితే అందరూ రెడీయే కదా? ఆటలాడుకుని మళ్లీ వద్దాం పదండి." అని అందరూ వెళ్లిపోయారు, చిలుకలన్నీ ఒక్కసారి ఎగిరిపోయినట్టు.

మరునాటినుంచే ఇంటికి బంధువులందరూ రావడం మొదలెట్టారు. నా అక్కలు చెల్లెళ్లు తమ్ముళ్లు పెత్తల్లి బిడ్డలు...పిల్లలతో పెద్దలతో ఇల్లంతా పక్షులన్నీ వాలే చెట్టులా అయిపోయింది.

"ఎంత అదృష్టవంతురాలవే...కొడుకులు, కూతుళ్లు మనవలు.. ఇందరి సమక్షంలో స్నేహితులు బంధుమిత్రులూ అందరూ కలిసి షష్టిపూర్తి చేస్తున్నా నిన్ను చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది. ఆడదా నిగా పుట్టినందుకు ఇంతకన్నా అతి పెద్ద పండగ స్త్రీ జీవితంలో ఏం ఉంటుంది చెప్పు?" అని నా స్నేహితురాళ్లు నా బుగ్గలు చిదిమి ముద్దాడుతూ ఉంటే అప్పుడు తెలిసింది వీళ్లంతా ఎందుకొచ్చారో.

నిజానికి మనిషి ఆయుర్దాయం 120 సంవత్స రాలట. అరవై సంవత్సరాలు పూర్తి అయ్యేసరికి ఒక ఆవృతం పూర్తి అవుతుందట. అప్పుడు ఉగ్రరథుడు అనే ఆయన మన శరీరంలో ప్రవేశిస్తాడట. ఆయన్ని శాంతింపచేయడం కోసం కలశస్థాపనతో మొదలెట్టి... రెండో రోజు ఉగ్రరథ శాంతి చేసి, మూడవరోజు అవభృథ స్నానం... అబ్బా... మూడురోజులు మాయాబజారు సినిమాలా గడిచిపోయి జన్మధన్యమై నట్టు అనిపించి అపురూప జ్ఞాపకంగా మిగిలి పోయింది నాకు.

మూడవరోజు రాత్రి బావను, నన్ను మొదటి రాత్రి గదిలోకి పంపినట్లు పంపారు.

బావ నన్ను దగ్గరకు తీసుకుంటూ "ఇక నుంచి నాకు నువ్వెప్పుడూ కూడికవే. నువ్వే నాకు తోడూ నీడ. నేను నీకు అండదండ." అంటూ తన కౌగిలిలోకి పొదువుకుంటుంటే కళ్లు మూసుకుంటూ అతనిలో ఒదిగిపోయాను. ★



# పందికొక్కు వ్యూహం



శాంతి షరతులను అతిక్రమించడం, పరోక్ష యుద్ధం, దొంగ నోట్లు వెదజల్లి భారత ఆర్థిక పరిస్థితిని ఛిన్నాభిన్నం చేయాలని చూడడం పాకిస్తాన్ ప్రదర్శించిన విద్యలలో కొన్ని. తాజాగా సొరంగ మార్గం ద్వారా భారత్‌లోకి ఉగ్రవాదులను, అందులోను హమాస్ వంటి తీవ్రవాద సంస్థ సభ్యులను పంపడానికి ప్రయత్నించిన సంగతి బయటపడింది. ఇలాంటి ఒక సొరంగ మార్గాన్ని జమ్ముకశ్మీర్‌లోని సాంబ సెక్టర్‌లో సరిహద్దు భద్రతాదళం కనుగొన్నది. అంతర్జాతీయ సరిహద్దు వద్ద భారత భూభాగంలో ఇది కనిపించింది.

భారత భూభాగంలో ఇది 50 మీటర్ల వరకు ఉంది. ఇది ఎక్కడ నుంచి మొదలయిందో, ఏ దిశగా సాగిందో తెలుసుకునేందుకు దర్యాప్తు మొదలు కానుంది. పాలస్తీనా సున్నీ తెగ ముస్లిం ఛాందసవాద ఉగ్రవాదులను ఈ సొరంగం ద్వారా భారత్‌లోకి ప్రవేశపెట్టడమే పాకిస్తాన్ ధ్యేయమై ఉండాలని అనుమానిస్తున్నారు. సొరంగ ప్రవేశం దగ్గర కొన్ని ఇసుక సంచులు కనుగొన్నారు. వాటి మీద కరాచీ, షకార్‌గఢ్ పేర్లు ఉన్నాయి. ఆ సంచులు ఎప్పుడు తయారయ్యాయో, ఎప్పుడు కాలదోషం పడతాయో కూడా వాటి మీద ఉంది. ఈ సంచులను సొరంగ ప్రవేశం కనిపించకుండా కప్పడానికి ఉపయోగించారు. ఇలాంటివి పది సంచులు. అక్కడి ఒక రైతు పొలంలో ఇది ఉంది. నిజానికి ఇక్కడికి సమీపంలోని పాకిస్తాన్ సరిహద్దు గురించి చెప్పాలంటే కేవలం నాలుగు వందల మీటర్లలోనే ఉంది.

ఇలాంటి సొరంగ మార్గాలు ఇంకా ఏమైనా ఉన్నాయేమోనన్న అనుమానంతో సరిహద్దు భద్రతా దళాలు పెద్ద ఎత్తున గాలింపు చేపట్టాయి. అయితే ఇలా సొరంగ మార్గాల ద్వారా దేశంలోకి ఉగ్రవాదులను పంపే ప్రయత్నం అటు నుంచి కొత్తేమీ కాదని చెబుతున్నారు. ఇక్కడ హమాస్ ముస్లిం ఉగ్రవాదులను భారత్‌లోకి పంపించాలని పాక్ కుట్ర పన్నుతున్నదని అనుమానించడానికి కొన్ని కారణాలు ఉన్నాయి. పాలస్తీనాకు చెందిన హమాస్ తన సభ్యులను ఇజ్రాయెల్‌లో ప్రవేశపెట్టడానికి ఇలాంటి విధానమే అవలంబిస్తుంది. ఇంకా చెప్పాలంటే ఇలాంటి సొరంగ మార్గాల గురించి గడచిన సంవత్సరం సెప్టెంబర్ మాసం నుంచే సరిహద్దు భద్రతా దళానికి అనుమానాలు వచ్చాయి. అప్పటి నుంచే వెతుకుతున్నారు కూడా.

భూమిలోకి చొచ్చుకుపోయి ఇలాంటి సొరంగాలను కనుగొనే రాడార్లను కూడా ఉపయోగిస్తున్నారు. గతంలో హీరానగర్, సాంబ, ఆర్‌ఎస్ పుర, పుల్వామా, మున్వర్ తావి అనే ప్రాంతాలలో ఇలాంటి సొరంగాలను కనుగొన్నారు. దీనిని పందికొక్కు బుద్ధి లేదా పందికొక్కు వ్యూహం అనవచ్చునేమో! ★

# సాధువుల దాడి వెనుక లెఫ్ట్, మిషనరీలు

పాల్ఘర్‌లో జరిగిన ఇద్దరు సాధువుల హత్య అనుకోకుండా జరిగిన సంఘటన కాదని విశ్రాంత న్యాయమూర్తి అంబాదాస్ జోషి అభిప్రాయానికి వచ్చారు. ఇదంతా వామపక్ష సంస్థల అధీనంలోని ప్రభుత్వేతర సంస్థలు ప్రోద్బలంతోనే జరిగిందని, అందుకు పోలీసుల నిష్క్రియాత్వం కూడా తోడైందని ఆయన నాయకత్వంలో తయారయిన నిజ నిర్ధారణ సంఘం నివేదికలో పేర్కొన్నారు. వామపక్ష, క్రైస్తవ ప్రభుత్వేతర సంస్థలు అనుసరిస్తున్న వైఖరి, రెచ్చగొట్టే ధోరణితోనే కొందరు గిరిజనులు అలాంటి దుశ్చర్యకు పాల్పడ్డారని ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ ప్రభుత్వేతర సంస్థ వివేక్ విచార్ మంచ్ తన నిజనిర్ధారణ నివేదికలో ఆరోపించింది. ఈ నిజనిర్ధారణ సంఘానికి జోషి నాయకుడు. ఈ ఏప్రిల్ 14న మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో ఈ ఘోరం జరిగిన సంగతి తెలిసినదే. పిల్లల దొంగలన్న అనుమానంతోనే వారి మీద దాడి చేశామని తరువాత నిందితులు సంజాయిషీ ఇచ్చుకున్నారు.



నిజనిర్ధారణ సంఘం నివేదికను విలేకరులకు వివరిస్తున్న వివేక్ విచార్ మంచ్ సభ్యులు. పక్కన హత్యకు గురైన సాధువులు

ఇందులో ఎలాంటి నిజం లేదని, ఇది పథకం ప్రకారం జరిగిన దాడి అని వివేక్ విచార్ మంచ్ నివేదిక చెబుతున్నది. అది హఠాత్తుగా జరిగిన దుర్ఘటన అయితే నాలుగు వందల మంది ఎలా గుమిగూడారని ఆ నివేదికలో ప్రశ్నించారు. ఈ ఊచకోతకు సంబంధించి ఇంతవరకు 115 మందిని అరెస్టు చేశారు. పోలీసులు సాధువులను రక్షించడానికి ప్రయత్నించినా, మూకలు సాధువులను లాక్కు వెళ్లాయని నివేదిక అభిప్రాయపడింది. ఈ నిజ నిర్ధారణ నివేదికను ఇటీవల జోషి విలేకరుల సమావేశంలో విడుదల చేశారు. ఆదివాసీ ఏక్తా పరిషత్ అక్కడి గిరిజన ప్రాంతాలలో వేర్పాటు వాదాన్ని ప్రచారం చేస్తున్నదని కూడా నివేదికలో ఆరోపించారు. ఇలాంటి ఆదివాసీ బృందాలకు క్రైస్తవ సంఘాలు నిధులు ఇస్తున్నాయని ఆరోపించింది. ఇంతక్రితం సీఐడీ నాలుగు నెలలు దర్యాప్తు చేసి 126 మంది మీద చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ కేసును ఎన్‌ఐఏ, సీబీఐలు దర్యాప్తు చేయాలని మంచ్ కోరుతోంది. ★

# బ్రష్ కింద బ్రహ్మాండం


FIRST CUT BY MANJUL
©MANJUL FirstPost.com




నీకు చీర బాగానే
అమరింది మమ్మా...
నేనే బూట్లు వేసుకోవడానికి
ఇంకా చిన్నగానే ఉన్నాను


IND SAMACHAR
మేం అసలు జైళ్లకే
భయపడలేదు. ఈ వకీలతో
మమ్మల్ని భయపెట్టగలవని
నువ్వు అనుకుంటున్నావా?
@akshaychanders


SATISH ACHARYA
ఈ వేయి మంది
నా గురించి అసత్యాలు
ప్రచారం చేస్తున్నారు...




రిసార్ట్
మన ఎంఎల్ఏలని ఎవరు
లాక్కుపోతారో ఇప్పుడు
లాక్కుపొమ్మనండి!
SATISH ACHARYA










# గులాం నబీ శాపం

శతాధిక సంవత్సరాల కాంగ్రెస్ పార్టీకి చీలిపోవడం అంటే ఓ లెక్క కాదు. ఇది రాహుల్ గాంధీజీకి బాగా తెలిసినట్టే ఉంది. ఆ జ్ఞానంతో పాటు మరొక విద్యలో కూడా వారికి లోతుపాతులు బాగా తెలుసునని అనిపిస్తుంది. సమస్యని పరిష్కరించడం కాకుండా, దానికి ఇంకాస్త ఆజ్యం పోయడంలో ఆయనకి తగినంత నేర్పు కూడా ఉంది. ఆగస్టు 24 నాటి సీడబ్ల్యుసీ సమావేశం, అందులో ఉరుములు మెరుపులు భారత జాతి దృష్టిని కాస్త ఆకర్షించాయి. అదే సమయంలో యువరాజుగారి ఈ ప్రత్యేక నైపుణ్యాలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఆరోజు ఏవో మాటలు చెప్పేసి మొత్తానికి శుభం కార్డు పడింది అంటూ వాళ్లే చెప్పుకుని బయటపడ్డారు. చూడబోతే కాంగ్రెస్‌లో 'గ్రూప్ 23' పేరుతో ఒక కుంపటి రాజుకుంటున్న సూచనలు బలంగానే కనిపిస్తున్నాయి. ఈ గ్రూప్ ఏదీ అంటే అధిష్టానానికి, అంటే సోనియాయే లెండి, రాసిన లేఖలో సంతకాలు పెట్టిన 23 మంది. అదే కనుక ఊపందుకుంటే ఆ కీర్తి యావత్తు రాహుల్‌దే సుమా! సీడబ్ల్యుసీ వేదిక మీద గట్టి పాత్రను దక్కించుకున్నవారు గులాం నబీ ఆజాద్. పార్టీలో సంస్థాగత ఎన్నికలు జరపాలన్న తన నినాదాన్ని ఆయన వదిలిపెట్టలేదు. మీరు పార్టీకి అధ్యక్షుడిని నియమిస్తే ఆయనకి ఒక్క శాతం మంది నుంచి కూడా మద్దతు ఉండదు. పార్టీ ఇంకో యాభయ్ ఏళ్లు ప్రతిపక్షంలో కూర్చోవాలి అంటూ ఆజాద్ భయపెడుతున్నారు కాంగ్రెస్‌ని. ఆగస్టు 24 నాటి 'టీ కప్పులో తుపాను'లో ఆజాద్ గారి దృఢ వైఖరి కొట్టుకుపోలేదన్నమాటే. సీడబ్ల్యుసీకీ, జిల్లా, రాష్ట్ర అధ్యక్ష పదవులకీ, ఏఐసీసీ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరపాల్సిందేనని అంటున్నారాయన. పార్టీలో సంస్థాగత ఎన్నికలను వ్యతిరేకిస్తున్నవారు ఎవరూ అంటే, ఓడిపోతామన్న భయంతో వణికిపోతున్న పిరికిపందలే అని తేల్చి చెప్పారు కూడా. మీరు ఎన్నికలు జరిపితే 51 శాతం జనం మన వెంటే ఉంటారు. సెల్ ఫోన్లలోను, సీల్డ్ కవర్లలోను నాయకులను బట్వాడా చేసుకుంటూ పోతే రెండు శాతమో, మహా అయితే మూడు శాతమో మిగులుతారు అంటూ ఆజాద్ జడిపిస్తున్నారు. ఎన్నికలను వ్యతిరేకిస్తున్నవారికే బయట విధేయులన్న పేరు ఉంటుందిగానీ, వీళ్లు నేలబారు రాజకీయాలు చేయడానికి తప్ప ఎందుకూ పనికి రారని కూడా చెప్పేశారు ఆజాద్. మీరు కాంగ్రెస్‌ను మరొక యాభయ్ ఏళ్ల పాటు ప్రతిపక్షంలోనే కూర్చోబెట్టి ఉంచాలని కంకణం కట్టుకుంటే ఇక పార్టీకి ఎన్నికలు జరిపే అవసరమే ఉండదు అంటూ ఆజాద్ బీజేపీకి గొప్ప భరోసా కల్పించారు. యాభయ్ ఏళ్లు, కాకపోతే మరొక పాతికేళ్లు కలుపుకుని డెబ్బయ్ ఐదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉండిపోతేనే, గాంధీ–నెహ్రూ కుటుంబ గాఢ పరిష్వంగంలోనే కాంగ్రెస్ భద్రంగా ఉంటుందని రాహుల్, సోనియా, ప్రియాంకాల నిశ్చితాభిప్రాయం కదా!

సీడబ్ల్యుసీ వేదిక మీద పోషించినది మూగ పాత్రే అయినా, తెర వెనుక ఎక్కువ మాటలు కూర్చిన ఘనత శశిథరూర్ దేనని తెలిసిపోయింది. శశి వ్యవహారం మీద కేరళ కాంగ్రెస్‌లో రెండు శిబిరాలు ఏర్పడినట్టు కనిపిస్తోంది. అంటే 'గ్రూప్ 23'ది ఢిల్లీ పెద్దలు అనుకుంటున్నట్టు అంత పీల గొంతేమీ కాదన్నమాట. లేఖ మీద శశిథరూర్ సంతకం చేసినందుకు మొదట ఆ రాష్ట్ర నాయకులు నిప్పులు చెరిగారు. రాష్ట్ర అధ్యక్షుడు ముల్లపల్లి రామచంద్రన్, లోక్‌సభలో కాంగ్రెస్ చీఫ్ విప్ కొడుక్కునిల్ సురేశ్, ఆ లేఖ రాయడం మహాపరాధం, తక్షణం చెంపలు వేసుకొమ్మని ఫత్వా జారీ చేశారు. వీరిలో సురేశ్, శశిథరూర్‌ని 'అతిథి నటుడు'గా జమకట్టాడు. ఆయనకి అంతర్జాతీయ కీర్తి ఉంటే ఉండొచ్చు. కానీ పార్టీలో కార్యకర్తే అంటున్నారు ఇంకొందరు. అయితే మన శత్రువు థరూర్ కాదు, సీపీఎం, బీజేపీలు, ఇది గుర్తుంచుకోండి అంటూ రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వీడి సతీశన్, ఇంకొందరు చురక వేశారు.

లేఖాస్త్రం మీద సంతకం చేసిన వారిలో ఒకడు, సుప్రీంకోర్టు లాయరు కపిల్ సిబల్ మొదట ట్వీట్ (కాంగ్రెస్‌లోని బీజేపీ తైనాతీ అని రాహుల్ చేసిన విమర్శకు ఖిన్నుడై పెట్టినది) చెరిపేశారు గానీ, మడమ తిప్పినట్టు లేదు. రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నదంటూ మనం బీజేపీని దుమ్మెత్తి పోస్తాం కదా; మరి కనీసం మన పార్టీకి రాజ్యాంగం వంటి నిబంధనావళిని గౌరవించవద్దా యువరానర్ అన్నారు సిబాల్. నిజమే కదా! ఈయన తనని బీజేపీ వేగు అంటూ రాహుల్ నోరు పారేసుకున్నందుకు మొదట అలిగారు. బాగా క్రమశిక్షణ కలిగిన నేత కాబట్టి తరువాత సర్దుకున్నారు.

సరే, ఆజాద్ కోరినట్టు కొత్త గాంధీలు పార్టీలో సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తారా? లేకపోతే ఆజాద్ గారి శాపం మేరకు యాభయ్ ఏళ్లు విపక్షంలోనే పార్టీని నిలవ ఉంచేస్తారా? వేచి చూడాలి. ఆ అవకాశం ఈ తరానికి లేదు లెండి. రేపటి తరం వారికే ఆ చాన్స్. ★

గణపతి నవరాత్రి ఉత్సవాలపై ఆంక్షలు విధిస్తూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న హిందూ వ్యతిరేక విధానాలకు నిరసనగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అన్ని జిల్లా, మండల కేంద్రాలు ముఖ్య కూడళ్లవద్ద వివిధ హిందూ ధార్మిక సంస్థల నేతలు, వినాయక మండపాల నిర్వాహకులు, ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థలు, బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ముఖానికి నల్లటి మాస్కులు ధరించి, ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు.

# వీహెచ్‌పీ, గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ప్రజల నుండి అనూహ్య స్పందన లభించింది. మండపాల నిర్వాహకులు స్వచ్ఛందంగా పాల్గొని, గణేశ్ ఉత్సవ సమితి, విశ్వహిందూ పరిషత్ నేతలకు మద్దతు తెలిపారు. గోల్కొండ, చార్మినార్, యాకుత్‌పురా, గౌలిపురా, మహేశ్వరం, దిల్‌సుఖ్‌నగర్, బర్కత్‌పురా, ఎల్‌బీనగర్, సైదాబాద్ కూకట్‌పల్లి వై-జంక్షన్, ఉప్పల్ కమాన్ తదితర ముఖ్యమైన ప్రాంతాల్లో 258 చోట్ల నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. మహిళలు, పురుషులు వేలాదిగా తరలివచ్చి ఉత్సవ సమితికి సంఘీభావం ప్రకటించారు. నగరంలోనే ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఖైరతాబాద్ వినాయక మండపం వద్ద జరిగిన కార్యక్రమంలో గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షులు జి.రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి భగవంతరావు, రావినూతల శశిధర్‌తో పాటు మండప నిర్వాహకులు సుదర్శన్, బీజేపీ నాయకులు చర్మనీ రూప్‌రాజ్, ఆలే జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

**పాలమూర్ జిల్లా :** విశ్వహిందూ పరిషత్, గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాల మూర్ నగరంలో, జిల్లాలోని


పాలమూర్


మెదక్





వరంగల్


ఖమ్మం


సూర్యాపేట







పలు చోట్ల నిరసన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

**మెదక్ జిల్లా :** విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో చమన్ హనుమాన్ (మెదక్) దేవాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, జిల్లా సంఘటన కార్యదర్శి పుట్టి మల్లేశం, జిల్లా నాయకులు చిన్న రామచంద్రన్ సత్యనారాయణ తదితరులతో పాటు బజరంగ్ దళ్, హిందూ సంస్థల కార్యకర్తలు పాల్గొన్నారు.

**నిజామాబాద్ జిల్లా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గణేష్ మండపాల నిర్వాహకులపై వేధింపులు ఆపాలని ఇందూరు నగరంలో వివిధ గ్రామాల్లో హిందువాహిని నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరిపారు.

**కరీంనగర్ జిల్లా :** వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ ఆంక్షలను నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్ ఇచ్చిన పిలుపు మేరకు కరీంనగర్ నగరం, సిరిసిల్ల పట్టణంలో హిందూ ధార్మికసంస్థల ప్రతినిధులు పలుచోట్ల నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధానంగా కరీంనగర్‌లోని టవర్ సర్కిల్‌లో (క్లాక్ టవర్ ఎదురుగా) జరిగిన కార్యక్రమంలో డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, పాక సత్యనారాయణ, కోమండ్ల రాజేంద్రరెడ్డి, విశ్వహిందూ పరిషత్ నేతలు, బీజేపీ జిల్లా అధ్యక్షులు భాస సత్యనారాయణ, బేతి మహేందర్ రెడ్డి, మురళీధర్, తదితరులతో పాటు అనేకమంది కార్యకర్తలు పాల్గొన్నారు. నగరంలో అంబేద్కర్ చౌక్ కోర్టు వద్ద, సీతారాంపూర్ కాలనీ, ఆరెపెల్లి ఇంకా అనేక చోట్ల హిందూ పండగలపైన ప్రభుత్వ ఆంక్షలు వద్దు. వినాయక ఉత్సవాలకు ఆంక్షలు వద్దు. ఆంక్షల నెపంతో హిందువుల మనోభావాలను దెబ్బతీయవద్దు అనే ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు.

**వరంగల్ జిల్లా :** గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ఆటంకాలు కలిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం చూపుతున్న మొండి వైఖరికి నిరసనగా విశ్వహిందూ పరిషత్ పిలుపుమేరకు వరంగల్ అర్బన్ జిల్లా 26వ డివిజన్‌లో పాపయ్యపేట సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ హిందూ సంస్థల పెద్దలు, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు రత్నం సతీష్ సా, వీరలింగం, సుమన్ ఖత్రీ, 26వ డివిజన్ అధ్యక్షులు నందకిషోర్ సా, కొనేరి విజయ్‌కుమార్, మామిడి గోపాల్, జ్యోతి కిషోర్, నరేష్, చవాన్, ప్రవీణ్, విజయ్, లక్ష్మణ్‌రావు, సృజన్, అరవింద్, బలరాం, వీరప్రసాద్, బచ్చు వాలా, రమేష్, సత్యనారాయణ తదితరులతో పాటు వినాయకమండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

**ఖమ్మం జిల్లా :** గణేశ్ నవరాత్రి ఉత్సవాలను అనుమతించకుండా నిషేధించి కేసీఆర్ ప్రభుత్వం నిరంకుశ ధోరణి ప్రదర్శించిందంటూ ఖమ్మం, పాల్వంచలోని గణేశ్ మంటపాల నిర్వాహకులు, హిందూ ధార్మిక సంస్థల నాయకులు నల్లటి మాస్కులు ధరించి, ప్లకార్డులు చేతబూని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు చిలుకూరు నాగేశ్వరరావు, గడిదేశి వెంకటేశ్వర్లు, లక్ష్మీ, సరోజిని, తోట లక్ష్మీ, గంగాధర సీత, సానబోయిన వెంకట్ బీజేపీ నాయకులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్, గంధ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**నల్గొండ జిల్లా :** విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘచాలక్ గార్లపాటి వెంకటయ్య, విభాగ్ కార్యవాహ నన్నూరి రాంరెడ్డి , వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు కర్నాటి యాదగిరి తదితరులు పాల్గొన్నారు. నగరంలో 32 చోట్ల జరిగిన కార్యక్రమాల్లో 3 వేల మంది పాల్గొన్నారు.

**సూర్యాపేట :** విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఐదుచోట్ల నిరసన కార్యక్రమాలు జరిగాయి. హిందూధార్మిక సంస్థల నుండి వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

**భువనగిరి :** విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో జిల్లా సంఘచాలక్ బాదం ప్రకాష్, విభాగ్ సహ కార్యవాహ గుండ్ల నాగరాజు, వీహెచ్‌పీ విభాగ్ సహ కార్యదర్శి తోట భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని 52 చోట్ల జరిగిన కార్యక్రమాల్లో వందలాది మంది పాల్గొన్నారు.

**తాండూరు :** వినాయక ఉత్సవాలపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శనలో తెలంగాణ ఆర్ఎస్ఎస్ సహప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్, విభాగ్ ప్రచారక్ శివశంకర్, విభాగ్ సహ కార్యవాహ యాదగిరి, జిల్లా కార్యవాహ అనంతరెడ్డి, రమేష్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ★



# తెలుసుకోండి

మీనాక్షి శ్రీనివాస్

ఆ రోజు బక్రీదు సెలవు. ఆయనా, పిల్లలూ అంతా కూర్చుని టీవీలో వచ్చే అన్ని ప్రోగ్రామ్స్ ఒక్కటీ వదలకుండా చూస్తున్నారు. అవి పనికొస్తాయా! రావా! పక్కనపెడితే ఎదిగే వయసులో పిల్లల మీద ఎలాంటి ప్రభావం చూపుతాయో అనే నా దిగులు. ఆయనతో ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పటించుకోరు, పైగా చూసినంత మాత్రాన ఏం చెడిపోరు, చెడు అనేది మన వంశంలో లేదు, రక్తంలో లేదు అంటూ నాకు పెద్దపెద్ద ఉపన్యాసాలు.

'తొమ్మిది, పదీ తరగతులు చదువుతున్న నా కొడుకులేం అమాయకులూ కాదు, ఇప్పుడు అందుబాటులోకొస్తున్న విజ్ఞానం తక్కువా లేదు, ఇప్పుడు ఇంటిల్లిపాదీ కలిసి చూసే ప్రోగ్రామ్స్ అయినా, సినిమాలైనా వేళ్ల మీద లెక్కపెట్టచ్చు. వాళ్లని అలాంటి పరిస్థితుల్లోకీ, ప్రమాదాల్లోకి నెట్టి, దేవుడా నీదే భారం అనడం ఎంతవరకూ సమంజసం? 'వంటింట్లో వంట చేస్తున్నానే కానీ నా ఆలోచనలన్నీ వాళ్ల చుట్టే తిరుగుతున్నాయి.

కాలింగ్ బెల్ మోగింది. వాళ్ల ఆనందంలో వాళ్లున్నారు.. హాలులో ఉన్న వాళ్ల కంటే వంటింట్లో ఉన్న నాకే ముందు వినబడింది.

"హర్షా చూడు, ఎవరో వచ్చారు" చేతిలో పని వదిలి వెళ్లలేక అరిచాను. ఊహూ వినబడితేనా, కోపం ముంచుకొచ్చింది, చరచరా వెళ్లి టీవీ కట్టేసాను.

"వెళ్లి తలుపు తియ్యండి ఎవరో ఇందాకటినుంచీ పిలుస్తున్నారు" కోపంగా చెప్పి మళ్లీ వంటింట్లోకెళ్లి పోయాను.

"రాక్షసి, ఆ పనేదో నువ్వే చెయ్యచ్చుగా! నువ్వు చూడకుండా మేం చూసి ఆనందిస్తున్నామని కుళ్లు కాకపోతే" ఓ పక్క నన్ను సాధిస్తూనే "నాన్నా .. ఆ తలుపు తీయమ్మా, ఎవరొచ్చారో" పడక కుర్చీలో సాగిలపడి ఒళ్లు విరుచుకుంటూ అన్నారాయన.

వెళ్లి తలుపు తీసిన హర్ష ముఖంలో నెత్తురింకి పోయింది. ఓ పెద్దాయనా, వెనకాలే పూజ .. తన సహాధ్యాయిని. గిరుక్కున వెనుదిరిగి తన గదిలోకి వెళ్లి విసురుగా తలుపేసేసుకున్నాడు. భయంతో గుండె దడదడలాడుతోంది. 'రాక్షసి .. ఏకంగా ఇంటికే తీసుకొచ్చేసింది వాళ్ల వాళ్లని ..ఇప్పుడెలా' భయంతో బిక్కచచ్చిపోయి గోళ్లు కొరికేసుకుంటున్నాడు హర్ష. హాల్లో మాటలు లీలగా వినబడుతున్నాయి అటు గదిలోకీ, ఇటు వంటింట్లోకీ..

"ఎవరు మీరు? ఏం కావాలి?" అప్పటికే లోపలికొచ్చిన ఆ కొత్తవారిని ఆశ్చర్యంగా చూస్తూ, మర్యాదగా అడిగారు శ్రీవారు.

"నమస్తే అండీ .. నా పేరు శ్రీహరి, ఈ అమ్మాయి పూజ, నా మనవరాలు .. మీ హర్ష క్లాస్మేట్" చిరునవ్వుతో అన్నాడాయన.

నా గుండె గుభేల్మంది.. ' ఏం తంటా తెచ్చిపెట్టాడో కొంపమీదికి.. అయినా ఆ పెద్దాయన అంత సౌమ్యంగానే మాట్లడుతున్నాడంటే.. నా కంగారే కానీ, ఏ సమస్యా అయి ఉండదు అనుకుంటూ గబగబా చేతులు కడుక్కుని తుడుచుకుంటూ హాల్‌లోకి వచ్చాను.

"అవునా! మా హర్ష కోసం వచ్చారా! మరదేమిటీ వాడలా వెళ్లిపోయాడు? పిలుస్తా కూర్చోండి . హర్షా .. హర్షా" మా బుద్ధావతారానికి ఇంకా అర్థమైనట్లు లేదు.. వీడేదో వెధవపని చేస్తే, కాస్తంత గడ్డి పెట్టి, బుద్ధి చెప్పడానికొచ్చుంటారు.. ఇంకా మంచీ మర్యాదా ఉన్నవాళ్లలాగే ఉన్నారు.. లేకుంటే ఏకంగా యుద్ధానికే వచ్చి ఉండే వారు. నా ధోరణి అలా



సాగిపోతోంది.

"ఆ అబ్బాయి రాదులెండి కానీ, నేను మీతో మాట్లాడడానికే వచ్చా.." నిదానంగా అన్నాడాయన కూర్చుంటూ .. పక్కనే ఆ పాప కూర్చుంది .. కళ్లు ఎర్రగా వాచిపోయి ఉన్నాయి.. చాలా దుఖాన్ని మోసినట్లు.

"చెప్పండి.. దేని గురించి?" కొంచెం అనీజీగా అన్నారాయన, అప్పటికి వెలిగినట్లుంది.

"చూడండి.. ఇప్పటి చెత్త సినిమాలు చూసి ఆడపిల్లలని ఏడిపించడం హీరోయిజం అనుకుంటు న్నారు ఇప్పటి కుర్రాళ్లు.'' ఉపోద్ఘాతంగా అన్నాడాయన.

"శశీ .. నువ్వు లోపలకెళ్లు" జరగబోయేది ఎంతో శ్రద్ధగా చూస్తూ అక్కడే కూర్చున్న మా చిన్నాడితో అన్నారాయన.

"ఉండనివ్వండీ.. అతనూ మగపిల్లాడేగా, రేపటినుంచి అతనూ అలాగే ప్రవర్తిస్తాడుగా.. కనీసం ఎలా ప్రవర్తించకూడదో నేర్చుకుంటాడు" కొంచెం



కటువుగానే అన్నాడాయన .. పాపం ఎంత బాధ ఉందో మనసులో.

"ఏం జరిగిందీ?" మెల్లగా ఆ పిల్ల దగ్గరగా వెళ్లి తల మీద చెయ్యి వేస్తూ అడిగాను.

ఆ మాత్రానికే ఆ పిల్లలో అణుచుకున్న దుఃఖం లావాలా పొంగింది. రెండు చేతుల్లో ముఖం దాచుకుని భోరుమంది.

"హర్షా.." ఉగ్ర నరసింహావతారం ఎత్తారాయన.

"మీరుండండి! అసలు జరిగిందేమిటో తెలుసుకుని వాడిని పిలుద్దాం, కోపం సమస్యకు పరిష్కారం కాదు, ఆయన భుజం పట్టి కూర్చోబెట్టి .." నాన్నా శశీ అక్కకీ, తాతగారికీ మంచినీళ్లు పట్రా"

వాడు నాకేసోసారి అయిష్టంగా చూసి లోపలికెళ్లాడు. వాడి ముఖంలో మంచి సన్నివేశాన్ని మిస్ అవుతున్న భావన. పిల్లలకది సహజం.

"చెప్పండి బాబాయ్ గారు.. ఏం జరిగింది?" మృదువుగా అడిగాను.

"చెప్పడానికేముందమ్మా! నిన్న స్కూల్లో పదిమంది కుర్రాళ్లు కలిసి అమ్మాయిలని ఏడిపిస్తుంటే, సహజంగానే చొరవా, ధైర్యం ఉన్న మా పూజ ఎదురు తిరిగి తప్పుని చెప్పి, ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదు చేస్తానన్నదట.. అంతే రెచ్చిపోయి దాని పుస్తకాలు లాక్కుని విసిరేసి, చున్నీ లాగేసి, అసభ్యమైన మాటలతో, పాటలతో నానా యాగీ చేసారట. పిల్ల స్కూల్ మధ్యలోనే వచ్చేసింది, ఒకటే ఏడుపు.. వాళ్ల నాన్నేమో ఆవేశంగా స్కూలుకు బయలుదేరాడు.. అదా పరిష్కారం, వీడు ఫిర్యాదివ్వడం, ఆ మాస్టర్ పిలిచి వీళ్లకి వార్నింగివ్వడం.. వీళ్లు మరింత రెచ్చిపోయి కక్ష గట్టడం .. అదేగా జరిగేది .. అందుకే నేను ఆ పిల్లల అందరిళ్లకూ వెళ్లి తల్లితండ్రులతో మాట్లాడి .. వాళ్లను మంచి దారిలో పెట్టాలనుకున్నాను. లేకుంటే ఇది

ఇలాగే వాళ్లతో బాటే పెరిగిపెద్దయి .. భవిష్యత్తులో ఇంకే విపరీతాలకు దారి తీస్తుందో ఎవరికి తెలుసు?" ఓపికగా అన్నాడాయన.

నేనూ.. మా వారు తప్పు చేసినట్లు తలదించుకున్నాం. నిజమే కదా పిల్లలను సరైన మార్గంలో పెంచకపోవడం తల్లితండ్రుల తప్పేగా!

''ఇప్పుడు మీరు తలదించుకోడం కాదు చేయాల్సినదీ, నాకు కావలసినదీ .. కనీసం ఇప్పటికైనా ఆ పిల్లలకు ఏది తప్పో, ఏది ఒప్పో చెప్పి సరైన మార్గంలో పెట్టడం" చిన్నగా అన్నాడాయన.

"తాతగారు మంచి నీళ్లు" మా చిన్నాడు ట్రేలో రెండు గ్లాసులతో నీళ్లు తెచ్చి ఇచ్చాడు.

''అక్కకు కూడా ఇవ్వు'' నన్ను నేను సంభాళించుకుని మెల్లిగా చెప్పాను.

"అక్కా, నీళ్లు" నా కేసోమారు చూసి ఆ అమ్మాయికి నీళ్లిచ్చాడు.

వద్దన్నట్లు తల తిప్పిన ఆ అమ్మాయితో 'తీసుకో పూజా .. కాస్త స్థిమిత పడతావు ' అన్నాను. ఏమనుకుందో ఓ మారు నాకేసి చూసి చటుక్కున నీళ్లందుకుని గడగడా తాగేసింది.

"మిమ్మల్ని చూస్తుంటే బాగా చదువూ, సంస్కారం ఉన్న వాళ్ల లాగే కనబడుతున్నారు, ఎందుకంటే లేకుంటే మీరీపాటికే నా మీద ఎదురు దాడికి దిగేవారు .. మీ పిల్లాడిని వెనకేసుకొస్తూ. ఇంతకు ముందో ఇంట్లో అదే జరిగింది, కానీండి, దాని వలన కలిగే నష్టం వాళ్లకు ఇప్పుడు తెలియదూ, తరువాత తెలిసినా పూడ్చుకోలేరు. అది వాళ్ల వాళ్ల తలరాతల్ని బట్టి ఉంటుంది. ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు.. కాకపోతే ఆ నష్టం వాళ్లకు మాత్రమే జరగదు, అలాంటి వాళ్ల వల్ల అభం శుభం తెలియని ఆడకూతుళ్లు అన్యాయమైపోతున్నారు" బాధగా నిట్టూర్చాడాయన.

అప్పటికే మా ఆయన కళ్లలో పశ్చాత్తాపం కనిపిస్తోంది నాకు, ఎందుకంటే నేను ఇలాంటి సమస్యలు ఎదురవుతాయని ఆయనకు చెప్పని రోజుందదు మరి. కానీ ఆయనే దానిని అంత సీరియస్‌గా తీసుకోలేదు. ఇప్పుడు అర్థం అయింది మరి.

ఎలాగో గొంతు పెగల్చుకుని "వాడి తరుపున నేను క్షమాపణ అడుగుతున్నా మిమ్మల్ని, ఇకముందు ఇలా జరగదు, నే మాట్లాడతా వాడితో .. అమ్మా పూజా .. మనసులో ఏం పెట్టుకుని బాధపడకు" ఇంకేం అనాలో తోచలేదాయనకు.

మళ్లీ తనే అన్నారు .. "మా చిన్నప్పుడు ఇలా ఉండండీ, అలా చెయ్యండీ అని మాకెవరూ చెప్పలేదు, అందుకే మా ఆవిడ చెబుతున్నా నేను పట్టించుకోలేదు, నా పిల్లలతో ఆ అవసరం వస్తుందనుకోలేదు." తడబడుతూ అన్నారాయన.

తన మనసూ, బాధ అర్థమై మెల్లిగా ఆయన చేయి నొక్కాను ఓదార్పుగా.

"నిజమే .. గతంలో పెద్దవాళ్ల ప్రవర్తన, వాళ్లు చెప్పే నీతి కథలూ, శతకాలు, సుభాషితాలు, మనలో తెలియకుండానే ఓ మంచి 'వ్యక్తిత్వానికి' పునాది పడేది. ప్రత్యేకించి ఇలా ఉండూ, ఇలా చెయ్యి అని ఎవరూ చెప్పక్కరలేకుండా. కానీ ఇప్పటి పరిస్థితులు వేరు. ఇప్పుడంతా నాగరికతా, విజ్ఞానం వెర్రితలలు వేస్తున్న వేళ, వాటిలో మంచిని కంటే చెడునే

ఎక్కువగా తీసుకుంటున్నారంతా. పిల్లలు మొక్కలాంటి వాళ్ళు .. అవి ఎంత ప్రాణప్రదంగా, జాగ్రత్తగా పెరిగితే అంత మంచి ఫలాలనిస్తాయి. పిల్లలూ అంతే. నిజంగా అందరికీ జీవితకాలం ఉపయోగపడే ఎన్నో మంచి విషయాలు ఎంతో సులువుగా, స్పష్టంగా అర్థమయ్యేలా చెప్పిన మన యోగి వేమన పద్యాలు ఇప్పుడెవరైనా కనీసం తలుచుకుంటున్నారా? మరి మా చిన్నతనంలో, మా పిల్లల చిన్నతనంలో వాటిని వల్లె వేయించి, అర్థ తాత్పర్యాలతో సహా చెప్పేవాళ్ళం.. అవి చాలు ఓ మనిషిని ఉన్నతంగా తీర్చి దిద్దడానికి.. ఇప్పుడు ఎంతసేపూ మార్కులూ, ర్యాంకులే గానీ జీవితానికి పనికొచ్చే చదువులేవీ. మీరూ వినే ఉంటారీ పద్యం..

"ఒరే బాబు ఓ సారి మీ అన్నయ్యను పిల్చుకురా" ఆయన చెప్పాడు శశితో.

వాడు మాకేసి చూసాడు 'వెళ్ళు.. నాన్న రమ్మంటున్నారని చెప్పి తీసుకురా' మెల్లిగా అన్నాను.

వాడి ప్రసక్తి వస్తూనే పూజ ఒక్కసారిగా భయం భయంగా వాళ్ల తాత చెయ్యి పట్టుకుంది.

నేను లేచి నెమ్మదిగా ఆ అమ్మాయి పక్కనే సోఫాలో కూర్చున్నా, తనని పొదవి పట్టుకుని .. అభయం నా స్పర్శ ద్వారా అందిస్తూ.

మెల్లిగా తప్పు చేసిన వాడిలా తలదించుకుని వచ్చాడు హర్ష, తమ్ముడి వెనకాలే.

" అదేమిటి హర్షా .. ఆ అమ్మాయి ఎవరో తెలియనట్లు అలా వెళ్లిపోయావు, తను నీ క్లాస్‌మేట్ అట కదూ, పేరైనా తెలుసా?" నా కంఠం కఠినంగా పలికింది.

"ఆ .. అమ్మా తను పూజ, సారీ పూజా! నిన్న జరిగినదానికి, ఇంకెప్పుడూ అలా జరగదు" తల

**"క్షమించండి తాతగారు, ఇంకెప్పుడూ అలా ప్రవర్తించను, మదర్ ప్రామిస్" అవమానంతో ముఖం ఎర్రబడగా కళ్లనీళ్లతో, చటుక్కున వంగి ఆయన పాదాలంటాడు హర్ష. ఆయనలాగే వాడిని లేపి .." నన్ను కాదు ఆ మాట అడగాల్సినది పూజని, ఆమె మనసు ఎంత బాధపెట్టారో, ఎంతగా గాయపడిందో తెలుసుకుంటే చాలు" గంభీరంగా అన్నాడాయన.**

దించుకునే మెల్లిగా అన్నాడు. ఏది ఎలా ఉన్నా నా కొడుకు సూపర్, మేము తనని తిట్టి, తప్పొప్పులు చెప్పక ముందే తన తప్పు ఒప్పేసుకున్నాడు, మరి తప్పు గ్రహించుకునే చెప్పాడో లేక ప్రస్తుతానికి తప్పించుకుందుకే అలా చెప్పాడో తేలాలి.

"తప్పు అని తెలిసి చెయ్యడమెందుకూ, ఇప్పుడు దోషిలా నిలబడడమెందుకు?" కొట్టినట్టే అడిగారు మా వారు.

వాడు మాట్లాడలేదు, ఇంకా ఏదో కోపంగా అనబోతున్న వారితో ఆ పెద్దాయన 'వదిలెయ్యండి, తన తప్పు తెలుసుకున్నాడుగా, ఇంకోసారి ఇలా జరగకుండా చూసుకోండి.. తల్లితండ్రులుగా అది మీ బాధ్యత.

'పొట్లకాయ రాయి పొడుగుత్రాటను గట్ట
లీలతోడ వంక లేక పెరుగు
కుక్కతోక గట్ట కుదురునా చక్కగా
విశ్వదాభిరామ వినురవేమ. '

మరి నీ తల్లితండ్రులు పొట్లకాయ మాదిరిగా జాగ్రత్తగా పెంచలేదో, లేక నువ్వే కుక్క తోక లాంటి వాడివో నువ్వే తేల్చుకో.. ఇప్పుడింక నువ్వు చిన్నపిల్లాడివేం కాదు, బుద్ధి ఎరిగి మసులుకో.. అలాగే మన స్నేహితులను చూసి మన వ్యక్తిత్వాన్ని అంచనా వేయచ్చు అంటారు.. చెడు స్నేహాలు చేసి చెడ్డపేరు తెచ్చుకోకు.. ఇది చదువుకోవాల్సిన వయసు. దృష్టి దాని మీద మాత్రం ఉంటే జీవితంలో పైకొస్తావు. ఇంకేం చెప్పక్కర లేదనుకుంటా .." వాడిగా ఉన్నాయి ఆయన మాటలు.

"క్షమించండి తాతగారు, ఇంకెప్పుడూ అలా ప్రవర్తించను, మదర్ ప్రామిస్" అవమానంతో ముఖం ఎర్రబడగా కళ్లనీళ్లతో, చటుక్కున వంగి ఆయన పాదాలంటాడు హర్ష. ఆయనలాగే వాడిని లేపి .." నన్ను కాదు ఆ మాట అడగాల్సినది పూజని, ఆమె మనసు ఎంత బాధపెట్టారో, ఎంతగా గాయపడిందో తెలుసుకుంటే చాలు" గంభీరంగా అన్నాడాయన.

"సారీ పూజా.. ఇంకెప్పుడూ అలా ప్రవర్తించను.. మనం స్నేహితులం ఇక నుంచీ. నన్ను క్షమించు" దాదాపుగా ఏడ్చేస్తూ అన్నాడు హర్ష. మెల్లిగా తలయెత్తి వెన్నెల కురిసినట్లు నవ్వింది పూజ చల్లగా.

"నీ స్నేహితులు రేపు స్కూల్లో మళ్లీ దీనికోసమో మీటింగ్ పెట్టి అవాకులూ, చవాకులూ పేలతారేమో. ఇది మొదటి సారి కనకా, మీరూ చిన్నపిల్లలే, మాటలతో మారతారేమో అన్న ఆశతోనూ ఇలా ఓపికగా చెప్పాను, మీకు తెలియదేమో పూజకు కరాటేలో బ్లాక్ బెల్ట్ ఉంది. ఈ సారి దాని జోలికే కాదు, ఇంక ఏ ఆడపిల్ల జోలికెళ్లినా మాటలుండవు .. హాస్పిటల్లో మంచం ఎక్కడమే. జాగ్రత్త .. చెప్పు నీ ఫ్రెండ్స్‌కి" మనవరాలిని చూస్తూ ఆప్యాయంగా అన్నాడాయన.

"మరింకేం! .. అసలు నిన్ననే అందరికీ ఓ కోటింగ్ ఇచ్చేస్తే బుద్ధిగా పడుండేవారు .. ఇంత శ్రమ తీసుకుని తాతగారినిలా ఇబ్బంది పెట్టే బదులు" చురచురా చూస్తూ కోపంగా అన్నారు శ్రీవారు.

" అదా మనకు కావలసినది, వాళ్లలో మంచి మార్పు, కొట్టుకోవడం, కక్ష సాధింపులూ కావు. స్నేహ వాతావరణం, బాధ్యతగా పెరగడం కావాలి .. ఏం హర్షా సరేనా .. ఇక వెళ్లొస్తాం అండీ" లేచాడాయన.

"అయ్యో ఉండండి కొంచెం కాఫీ ..." హడావుడిగా లేవబోయాను.

"అబ్బే! భోజనాల వేళ ఇప్పుడు కాఫీ ఏమిటమ్మా వస్తాం" లేచి మా ఆయనతో కరచాలనం చేసి బయలుదేరారు.

* * *

ఆ తరువాత పిల్లల పెంపకాలు, తీరుతెన్నులూ .. పెద్దల బాధ్యతల గురించి మా ఆయనకు ప్రయివేట్‌గా ఒక క్లాస్ ఎలా తీసుకున్నానో ఇక వేరే చెప్పాలా! చెప్పండి. ★



# మోదీ వైపే అభిమానుల చూపు..

భారత హాకీ పితామహుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి (ఆగస్టు 29)న జరుపుకునే జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలు ఈ యేడాది నిరాడంబరంగా ముగిశాయి. ఈ సందర్భంగానే ధ్యాన్‌చంద్‌కు భారతరత్న ప్రకటించాలనే డిమాండ్ మరోసారి ఊపందుకుంది. విలక్షణ ఆటతీరు, వ్యక్తిత్వంతో భారత హాకీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ధ్యాన్‌చంద్‌కు కేంద్ర ప్రభుత్వం 'భారతరత్న' పురస్కారం ఇచ్చి గౌరవించాలని ఆయన అభిమానులు కోరుతున్నారు.





క్రీడా కృష్ణ, 84668 64969

ధ్యాన్‌చంద్- ఒలింపిక్స్‌లో పుష్కరకాలం పాటు భారత్‌ను స్వర్ణవిజేతగా నిలిపిన అసాధారణ ఆటగాడు. హాకీ స్టిక్ పట్టాడంటే చాలు.. ఆయన చేతిలో అది కాస్త మంత్రదండమైపోయేది. ఆయన నాయకత్వంలోనే భారత్ వరుసగా మూడు ఒలింపిక్స్‌లో బంగారు పతకాలు సాధించి చరిత్ర సృష్టించింది. 1928, 1932, 1936 ఒలింపిక్స్‌లో ధ్యాన్‌చంద్ విశ్వరూపమే ప్రదర్శించాడు. వరుసగా మూడు ఒలింపిక్స్‌లో స్వర్ణపతకాలు సాధించిన భారత దిగ్గజంగా నిలిచాడు.



**ధ్యాన్‌చంద్ శకం**

1926 నుంచి 1948 వరకు భారత, ప్రపంచ హాకీలో ధ్యాన్‌చంద్ శకంగా సాగింది. ఒక్క ఒలింపిక్స్‌లోనే 101 గోల్స్ సాధించిన అరుదైన రికార్డు ఆయన సొంతం చేసుకున్నారు. అంతేకాదు, తన కెరియర్‌లో 1000 గోల్స్ సాధించిన ఆటగాడిగా కూడా ధ్యాన్‌చంద్ నిలిచిపోయారు. 1948లో తన చిట్టచివరి అంతర్జాతీయ హాకీ మ్యాచ్ ఆడిన ధ్యాన్‌చంద్‌కు భారత ప్రభుత్వం 1956లో పద్మభూషణ్ అవార్డు ఇచ్చి గౌరవించింది. మరణానంతరం ఆయన పేరు మీద న్యూఢిల్లీలో నేషనల్ స్టేడియం నిర్మించారు. ఓ తపాలాబిళ్లను సైతం విడుదల చేశారు. క్రీడారంగంలో జీవనసాఫల్య పురస్కార గ్రహీతలకు ఇచ్చే 'మేజర్ ధ్యాన్‌చంద్' అవార్డును సైతం ప్రవేశపెట్టారు.

**కశ్మీర్, త్రిపుల్ తలాక్, రామజన్మభూమి వంటి జటిలమైన సమస్యలను కూడా అలవోకగా పరిష్కరించడం ద్వారా తనకు తానే సాటిగా నిలిచిన ప్రధాని నరేంద్ర మోదీనే.. ధ్యాన్‌చంద్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వాలని దేశంలోని కోట్లాదిమంది క్రీడాభిమానులు, లక్షలాదిమంది హాకీ ప్రియులు కోరుకుంటున్నారు. మోదీ తలచుకుంటే హాకీ మాంత్రికుడిని భారతరత్నతో గౌరవించుకోవడం ఏమంత కష్టంకాదని భావిస్తున్నారు.**

కశ్మీర్, త్రిపుల్ తలాక్, రామజన్మభూమి వంటి జటిలమైన సమస్యలను కూడా అలవోకగా పరిష్కరించడం ద్వారా తనకు తానే సాటిగా నిలిచిన ప్రధాని నరేంద్ర మోదీనే.. ధ్యాన్‌చంద్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వాలని దేశంలోని కోట్లాదిమంది క్రీడాభిమానులు, లక్షలాదిమంది హాకీ ప్రియులు కోరుకుంటున్నారు. మోదీ తలచుకుంటే హాకీ మాంత్రికుడిని భారతరత్నతో గౌరవించుకోవడం ఏమంత కష్టంకాదని భావిస్తున్నారు. ధ్యాన్‌చంద్‌కు భారతరత్న ప్రకటిస్తే ఆ పురస్కార గౌరవం మరింత ఇనుమడిస్తుందని క్రీడాపండితులు చెబుతున్నారు.

**దేశభక్తి**

1936 బెర్లిన్ ఒలింపిక్స్‌లో ధ్యాన్‌చంద్ ఆటతీరు, మణికట్టు మాయకు జర్మన్ నియంత హిట్లర్ కూడా ఆయనకు అభిమాని అయ్యాడు. ఆయన వాడుతున్న హాకీ స్టిక్‌లో ఏదైనా అయస్కాంతం ఉందేమోనన్న అనుమానంతో పరీక్షలు కూడా చేయించాడు. అయితే, అదంతా ధ్యాన్‌చంద్ నైపుణ్యం, మణికట్టు మాయేనని గ్రహించి తమ ఆర్మీలో చేరితే మేజర్ పదవి ఇస్తానని చెప్పాడు. దీనికి ధ్యాన్‌చంద్ సమాధానమిస్తూ జర్మనీ సేనలో మేజర్‌గా ఉండటం కంటే భారత సైన్యంలో సిపాయిగా ఉండటమే తనకు ఇష్టమని చెప్పి ఆనాడే తన దేశభక్తిని చాటుకున్నాడు. ★

# సర్వతో జయమంగళం

ఎనుగంటి వేణుగోపాల్

మీకో కథ చెప్పనా?

కథ అంటే.. పెద్ద కథేం కాదు.. కేవలం నా గురించే..

ఎందుకో చెప్పాలి అనిపించింది.. ఎందుకంటే, మీ ఇంట్లో నా లాంటి చిన్న చిన్న పిల్లలు ఉంటారుగా.. అందుకని!

నా పేరు బుజ్జి.

అరెరే అసలు పేరు ఏమిటంటారా.... విశాల్.

అబ్బా అసలు కథ మొదలు పెట్టకుండా... ఈ పరిచయం ఏమిటి అంటారా? అలాగైతే, రండ్రండి..

సాయంత్రం అవుతుండగా నాన్న మురళి ఆఫీసు నుండి వస్తూనే ఎప్పట్లా అమ్మ నివేదికను అడిగాడు "మన సుపుత్రుడు ఈ రోజేం ఘనకార్యం చేశాడు?" అంటూ..

"మొన్న పెన్సిల్, నిన్న పెన్, ఈరోజు ఉదయం కొనిచ్చిన కొత్త నోట్‌బుక్ పోగొట్టుకొని వచ్చాడు" అని చికాగ్గా అంది అమ్మ.

అమ్మ అందించిన కాఫీ తాగుతూ "ఫోర్త్ స్టాండర్డ్‌కు వచ్చాడు. పోగొట్టుకోవడం అయితే మానడం లేదు" అంటూనే "వాడినైతే కోప్పడ లేదు కదా!" ఆరా తీశాడు నాన్న.

"కోప్పడక ఎత్తుకొని ముద్దాడనా.. హార్లిక్స్ తాగేసి, ఆ గదిలో హోంవర్క్ చేసుకుంటున్నాడు ...." ఎర్రబడిన ముఖంతో జవాబిచ్చింది అమ్మ.

* * *

అలా మా అమ్మనాన్న ఓ రోజు ఏం చేశారంటే..

నన్ను సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకువెళ్లారు. చాలా రోజులకు... ఓ ఐదేళ్ల తర్వాత అన్న మాట.

అన్ని రకాల టెస్టులు చేసి ఆ డాక్టర్ అంకుల్ ఏం చెప్పారో తెలుసా?

"ఒరేయ్ ! బుజ్జి.... భలేగా పోగొట్టుకుంటున్నావు. కంటిన్యూ ఇట్! ఇలాగే అప్పుడప్పుడు పోగొట్టుకో...." అంటూ నా భుజం తట్టారు.

అలా మొహం మడిచారు ఏం?

"డాక్టర్లు ఎందుకు అలా చెబుతారు? నేను అబద్ధం ఆడుతున్నాను అనా? అయ్యో అదేం కాదు.... నిజమే! అలా పోగొట్టుకోవడం మినహా మరోచెడు లక్షణం ఏదీ లేదు నాలో!

మరి.. ఆ డాక్టరంకుల్ అలా ఎందుకు అన్నారు, అంటే ..

* * *

డాక్టర్ అంకుల్ సాలోచనగా పైకి చూస్తూ "మీ ఇంట్లోవాళ్లకి ఎవరికైనా మతిమరుపు లాంటిది ఏమైనా ఉండేదా?" అని అడిగారు.

"అదేం లేదండీ!" టక్కున చెప్పేసారు నాన్న.

"మీ వైపు ...."

అమ్మను అడిగేసరికి "ఊహూ!" అంటూ తలూపింది అమ్మ.

వీళ్లందరి సంభాషణ వింటూ అమాయకంగా ఓ పక్కన ప్లాస్టిక్ చైర్‌లో కూర్చున్నాను.

"సరే విషయం ఏంటో చూస్తా! మీరు అలా కాసేపు బయట వెయిట్ చేస్తూ ఉండండి."

డాక్టర్ అలా చెప్పేసరికి అమ్మానాన్న లేచి బయటకు నడిచారు.

స్ప్రింగ్ డోర్ క్లోజ్ అయింది.

గదిలో ఇద్దరమే ఉన్నాము. దగ్గరగా రమ్మని సైగ చేశారు ఆయన. వెళ్లి పక్కనే స్టూల్ పైన కూర్చున్న.

"క్లాసులో ఫస్టు కదా వచ్చేది....." మాటలు కలిపారు ఆయన.

"అవును అంకుల్! కానీ నైంటీఫైవ్... వస్తుంది పర్సెంటేజ్.." బిడియపడకుండా చెప్పాను.

"మరి ఎంత రావాలి?" కనుబొమ్మలు ముడిచారాయన.

"నెక్స్ట్ ఇయర్ టెన్త్ కదా అంకుల్ 10/10 తెచ్చుకొని అందరి చేత గుడ్ అనిపించుకోవాలి."

"మరి ఇప్పుడు వస్తువులు పోగొట్టుకుంటూ బ్యాడ్ అవుతున్నావు కదా!"

నవ్వు వచ్చింది నాకు.

"డాక్టర్ అంకుల్! మీకు ఒక రహస్యం చెప్పినా?" అన్నాను మెల్లగా.

విస్తుపోతూ "ఓపెన్ ఇట్!" భుజం తట్టారు ఆయన.

"కానీ, నాకు ఓ ప్రామిస్ కావాలి"

నమ్మకంగా తలూపారు ఆయన.

"అమ్మానాన్నకి చెప్పొద్దు."

"అంతేగా చెప్పను ......"

"తరచూ నేను అవి ఇవి పోగొడుతున్నాను అన్నది నిజం కాదు."

"అవునా సో వాట్?"

"నేనే ఇచ్చేస్తుంటాను... లేనివాళ్లకు, ఏదైతే నా దగ్గర ఉంటుందో దాన్ని...." వింటూ షాక్ అయ్యారు ఆయన.

"అంటే మీ నాన్నగారు నాతో చెప్పినట్టు సైకిల్ ఎక్కడ పోగొట్టుకోలేదా?"

మళ్లీ నవ్వాను.

"నా సైకిల్ అమ్మేసి వచ్చిన డబ్బుతో ఎంచక్కా తుఫాను బాధితులకు ఫండ్‌గా ఇచ్చేసా!"



గాలి వేటుకి తనువు షేక్ అవుతున్నా ధైర్యంతో చిరునవ్వులు చిలుకుతూ కాంతిని పంచే కొవ్వొత్తిలా సగర్వంగా చెప్పాను.

అదిగో... అప్పుడు అదిరిపడ్డాడు సైకియాట్రిస్ట్. మొట్టమొదటి కేసు ఇది.. కొత్తగా వింతగా అదీ ఓ 14, 15 ఏండ్ల కుర్రవాడిలో ఇలాంటి ఆలోచనలు ప్రేరేపితం అవ్వడం వండర్ అనిపించి ఉంటుందా యనకి..

"ప్రతి బర్త్‌డేకి ఫ్రెండ్స్‌కి చాక్లెట్లు పంచను. నాన్నని డబ్బులు అడిగి గుడి మెట్ల పైన అడుక్కునే వాళ్లకి పంచేస్తా!"

నేను చెప్పే విషయాలు ఆ డాక్టర్‌ని కలవ పరుస్తున్నట్టు అనిపించింది నాకు, ఆయన ముఖకవళికలు గమనిస్తుంటే.

"మూడేళ్ల పిల్లవాడు దేశాల పేర్లు చెప్పడం ఆశ్చర్యమే! 9 ఏళ్ల పాప భగవద్గీత శ్లోకాలు గడగడా అప్పజెప్పడం అభినందనీయమమే! 12 ఏళ్ల చిన్నోడు డిగ్రీ పరీక్షలు వ్రాసి పాసవడం ఆలోచనీయమమే! మనం అప్పుడప్పుడు వార్తల్లో వింటున్న ఇలాంటి నిజ దృశ్యాలన్నీ... ఆయా పిల్లల ప్రతిభాపాటవాలకు నిదర్శనాలు. కానీ నాలో రూపుదిద్దుకుంటున్న సామాజిక దృష్టి కోణం మరింత అపూర్వమైనదది..." అని డాక్టరంకుల్ ఆలోచనలు సాగుతున్నట్టు ఉన్నాయి.

తేరుకొని, "ఒరేయ్! బుజ్జి .... భలేగా పోగొట్టుకుంటున్నావు రా... కంటిన్యూ ఇట్! ఇలాగే అప్పుడప్పుడు పోగొట్టుకో..." అంటూ నా భుజం తట్టారు.

మళ్లీ తనే, "మానవతా విలువలు పోగొట్టుకుంటున్న ఈ మనుషుల మధ్య... బాల్యం నుండే మానవత్వాన్ని ప్రోది చేస్తున్న నీలాంటి వాళ్లు అవసరమే!" అన్నారు ఆయన.

వింటూ ఉండిపోయాను.

డాక్టర్ అంకుల్ తన ధోరణిలో తను చెప్పుకుంటూ పోతున్నాడు.

"ఎందుకంటే పరుల కోసం తనని తాను పోగొట్టుకున్నవాడు తప్పక గొప్పవాడవుతాడు. నీ చదువును మాత్రం మిస్ కావద్దు. కాలం నీకు ఎదురు వచ్చినా నీ లక్ష్యాన్ని విడనాడకు. ఎందుకంటే సాటి మనిషి కన్నీటి చుక్కని తుడిచే వాడే కంటికి అందనంత ఎత్తుకు ఎదుగుతాడు."

హిత బోధ చేస్తూనే ఆ డాక్టర్ అంకుల్ నాకు ఒక హామీ ఇచ్చారు .

"నీకు ఎప్పుడైనా ఏదైనా పోగొట్టుకోవాలి అని అనిపించినప్పుడు.. పోగొట్టుకోవడానికి నీ దగ్గర ఏదీ లేదనిపిస్తే వచ్చి నన్ను కలువు. దానికి సరిపడా నేను పోగొట్టుకునే ప్రయత్నం చేస్తా!"



పెద్దల్ని పిల్లలు అనుసరించడం సహజం. కానీ ఇక్కడ నా మార్గం వెంట అంకుల్ నడుస్తాను అనడం నాకు చాలా గర్వంగా అనిపించింది.

ఇకపోతే, కావాలని ఒకటి రెండు రోజులు నన్ను చెకప్ చేస్తున్నట్టు చేసి... చివరికి ఆ డాక్టర్ అంకుల్ మా వాళ్లకి ఇలా చెప్పేసారు, నా దగ్గర మాట తీసుకున్నందుకు.

"మీ వాడి గురించి మీరు దిగులు పడాల్సినది ఏమీ లేదు mentally is alright నో నీడ్ ఎనీ టైప్ ఆఫ్ థెరపీ! అలాగే మందులు కూడా అవసరం లేదు. త్వరలోనే అంతా సద్దుమణుగుతుంది" అంటూ అమ్మానాన్నలకి ధైర్యం చెప్పి పంపించారు.

* * *

ఇదండీ కథ!

ఇలా పోయింది అంటూ అబద్ధం ఆడడం దేనికి? చేసిన పని అమ్మానాన్నలతో ధైర్యంగా చెబితే సరిపోతుందిగా అని కదూ మీ సందేహం..

అదీ అయ్యింది.

నేను ఒకసారి ఇంటి గేటు బయట నిలబడి అమ్మ ఇచ్చిన ఆపిల్ తింటున్నా. ఓ బక్కచిక్కిన కుక్క నా వైపుగా వచ్చింది కుంటుతూ.... ఆశగా చూస్తూ తోకాడించింది ...

పాపం ఎముకలు తేలి ఉన్నాయి. జాలి వేసింది.

చప్పున... ఆపిల్ తినమంటూ వంగి కింద పెట్టేసా! తింటున్నప్పుడు దాని ఆనందం చూస్తే భలేగా అనిపించింది.

నేను లోపలికి వెళ్లి అమ్మను అడిగి మరొకటి తినొచ్చు. మరి దానికి ఎవరు పెడతారు?

నేను చేసింది అమ్మ గమనించినట్టు ఉంది. పరుగున వచ్చి గట్టిగానే అరిచింది నాపై. అప్పుడు భయం వేసింది. కానీ మూగజీవి ఆకలి తీర్చితే తప్పు ఏంటో నాకు బోధపడలేదు.

మరొకసారి ఇలాగే చలికాలం కదా స్కూల్ డ్రెస్‌తో పాటే స్వెటర్ వేసి పంపుతుంది అమ్మ. నాన్న దాన్ని ఆఫీసు పని మీద బెంగళూరు వెళ్లినప్పుడు తెచ్చారట.

స్కూల్ వ్యాన్ నుండి దిగానో లేదో... నా వయసే వున్న ఒక అబ్బాయి ఒంటిమీద ఆచ్ఛాదన లేకుండా దీనంగా ఆడుకుంటూ కనిపించాడు. డిసెంబర్ నెల కదా అతడి శరీరం వణుకుతోంది. అనారోగ్యమో మరి ఏంటో?

గబగబా అటువైపుకు వెళ్లి స్వెటర్ తీసి ఇచ్చాను... ఇంకేమీ ఆలోచించకుండా!

ముందు అదోలా చూశాడు నా వంక!

కళ్లతో సైగ చేసా!

అతడి కళ్లు మెరిశాయి ...సంశయం లేకుండా తీసేసుకున్నాడు.

ఇంటికి వెళ్లాక విషయం చెబితే అమ్మ ఊరుకోదు. నాన్న వంత పాడతారు. అందుకని అబద్ధం చెప్పేసా,ఎక్కడో మిస్ అయ్యానని.

అలా నా హృదయం స్పందించిన ప్రతిసారి ఏదో ఒకటి పోగొట్టుకుంటూనే ఉంటున్నా! ఒకరి ఆనందానికి మనం కారణం అవుతున్నాము అంటే, నిజంగా ఆ అనుభూతే వేరు.

అందుకు నన్ను నేను పోగొట్టుకోవడానికి కూడా సిద్ధమే.

* * *

నా కథ విన్నాక

"భలేవాడివి రా! బుజ్జి..." అనుకుంటున్నారు కదూ..!

నాకు తెలుసు ......మీ భావన అదేనని....

"ఇలాగే అప్పుడప్పుడు పోగొట్టుకుంటూ ఉండు... సరేనా!" అంటారని.

నాతో ఏకీభవించినందుకు... నన్ను మనసారా దీవించినందుకు..

థాంక్స్ అండీ...!! ★

## తెలుసుకుందాం

# సాంచి స్తూపం



మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జిల్లాలో ఉన్న ఈ స్తూపం చాలా ప్రసిద్ధి చెందింది. భారతదేశంలోని అతి పురాతన కట్టడాల్లో ఇదీ ఒకటి. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌కి 46 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. దీనికి బుద్ధ సముదాయమని కూడా పేరు.

## కథ | దేవత - బంగారు గొడ్డలి

అనగనగా ఒక ఊరిలో రామయ్య, సోమయ్య అనే ఇద్దరు స్నేహితులు కట్టెలు కొట్టుకుంటూ జీవనం సాగిస్తుండేవారు.

ఒకరోజు ఆ ఊరికి సమీపంలో ఉన్న నది ఒడ్డున కట్టెలు కొడుతున్న రామయ్య గొడ్డలి పట్టుతప్పి నదిలో పడిపోయింది. తన జీవనాధారమైన గొడ్డలి నదిలో పడిపోయిందని బాధపడుతూ ఒడ్డున కూర్చొని విచారిస్తున్నాడు.

అతని బాధను చూసి నదీ దేవత ప్రత్యక్షమై 'ఏంటి రామయ్య అలా దిగులుగా కూర్చుని ఉన్నావు?' అని ప్రశ్నించింది.

'తల్లీ నేను రోజూ కట్టెలు కొట్టి వాటిని అమ్మితే గానీ నాకు పూట గడవదు. ఇప్పుడు నాకు అన్నం పెట్టే గొడ్డలి నీ నదిలో పడిపోయింది' అని చెప్పాడు.

నదీ దేవత నదిలో నుండి ఒక వెండి గొడ్డలి తీసి 'ఇదేనా నీ గొడ్డలి?' అని ప్రశ్నించింది. దానిని చూసిన రామయ్య అది తనది కాదని చెప్పాడు. ఓ బంగారు గొడ్డలిని చూపించి 'ఇది నీదేనా?' అని అడగగా మళ్లీ తనది కాదని చెప్పాడు. ఈసారి నదీ దేవత ఓ ఇనుప గొడ్డలిని చూపించి రామయ్యను అడిగింది. అతను సంతోషంగా 'అవును తల్లీ. ఇదే నా గొడ్డలి' అని చెప్పాడు. బంగారు, వెండి గొడ్డళ్లు ఇచ్చినా ఆశపడని రామయ్య నిజాయితీని మెచ్చిన నదీ దేవత ఆ మూడు గొడ్డళ్లనూ అతనికే ఇచ్చి



## పద్యం

ఆకొన్నకూడె యమృతము
తాకొందక నిచ్చువాడె దాత ధరిత్రిన్
సోకోర్చువాడె మనుజుడు
తేకువ గలవాడె వంశతిలకుడు సుమతీ

**భావం :** బాగా ఆకలివేసినప్పుడు తిన్న అన్నమే అమృతం. అది చాలా రుచిగా ఉంటుంది. ఎవరైనా దానం కోరితే విసుక్కోకుండా దానం చేసేవాడే నిజమైన దాతృత్వం కలిగినవాడు. అలాగే ఎప్పుడైనా కష్టాలు కలిగితే వాటిని ఓర్చుకోగలవాడే నిజమైన మానవుడు. ధైర్యం ఉన్నవాడే వంశానికి మంచి పేరు తేగలుగుతాడు.

## శ్లోకం

విపది ధైర్యమథాఽ భ్యుదయే క్షమా
సదసి వాక్పటుతా యుధి విక్రమః।
యశసి చాభిరుచిర్వ్యసనం శ్రుతౌ
ప్రకృతిసిద్ధమిదం హి మహాత్మనామ్॥

**భావం :** ఆపత్కాలంలో ధైర్యంగా ఉండటం, సంపదలు వచ్చినప్పుడు ఓర్పుతో ఉండటం, సభలో వాక్చాతుర్యం చూపటం, యుద్ధంలో పరాక్రమం, మంచిపేరు సంపాదించాలనే కోరిక, విజ్ఞాన సముపార్జన యందు గాఢమైన అనురక్తి కలిగి ఉండటం.. ఇవి మహాత్ముల సహజ లక్షణాలు.

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| ఓనమ్ | ఒరిస్సా (పూరీ) |
| బైశాఖి | జమ్ముకశ్మీర్ |
| రథయాత్ర | కేరళ |
| అమర్‌నాథ్‌యాత్ర | పంజాబ్ |

జవాబులు : ఓనమ్–కేరళ; బైశాఖి–పంజాబ్; రథయాత్ర–ఒరిస్సా (పూరీ); అమర్‌నాథ్‌యాత్ర–జమ్ముకశ్మీర్

నిర్వహణ : నయనశ్రీ

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### గోవింద్ వల్లభ్ పంత్



సుప్రసిద్ధ స్వాతంత్ర్య ఉద్యమకారులు. హిందీని భారత అధికార భాషగా గుర్తించేందుకు ఎంతగానో కృషిచేశారు. 1887 సెప్టెంబరు 10న జన్మించారు. న్యాయవాది వృత్తిని చేపట్టి 1914లో ఒక వ్యాజ్యంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విజయం సాధించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా సేవలందించారు. 1955లో కేంద్ర హోం శాఖ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. 1957లో భారతరత్న పురస్కారం పొందారు. 1961 మార్చి 7న మరణించారు.



మాయమైంది.

నదీ దేవత ఇచ్చిన ఆ మూడు గొడ్డళ్లు తీసుకుని ఇంటికి వెళుతున్న రామయ్యకు అతని స్నేహితుడు ఎదురయ్యాడు. అతనితో జరిగినదంతా చెప్పాడు రామయ్య. దీంతో దురాశ చెందిన సోమయ్య తన గొడ్డలిని నదిలో పడేశాడు. నదీ దేవత ప్రత్యక్షమై సోమయ్యను ఏమైందని ప్రశ్నించింది. తన గొడ్డలి నదిలో పడిపోయిందని దీనంగా నటిస్తూ చెప్పాడు.

నదీ దేవత ఓ బంగారు గొడ్డలిని చూపించి 'ఇదేనా నీ గొడ్డలి?' అని అడిగింది. 'అవును తల్లీ' అని చెప్పాడు. సోమయ్య అత్యాశను గ్రహించిన నదీ దేవత కోపంతో మాయమైపోయింది. లేనివాటి కోసం ఆశపడి ఉన్నది కూడా పోగొట్టుకున్నాడు సోమయ్య. ★

## జనరల్ నాలెడ్జ్

1. భారతదేశంలో వెలువడిన మొట్టమొదటి వార్తా పత్రిక?
2. శివాజీ మంత్రిమండలిని ఏమని పిలిచేవారు?
3. ఎలుకల ద్వారా వచ్చే వ్యాధి?

సమాధానాలు: 1. బెంగాల్ గెజిట్; 2. పీష్వాలు; 3. ప్లేగు.

## మెదడుకు మేత

వంకర టింకర
మాను.. కష్ట జీవుల
గూడూ, ఈడూ
జోడూ అవును

జవాబు: కప్ప

## మంచిమాట



కాలం కలసిరానపుడు
మౌనం వహించు..
సరైన సమయంలో నీ
సత్తా ఏమిటో
చూపించు..






# భైంసా బాధితులకు అండగా ఆర్ఎస్ఎస్–సేవాభారతి

భైంసా పట్టణంలోని కోర్బాగల్లిలో జనవరి 12, 2020న జరిగిన మతోన్మాదుల దాడిలో హిందూ కుటుంబాల ప్రజలు సర్వస్వం కోల్పోయారు. ఆర్ఎస్ఎస్ – సేవాభారతి నాటి నుండి బాధిత కుటుంబాలకు అండగా నిలిచి, వారిలో ఆత్మస్థైర్యాన్ని నెలకోల్పింది. ఇప్పుడు సంస్థ తరపున ఎనభై లక్షల వ్యయంతో ఇండ్లను పునర్ నిర్మించి, అందచేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ఆగష్టు 24, 2020న ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంతప్రచారక్ దేవేందర్ భూమి పూజ చేశారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత జనవరిలో జరిగిన సంఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. అకారణంగా హిందువుల గృహాలను మతోన్మాద ముస్లింలు ధ్వంసం చేశారన్నారు. ఈ దాడిలో హిందువులు సర్వస్వాన్ని కోల్పోయారని దేవేందర్ వివరించారు. బాధిత హిందువులను అన్ని విధాల ఆదుకునేందుకు తెలంగాణ సేవాభారతి పూనుకుందని చెప్పారు. హిందూ సమాజం సహకారంతో బాధితులకు భరోసా ఇచ్చి,రక్షణ కల్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కలహాల్లో ఇళ్లను కోల్పోయినవారికి నూతన గృహాలను నిర్మించే కార్యాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఇదే స్ఫూర్తితో అనేక మంది హిందువులు తోటి హిందూ సమాజానికి అండగా నిలవడానికి ముందుకు వస్తున్నారని దేవేందర్ అన్నారు. కేవలం భైంసాలోనే కాదు, తెలంగాణ రాష్ట్రం, దేశంలో ప్రజలకు ఎక్కడ ఏ ఆపద వచ్చినా, కష్టం కలిగినా వాళ్లను ఆదుకోనేందుకు సేవాభారతి ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు. అందులో భాగంగానే భైంసా పట్టణంలోని కోర్బాగల్లిలో ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు దేవేందర్ వివరించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత సేవాభారతి అధ్యక్షులు దుర్గారెడ్డి, ప్రాంత కార్యదర్శి స్వామి, ఇందూరు విభాగ్ ప్రచారక్ రాజారెడ్డి, కార్యవాహ గణేశ్, సహ కార్యవాహ దిగంబర్ తదితరులతో పాటు హిందూవాహిని, హిందూ ధార్మిక సంస్థల పెద్దలు, స్థానిక కులసంఘాల నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ★

## పాఠకులకు, ఏజెంట్లకు, ప్రకటన కర్తలకు గమనిక

జాగృతి వార పత్రికలో ప్రచురణార్థం పంపే వార్తలు ఫోటోలు, మిగతా సమాచారం **jagritiweekly@gmail.com** కు మాత్రమే పంపాలి.

జాగృతి వారపత్రిక చందాకు సంబంధించిన అన్ని వివరాలు **jagritiweeklysub@gmail.com** కు మాత్రమే పంపాలి.

జాగృతి వారపత్రికలో ప్రచురణార్థం పంపే వాణిజ్య ప్రకటనలను **jagritiweeklyadvt@gmail.com** కు మాత్రమే పంపాలి.

– సంపాదకుడు

# వారఫలాలు

**2020 ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 06 వరకు**



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం :అశ్విని, భరణి, కృత్తిక 1వపాదం**

నేర్పు, ఓర్పుతో వ్యవహారాలు చక్కదిద్దుతారు. ఎంతటి సమస్య ఎదురైనా పరిష్కరించుకుని సత్తా చాటుకుంటారు. ఆదాయం కొంతమేర పెరిగి ఉత్సాహాన్నిస్తుంది. వ్యాపారులు కోరుకున్న లాభాలు పొందుతారు. ఉద్యోగులకు విధి నిర్వహణలో ఆందోళన తొలగుతుంది. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితలకు ఊహించని అవకాశాలు దక్కవచ్చు. 3,4తేదీల్లో వ్యయప్రయాసలు. బంధు వర్గంతో విభేదాలు. గణేశ్‌ను పూజించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ఎంతోకాలంగా నిరీక్షిస్తున్న బాకీలు వసూలవుతాయి. పరిస్థితులు అనుకూలించి ముందడుగు వేస్తారు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారులు లాభాల కోసం కొత్త వ్యూహాలు అమలు చేస్తారు. ఉద్యోగులకు అడ్డంకులు తొలగుతాయి. రాజకీయవేత్తలు, కళాకారులు, క్రీడాకారులకు క్రమేపీ అనుకూలస్థితి. 31,1 తేదీల్లో ధనవ్యయం.కుటుంబంలో చికాకులు. హనుమాన్ ఛాలీసా పఠించండి.

**మిథునం: మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు**

ఆర్థిక వ్యవహారాలు క్రమేపీ పుంజుకుంటాయి. చేపట్టిన కార్యక్రమాలు కొంత నిదానంగా పూర్తి కాగలవు. పెద్దల సలహాలు పొందుతారు. స్థిరాస్తిపై సోదరులతో ఒప్పందాలు చేసుకుంటారు. వాహనాలు, ఇళ్ల కొనుగోలులో అవాంతరాలు తొలగుతాయి. ఉద్యోగులు విధి నిర్వహణలో మరింత సమర్థవంతంగా ముందుకు సాగుతారు. 2, 3 తేదీలలో వృథా ఖర్చులు. అనారోగ్యం. ఆకస్మిక ప్రయాణాలు. శివపంచాక్షరి పఠించండి.

**కర్కాటకం : పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఆదాయం సమృద్ధిగా ఉండి అవసరాలు తీరతాయి. ముఖ్యమైన కార్యక్రమాలను పట్టుదలతో పూర్తిచేస్తారు. పరిస్థితులు అనుకూలిస్తాయి. ఇంటి నిర్మాణాలకు ప్రణాళిక రూపొందిస్తారు. నిరుద్యోగుల కలలు ఫలించే సమయం. వ్యాపారులు విస్తరణ కార్యక్రమాలు ముమ్మరం చేస్తారు. ఉద్యోగులకు విధుల్లో ఒత్తిడులు తొలగుతాయి. 2, 3తేదీల్లో శారీరక రుగ్మతలు. ప్రయాణాలలో మార్పులు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**సింహం :మఖ, పుబ్బ, ఉత్తర 1వపాదం**

కొత్త వ్యూహాలతో ముందడుగు. కార్యక్రమాలను సకాలంలో పూర్తిచేయడంలో మిత్రులు సహకరిస్తారు. ఆస్తి వ్యవహారాలలో నెలకొన్న ప్రతిష్టంభన తొలగుతుంది. ఇంటి నిర్మాణయత్నాలలో అవాంతరాలు తొలగుతాయి. ఒక సంఘటన మీలో మార్పునకు కారణమవుతుంది. వ్యాపారుల కృషి ఫలిస్తుంది. 3,4తేదీల్లో అనారోగ్యం. శ్రీరామ రక్షాస్తోత్రాలు పఠించండి.

**కన్య : ఉత్తర 2,3,4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ఆర్థిక వ్యవహారాలలో చిక్కులు తొలగుతాయి. ఆప్తుల నుంచి సహాయం అందుకుంటారు. నిరుద్యోగుల సుదీర్ఘ నిరీక్షణ ఫలిస్తుంది. వాహనాలు, ఆభరణాలు కొంటారు. వ్యాపారస్తులు భాగస్వాముల చేయూత మరింత తీసుకుంటారు. ఉద్యోగస్తులకు గతం నుంచి వేధిస్తున్న సమస్యలు తీరతాయి. 4,5 తేదీల్లో శ్రమ తప్పదు. బంధువుల నుంచి ఒత్తిడులు. హనుమాన్ ఛాలీసా పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

క్రమేపీ కొన్ని సమస్యలు పరిష్కారమై ఊరట చెందుతారు. ఆలోచనలు కార్యరూపంలో పెడతారు. అనుకున్న కార్యక్రమాలు పట్టుదలతో పూర్తి. ఆదాయం సంతృప్తికరం. ఆస్తి విషయంలో ఒప్పందాలు చేసుకుంటారు. వాహనాలు, స్థలాలు కొంటారు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు ఎదురైన చికాకులు తొలగే సమయం. 1,2 తేదీల్లో వృథా ఖర్చులు. దైవదర్శనాలు. శ్రీకృష్ణాష్టకం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వపాదం, అనూరాధ, జ్యేష్ఠ**

కొన్ని ఇబ్బందులు చాకచక్యంగా పరిష్కారం. జీవితంలో మరపురాని సంఘటన ఎదురవుతుంది. ఆదాయం కాస్త పెరిగి అవసరాలు తీరతాయి. స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధి చేకూరుతుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారస్తులకు భాగస్వాముల నుంచి ప్రోత్సాహం అందుతుంది. ఉద్యోగస్తులకు సంతోషకరమైన సమాచారం. 3,4 తేదీల్లో దేవాలయాలు సందర్శిస్తారు.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

ఆదాయానికి మించిన ఖర్చులు. శ్రమ మరింత పెరుగుతుంది. ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి. వివాదాలకు దూరంగా ఉండడం మంచిది. ప్రత్యర్థుల అంచనాలు ముందే గ్రహించి జాగ్రత్తపడండి. సోదరులతో అకారణంగా తగాదాలు నెలకొంటాయి. వ్యాపారస్తులకు లాభాలు స్వల్పంగానే కనిపిస్తాయి. ఉద్యోగస్తులకు పనిభారం పెరిగి ఆదుర్దా చెందుతారు. 2, 3 తేదీల్లో శుభవార్తలు. ధనప్రాప్తి. ఈశ్వరారాధన చేయండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

ఆస్తుల వ్యవహారాలలో కొన్ని ఒప్పందాలు చేసుకుంటారు. నిరుద్యోగులను ఒక ప్రకటన ఆకట్టుకుంటుంది. ఎంతటి వారినైనా వాగ్ధాటితో ఆకట్టుకుంటారు. చేజారిన కొన్ని డాక్యుమెంట్లు ఆశ్చర్యకరంగా దక్కించుకుంటారు. వ్యాపారస్తులు కొత్త పెట్టుబడులు సమకూరి ఉత్సాహంగా గడుపుతారు. ఉద్యోగస్తులకు మార్పులు ఊరటనిస్తాయి. 5,6 తేదీలలో దూర ప్రయాణాలు. ఆదిత్య హృదయం పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

అనుకున్న కార్యక్రమాలు మరింత వేగంగా పూర్తి. ఆదాయం సమృద్ధిగా ఉండి అవసరాలు తీరతాయి. ఇంటి నిర్మాణయత్నాలలో అవాంతరాలు తొలగుతాయి. వ్యాపారస్తులకు అనుకోని లాభాలు. ఉద్యోగస్తులకు ప్రోత్సాహకరం. మార్పులు కొన్ని అనుకూలిస్తాయి. పారిశ్రామిక, రాజకీయవేత్తలు, కళాకారులకు ఖ్యాతి పెరుగుతుంది. 3,4 తేదీల్లో వృథా ఖర్చులు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

పరిస్థితులు అనుకూలించి ముందుకు సాగుతారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కారం. వాహన సౌఖ్యం. వ్యవసాయదారులకు కొత్త ఆశలు చిగురిస్తాయి. ఆదాయం గతం కంటే కొంత పెరుగుతుంది. వ్యాపారస్తులకు లాభసాటిగా ఉంటుంది. ఉద్యోగస్తులు విధుల్లో మీ సత్తా చాటుకుంటారు. 5,6 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

చంద్రం




నటుడు సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ ఆత్మహత్య అనంతరం బాలీవుడ్‌లో జరుగుతున్న సంఘటనలను చూస్తే, తీగ లాగితే డొంక కదిలిన చందంగా ఉంది. నెపోటిజమ్ (బంధుప్రీతి) అనేది పైకి కనిపిస్తున్నా, చాపకింద నీరులా వ్యాపించిన డ్రగ్స్ వ్యవహారం, అక్రమ ఆర్థిక లావాదేవీలు ఒక్కొక్కటిగా బట్టబయలు అవుతున్నాయి. కేవలం సినిమా రంగానికి చెందిన వారే కాకుండా, మహారాష్ట్రలో అధికారంలో ఉన్న నేతల తనయులు ఈ ఆత్మహత్యకు తెర వెనుక సూత్రధారులనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



# సుశాంత్ మరణంతో డొంక కదిలిందా!

సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ ఆత్మహత్య చేసుకున్న రోజున, బాలీవుడ్ నుండి అతని నిష్క్రమణ కొందరికి జీవితాలను తల్లకిందులు చేస్తుందని బహుశా ఎవరూ ఊహించి ఉండరు. గతంలో బాలీవుడ్‌లో అర్ధాంతరంగా తనువు చాలించిన కొందరు తారల వార్తల తరహాలోనే సుశాంత్ మరణం సైతం కొద్దిరోజులు వార్తాపత్రికల్లో దర్శనమిచ్చి, ఆ తర్వాత కనుమరుగు అవుతుందని కొందరు భావించారు. కానీ ఉజ్వల భవిష్యత్తు ఉన్న ఓ నటుడి బలవన్మరణం వెనుక కారణాలు వెలుగు చూడాల్సిందే అని అతని అభిమానులు కోరుకోవడం, అందుకు వారు సోషల్ మీడియాను ఆయుధంగా స్వీకరించడంతో మొత్తం కథ మారిపోయింది. ఇప్పుడు సుశాంత్ ఆత్మహత్యకు కారకులు ఎవరనేది బయటపడేంత వరకూ కుటుంబ సభ్యులతోపాటు అభిమానులూ మిన్నకుండరన్నది స్పష్టమై పోయింది. సుశాంత్ కేసును సీబీఐకు అప్పగించడమే వారు సాధించిన తొలి విజయంగా భావించాలి.

సుశాంత్ ఆత్మహత్యకు ముందు జరిగిన కొన్ని పరిణామాలు, అతని మాజీ కార్యదర్శి సైతం సూసైడ్ చేసుకున్న వైనం, అనంతరం జరిగిన నాటకీయ పరిణామాలు, అందులో సుశాంత్ ప్రియురాలు రియా చక్రవర్తి పాత్ర.. ఇవన్నీ ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. సుశాంత్ ఆత్మహత్య వెనుక రియా హస్తం ఏ మేరకు ఉందనేది ప్రశ్నార్థకమే అయినా... తాజాగా ఆమె అతనికి డ్రగ్స్‌ను అలవాటు చేసేందనే




ఆరోపణలు రావడం ఈ కేసులో కీలకాంశమైంది. ఆ మధ్య వరకూ బాలీవుడ్, అండర్ వరల్డ్ చెట్టపట్టాలు వేసుకుని తిరగడం అందరికీ తెలిసిందే. ఇక డ్రగ్స్ సంస్కృతీ అక్కడ బాగానే వ్యాపించిందనేదీ అందరికీ అవగతమే. కానీ... సుశాంత్ మరణం వెనుక ఆర్థిక లావాదేవీలతో పాటు డ్రగ్స్ కోణం కొత్తగా బయటపడటం మాత్రం చాలామందిని ఆశ్చర్యానికి గురి చేసింది.

ఇక సుశాంత్ మరణానంతరం నెపోటిజమ్‌పై జాతీయ స్థాయిలో జరుగుతున్న చర్చ మునుపెన్నడు జరగలేదన్నది వాస్తవం. ఓ నిశ్శబ్ద విప్లవం రాబోతున్న ఛాయలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. ప్రజలు నట వారసుల సినిమాలను వ్యతిరేకించడం మొదలుపెట్టారు. సోషల్ మీడియాలో గడిచిన మాసంలోనే వీరిని అన్ ఫ్రెండ్ చేసిన వాళ్లు లక్షలలో ఉన్నారు. అంతేకాదు... యూట్యూబ్‌లో వీరికి సంబంధించిన ట్రైలర్ విడుదలైతే దానిని లైక్ చేసిన వారికంటే... డిస్ లైక్ చేసిన వారి సంఖ్య అధికంగా ఉంటోంది. మహేశ్ భట్ రూపొందించిన 'సడక్-2' సినిమా ఇందుకు తాజా ఉదాహరణ. ఈ సినిమా ట్రైలర్ ప్రపంచవ్యాప్తంగా అత్యధికులు డిస్ లైక్ చేసిన ప్రచార చిత్రాలలో రెండో స్థానంలో నిలిచింది. ఇక ఇటీవల డిస్నీ హాట్ స్టార్‌లో విడుదలైన ఈ సినిమాపై వచ్చినన్ని విమర్శలు ఇటీవల కాలంలో మరే చిత్రానికీ రాలేదు. ముఖ్యంగా ఐ.ఎం.డి.బి.లో వీక్షకులు ఈ చిత్రానికి పదికి గానూ ఒకే ఒక్క రేటింగ్ ఇవ్వడం చిత్రం. ఐఎండీబీ చరిత్రలోనే ఇంత తక్కువ రేటింగ్ వచ్చిన సినిమా మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు. మహేశ్ భట్ అవుట్ డేటెడ్ డైరెక్టర్ అయిపోయాడని, 'సడక్-2' చిత్ర కథాకథనాలు దారుణంగా ఉన్నాయని విమర్శించడం ఒక ఎత్తుకాగా, ఇందులో ఆయన కూతురు అలియాభట్ ప్రధాన పాత్ర పోషించడం, ప్రధానంగా మహేశ్ భట్, సుశాంత్ ప్రియురాలు రియా చక్రవర్తికి కావాల్సిన వాడు కావడం అనేది ఈ సినిమాపై ఇంత ప్రతికూల ప్రభావం పడటానికి కారణం అయ్యాయి. ఈ నేపథ్యంలోనే సెట్స్‌పై ఉన్న తమ చిత్రాల నుండీ బాలీవుడ్ నట వారసులను తప్పిస్తే బాగుంటుందేమోననే ఆలోచన కొందరు దర్శక నిర్మాతలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే రాజమౌళి ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఆర్.ఆర్.ఆర్.' నుండి అలియా భట్‌ను తొలగించబోతున్నారనే వార్తలు వస్తున్నాయి.

## బంధుప్రీతి నిజమేనా!

బాలీవుడ్‌లోనే కాదు.. దక్షిణాది చిత్రసీమల్లోనూ బంధుప్రీతి అనేది ఉంది. అయితే కేవలం నట వారసులు కాబట్టే వీరికి ఆదరణ లభిస్తోందనడం ఎంతమాత్రం సబబు కాదు. నిజం చెప్పాలంటే... ఎంత స్టార్ కిడ్స్ అయినా.. ఒకటి రెండు సినిమాల వరకే ఆ ఛరిష్మా ఉపయోగపడుతుంది తప్పితే అత్యధిక కాలం ఆ ట్యాగ్ లైన్‌తో కొనసాగలేరన్నది వాస్తవం. నటన పట్ల మక్కువ, కఠోర శ్రమ, కాస్తంత అదృష్టం ఉంటేనే ఎవరైనా సినిమా రంగంలో రాణిస్తారు. నట వారసులూ అందుకు మినహాయింపు కాదు. ఇక అవకాశాలు దక్కని వారు, విజయాలను అందుకోలేక పోయిన వారు 'నెపోటిజమ్'ను సాకుగా చూపుతున్నారు. నిజం మాట్లాడితే, ఇవాళ పాపులర్ హీరోలుగా ఉన్న అనేక మంది స్వశక్తితో పైకి వచ్చిన వారే. వీరు కూడా ఓ స్థాయికి వచ్చిన తర్వాత తమ సోదరులనూ ఈ రంగంలోకి తీసుకొస్తున్నారు. అన్ని రంగాల్లో మాదిరే తమ వాళ్లను తమ తమ రంగాల్లోకి తీసుకురావాలనే కోరిక ప్రతి ఒక్కరికీ ఉంటుంది. అదే చిత్రసీమలోనూ జరుగుతోంది. ఈ దృష్టితో ఆలోచించకుండా బంధుప్రీతితో సినిమా రంగం నిండిపోయిందనే వితండ వాదన చేయడం సరైనది కాదు. ఎందుకంటే... తెరపై ఇలా మెరిసి అలా రక్కున మాయమైన నట వారసుల జాబితా కూడా పెద్దదే! వాళ్లకి ఈ 'బంధుప్రీతి' ఎంతమాత్రం ఉపయోగపడలేదు!

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.200/-



వెల : ₹.250/-


వెల : ₹.250/-



వెల : ₹.200/-


వెల : ₹.120/-



వెల : ₹.250/-


వెల : ₹.250/-


వెల : ₹.90/-



వెల : ₹.200/-


వెల : ₹.200/-



వెల : ₹.300/-



వెల : ₹.495/-



వెల : ₹.400/-



వెల : ₹. 499/-



వెల : ₹.399/-

**నవయుగ భారతి ప్రచురణలకై సందర్శించండి**

**సాహిత్య నికేతన్**
3-4-852, కేశవనిలయం,
బర్కత్‌పురా, హైదరాబాద్ -27
దూరవాణి : 040-27563236

**సాహిత్య నికేతన్**
ఏలూరురోడ్, గవర్నరుపేట,
విజయవాడ - 2.
దూరవాణి : 9440643348

**సాహిత్య నికేతన్**
విశాఖపట్నం
సెల్ : 90000 66776

**భారతమాత బుక్ హౌస్**
తిరుపతి
సెల్ : 92999 01355

Volume : 72 Issue : 46
JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1,
Lingampally, Kachiguda, Hyderabad-500027
email : jagritiweekly@gmail.com, web : jagritiweekly.com

Date of Publication Every Monday : 31.08.2020
Date of Posting Every Friday : 28.08.2020
Postal Regn. No. HSE/1052/2018-2020
RNI Regd. No. 3270/57

MAHAVEER
GROUP OF INSTITUTIONS
( AN ISO 9001-2008 CERTIFIED INSTITUTION)





Counseling Code : MHVR
MAHAVEER
INSTITUTE OF SCIENCE & TECHNOLOGY
Estd : 2001
(Approved by AICTE, Affiliated to JNTUH, Hyderabad.)
Email: mist.admissions@gmail.com | website : mist.ac.in
Courses Offered :
B.Tech | ECE | EEE | CSE | IT | MECH. | CIVIL | AERO | PG
M.Tech | DE & CS | VLSI | PE & ES | CSE | SE | AMS | MBA

Counseling Code : MHVR
MAHAVEER
Institute of Science & Technology Polytechnic (2nd Shift)
Estd : 2009
(Approved by AICTE, Affiliated to SBTET Hyderabad.)
Email: mist.admissions@gmail.com | website : mist.ac.in
Courses Offered :
Polytechnic | DECE | DEEE | DCME | DME | DCE

Counseling Code : AARM
AAR MAHAVEER
ENGINEERING COLLEGE
Estd : 2010
(Approved by AICTE, Affiliated to JNTUH, Hyderabad.)
Email: aarm.admissions@gmail.com | website : aarm.ac.in
Courses Offered :
B.Tech | ECE | EEE | CSE | MECH.

MAHAVEER DEGREE COLLEGE
For Arts, Commerce & Science
Estd : 2014
(Approved by Telangana Govt. - Affiliated to Osmania University)
Email: mdc.admissions@gmail.com | website : mahaveerdegreecollege.com
Courses Offered :
B.Com | Computers & General | B.Sc | MSCs

Sponsored by MAHAVEER EDUCATIONAL SOCIETY

FOR NRI / MANAGEMENT SEATS
Ph: 040-29880079, 29880086, 29880089, 29880081, 29880087
Cell : 9542001907, 9849944411
Vyasapuri, Bandlaguda, Post : Keshavgiri, Hyderabad - 500 005.